జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 20, ఫిబ్రవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



## ప్రకృతి సేద్యానికి అమెరికా సంస్థల సహకారం

- దావోస్‌లో జరిగిన చర్చల్లో భాగంగా ఎపికి వచ్చిన పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సంస్థల ప్రతినిధులు
- ప్రకృతి వ్యవసాయంపై రైతు సాధికార సంస్థతో కలిసి పనిచేసేందుకు త్వరలో ఒప్పందం
- సాగు, ఉత్పత్తి, సాకేంతికత, మార్కెటింగ్ వంటి అంశాల్లో సాయం

**అమరావతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దఎత్తున ప్రమోట్ చేస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 5 లక్షల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం సాగవుతోంది. 2028-29 నాటికి రాష్ట్రంలో 40 లక్షల మంది రైతులను ప్రకృతి

మిగతా.. 2లో







# బాల నటి.. భలే భలే!

- జగన్ ముద్దుపెట్టిన బాలనటికి 'బంగారు నంది' ఇవ్వాల్సిందే
- కాంచన, కన్నాంబ, సావిత్రి నటన కూడా ఆ బాలనటుల ముందు బలాదూరే
- ఏడుస్తూ అత్యద్భుతంగా నటించిన చిన్నారి రెడ్డి పాప
- అమ్మఒడి ఆగిపోయిందంటూ రోదించిన మరో చిన్నారి రెడ్డమ్మ
- దానికి సానుభూతి పోగేసిన వైసీపీ మీడియా
- ఆ పేద 'రెడ్డెమ్మ'కు బెజవాడలో ఓ బంగారుషాపు, పెట్రోల్‌బంకు
- ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో లక్షల ఫీజులిచ్చి ఖరీదైన చదువు
- మరి ఆ పేదరాలికి అమ్మఒడి ఇచ్చిన అధికారిపై వేటు వేయరా?
- చిన్నప్పటి నుంచే చిన్నారులకు కులపిచ్చి అంటించిన వైసీపీ బ్యాచ్
- జనం ఓడించినా జగన్‌కు ఇంకా సిగ్గురాలేదా?
- జగన్ జిమ్మిక్కులకు చిన్నారులే దొరికారా?
- సోషల్‌మీడియాపై జగన్నాటకంపై నెటిజన్ల ఫైర్

**కామెంట్**



(మార్తి సుబ్రహ్మణ్యం)


జగన్ జైలు నుంచి వెళుతుండగా, జగనన్నా ప్లీజ్ ఒక్కసారి.. అంటూ ఏడుస్తున్న ఆ చిన్నారి దేవికారెడ్డిని చూసిన జగన్ కారు ఆపారు. షిక్కటి షిరునవ్వు షిందిస్తూ పైకి రమ్మని పిలిచారు. అంతే ఆ చిన్నారి ముఖంలో వెయ్యి ఓల్టుల బల్బు వెలిగింది. జగనన్న కూడా ఆ చిన్నారి నుదుట ముద్దు పెట్టుకున్నారు. యధాలాపంగా నెత్తిమీద చేయివేశారు. ఆ చిన్నారి కూడా మురిసిముక్కలయిపోయి జగనన్నతో సెల్ఫీ దిగింది. వెళుతూ వెళుతూ జగన్ మామకు ఫ్లైయింగ్ కిస్ ఇచ్చింది.

ఆ తర్వాత వైసీపీ అధికార మీడియా రంగ ప్రవేశం చేసింది. స్టార్ట్ కెమెరా అనగానే.. ఇంకో చిన్నారి మహితారెడ్డి "నాకు ఇప్పటి వరకూ అమ్మఒడి రాలేదు. అదే జగన్ మామ ఉన్నట్టయితే ఎప్పుడో వచ్చేది" అని ఏడుపు లంకించుకుంది. కట్ చేస్తే.. వైసీపీ మీడియా దానిని రాత్రి వరకూ తన చానెల్‌లో లాగించేసింది. సరే.. పొద్దున్నే సాక్షిలోనూ అదే 'ఏడుపుగొట్టు వార్త' అనుకోండి.

– ఇదీ వల్లభనేని వంశీని జైలులో పరామర్శించిన తర్వాత విజయవాడ జైలు వద్ద జగన్– ఆ చిన్నారులు

మిగతా.. 2లో





అమ్మఒడి రాలేదని చెప్పిన చిన్నారి దేవికా రెడ్డి చదివే స్కూల్ ఫీస్ వివరాలు

DELHI PUBLIC SCHOOL, VIJAYAWADA

Fee Information – 2023-24

Fee Structure

| | | |
|---|---|---|
| 1 | Fee Structure LKG & UKG | Rs. 88,000/- |
| | I to V | Rs. 1,02,000/- |
| | VI to X | Rs. 1,11,000/- |
| | XI to XII | Rs. 1,43,500/- |







## మిర్చిని కొనుగోలు చేయండి

- కేంద్రమంత్రికి మిర్చి కొనుగోలుపై లేఖ రాసిన సీఎం చంద్రబాబు



**అమరావతి:** మిర్చి రైతుల దుస్థితిపై కేంద్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. కేంద్రం వెంటనే మిర్చిని కొనుగోలు చేయాలంటూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం లేఖ రాశారు. మార్కెట్ ఇంట ర్వెన్షన్ స్కీమ్ కింద వెంటనే మిర్చిని కొనుగోలు చేయాలని కోరారు. మిర్చి రైతుల పరిస్థితి, మార్కెట్‌లో ధరల పతనంపై ఈ నెల14 వ తేదీన ఢిల్లీలో జరిగిన సమావేశం వివరాలను లేఖలో పేర్కొన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాద నలను కూడా సమర్పించిందని వివరించారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మార్కెట్ ఇంటర్వేన్షన్ పథకం కింద మొత్తం వ్యయంను కేంద్రమే భరించాలని ఈ సందర్భంగా సీఎం కోరారు. ఈ యేడాది మిర్చి విస్తీర్ణం పెరిగి ఉత్పత్తి కూడా అధికంగా ఉందని తెలిపారు. గతంలో ప్రత్యేక వెరైటీ మిర్చి క్వింటాల్ 20 వేల రూపాయలు ఉండగా నేడు ఆ ధర 13 వేలకు పడిపోయిందని పేర్కొన్నారు. సాధారణ రకం మిర్చి క్వింటాల్‌కు 11 వేల రూపాయలకు పడిపోయిందని వివరించారు.

పలు దేశాలకు ఎగుమతి తగ్గడం వలన ఈ పరిస్థితి నెలకొందని వెల్లడించారు. రైతులు ధరలు పడిపోవడం వలన తీవ్ర ఆర్థిక నష్టాలకు గురవుతున్నారన్నారు.

వెంటనే కేంద్ర మార్కెట్ ఇంటర్వేన్షన్ పథకం కింద కొనుగోళ్లు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖలో కోరారు.

## ఆధునిక టెక్నాలజీ తోడుంటే 'ఆధ్యాత్మిక' విస్తరణ సులభం



- ఏపీలో టెక్నాలజీ ఆధారిత ఆధ్యాత్మిక సేవలు ప్రపంచానికే ఆదర్శం
- ఆధ్యాత్మిక పర్యాటకంలో అగ్రగామిగా వెలుగొందుతున్న ఏపీ
- ఏఐ వంటి టెక్నాలజీ వచ్చినా మానవ సమాజాన్ని నడిపించేది ఆ దేవదేవుడే..
- హారీ పోర్టర్ కథలు, ఎవెంజర్స్ ఎండ్ గేమ్‌ల కంటే భారతీయ పురాణగాథలే మిన్న
- అంతర్జాతీయ దేవాలయాల కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో (ఐటీసీఎక్స్)- 2025 ముగింపు సభలో మంత్రి లోకేష్

**తిరుపతి, మహానాడు:** వాట్సాప్ ద్వారా ఆలయాల సేవలు, డ్రోన్ నిఘా వంటి సాంకేతిక ఆధారిత కార్యక్రమాలతో ఆధ్యాత్మిక సంప్ర దాయాలను కాపాడుతూ ఆలయాల పాలనా వ్యవస్థను ఆధునీకరించడంలో ఏపీ ప్రభుత్వం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. తిరుపతి ఆషా కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన అంతర్జాతీయ దేవాలయాల కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో (ఐటీసీఎక్స్) 2025 ముగింపు కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... సానుకూల నాయకత్వం పరివర్తనాత్మక మార్పును తీసుకురాగలదనడానికి ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు నిదర్శనం. వేంకటే శ్వర నిత్య అన్నదాన పథకాన్ని తిరుమలలో ఏప్రిల్ 6, 1985న ప్రారంభించారు. ఈ పథకాన్ని నందమూరి తారక రామారావు కోటి కార్పస్ ఫండ్ తో ప్రతిరోజూ రెండు వేలమంది

మిగతా.. 2లో



కూటమి సర్కారు వచ్చాక... ఫీజు రీ యింబర్స్‌మెంట్‌పై బెంగపోయింది..

03



జగన్‌కి అసెంబ్లీకి వెళ్లేందుకు మొహం చెల్లదు

03



కేసీఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్

03



ఏ క్షణంలోనైనా జైలుకు వెళ్ళే మనిషి జగన్!

06



రైతులను దళారులకు అమ్మేసిన చంద్రబాబు

02

## టీడీపీలో కార్యకర్తే అధినేత!

- ఈ మాటకు శిరసావహిస్తున్నా...
- ఇకపై నియోజకవర్గ పర్యటనల్లో ముందుగా కార్యకర్తలతో సమావేశం
- తిరుపతి పర్యటనలో కార్యకర్తలు, నేతలతో మంత్రి సమన్వయ సమావేశం
- ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేత
- కార్యకర్తల సమస్యలు తెలుసుకుని, అండగా నిలబడాలని నేతలకు లోకేష్ పిలుపు



**తిరుపతి, మహానాడు:** తెలుగుదేశం పార్టీ కోటి సభ్యత్వాలతో అతిపెద్ద కుటుంబంగా మారిన సందర్భంలో కార్యకర్తే అధినేత అని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఆచరణలో చూపెట్టారు. కార్యకర్తే అధినేత అన్న మాటను శిరసావహిస్తూ తన తిరుపతి నియోజకవర్గ పర్యటనలో ముందుగా పార్టీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇకపై ఏ నియోజకవర్గ పర్యటనకు వెళ్లినా మొదట కార్యకర్తలతో భేటీ కావాలని మంత్రి నారా లోకేష్ నిర్ణయించుకున్నారు. బాబు ష్యూరిటీ– భవిష్యత్ కు గ్యారెంటీ, పార్టీ సభ్యత్వం, ఓటర్ వెరిఫికేషన్, టీడీపీ యాప్ లో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలు, నాయకులతో ఎక్కువ సమయం కేటాయించనున్నారు. అందులో భాగంగానే బుధవారం తిరుపతిలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేష్..

మిగతా.. 9లో

## ఢిల్లీ సీఎంగా రేఖ గుప్తా

- కార్పొరేటర్ నుంచి సీఎం వరకు రేఖా గుప్తా విజయయాత్ర



**న్యూఢిల్లీ,మహానాడు:** రాజకీయ అనుభవం లేకపోయినా, ప్రజాసేవే తన బలంగా మార్చుకున్న రేఖా గుప్తా, ఢిల్లీ ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా కూడా పనిచేయలేదు. కానీ విద్యార్థి దశలోనే ఏబీవీపీ ద్వారా రాజకీయ ప్రవేశం చేసి, బీజేపీలో కీలక నేతగా ఎదిగారు.

పితంపుర కౌన్సిలర్‌గా, షాలీమార్ బాగ్-బి కార్పొరేటర్‌గా విజయాలు సాధించి, ప్రజల నమ్మకాన్ని పొందారు. 2015, 2020లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడినా, 2025లో 29,000 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. బీజేపీ ఢిల్లీ శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఆమె, పదవులకతీతంగా ప్రజల్లో ఉండే నాయకురాలిగా గుర్తింపు పొందారు. ప్రజాసేవ పట్ల ఆమె నిబద్ధత, పార్టీపై ఉన్న విశ్వాసమే ఆమెను ముఖ్యమంత్రి స్థాయికి తీసుకువచ్చాయి. "కార్పొరేటర్‌గా మొదలైన ప్రయాణం.. ముఖ్యమంత్రిగా నిలిచిన ఘనత!



## నాలుగేళ్ల నుండి రిజిస్ట్రేషన్ కాని ప్లాట్‌లు కొన్న పేదలకు శుభవార్త

- మార్చి 31 వరకు గడువు విధించిన ప్రభుత్వం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్, మహానాడు:** సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఎల్ఆర్ఎస్ (లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం) అమలులో వేగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణ యించింది. ఈ పథకం అమలు ప్రగతిపై బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుదిల్ల శ్రీధర్ బాబులు పాల్గొన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం అమలులో వేగం పెంచే కార్యక్రమంలో భాగంగా 25 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ప్లాట్ కొనుగోలు దారులకు ఈ రాయితీని మార్చి 31 వరకు వెసులు బాటు కల్పించింది. దీంతో పాటు వ్యక్తిగతంగా ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకోని వారికి, లే అవుట్లో పెద్ద సంఖ్యలో విక్రయం కాకుండా ఉన్న ప్లాట్ల రెగ్యుల రైజేషన్కు పలు వెసులుబాట్లు కల్పిస్తూ మంత్రులు నిర్ణయం తీసుకున్నారు.

మిగతా.. 8లో

## తెలంగాణలో కచ్చితంగా ఉప ఎన్నికలు

- ఏప్రిల్ 27న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ
- సీఎంపై ప్రజల్లో ఇంతలా వ్యతిరేకత ఇంత తొందరగా వస్తుందను కోలేదు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



**హైదరాబాద్, మహానాడు:** ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభను నిర్వహించ నున్నట్లు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశమైంది. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు, సిల్వర్ జూబ్లీ వేడుకలు, పార్టీ సంస్థాగత ఎన్నికలపై చర్చించారు. పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వ హించాలని కేసీఆర్ నిర్ణయించారు. ఏడాది పొడవునా ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించాలని శ్రేణులకు సూచిం చారు. పార్టీ కమిటీలు వేయాలని నిర్ణయించిన కేసీఆర్.. కమిటీ లకు ఇన్‌చార్జ్‌గా హరీశ్ రావుకు బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే మహిళా కమిటీ లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఏప్రిల్ పదో తేదీ నుంచి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని.. ప్రతి జిల్లా కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కొనసాగుతుం దన్నారు. అనుబంధ సంఘాల పటిష్టత కోసం సీనియర్ నేతలతో సబ్ కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. అదే నెల 10న పార్టీ ప్రతినిధుల సభ ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, తెలంగాణ సమాజం సామాజిక చారిత్రక అవసరాల దృష్ట్యా తెలంగాణ చరిత్ర ప్రసవించిన బిడ్డ బీఆర్ఎస్ అన్నారు. తెలంగాణ రాజకీయ అస్తిత్వ పార్టీగా, తెలంగాణ

మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 20, ఫిబ్రవరి 2025 ||



# తెలంగాణలో కచ్చితంగా ఉప ఎన్నికలు

**మొదటి పేజీ తరువాయి..**

రాష్ట్రాన్ని సాధించి తన చారిత్రక బాధ్యతను నిర్వహించిన తెలంగాణ ప్రజల పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు. తెలంగాణ సమాజం లోని అన్ని వర్గాలను చైతన్య పరుస్తూ, తెలంగాణ అస్తిత్వ పటిష్టతకు కృషి చేస్తూ, గతం గాయాల నుంచి కోలుకున్న తెలంగాణను తిరిగి అవే కష్టాల పాలు కాకుండా, గత దోపిడీ వలస వాదుల బారిన పడకుండా, తెలంగాణ ప్రజలకు శాశ్వత విజయం అందించే దిశగా సమస్త పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా పటిష్ట నిర్మాణం చేసి అటు పార్టీ విజయాన్ని.. ఇటు తెలంగాణ ప్రజల శాశ్వత విజయం కోసం సమాంతరంగా పని చేయాలని సమావేశంలో పాల్గొన్న నాయకులకు అధినేత కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు.

పార్టీ ఆవిర్భవించి 25వ సంవత్సరం లోకి అడుగిడుతున్న నేపథ్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలను ఏడాది కాలం పాటు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థి, మహిళా సహా పార్టీ అనుబంధ విభాగాలను మరింత పటిష్ట పరచాలన్నారు. అందుకోసం సీనియర్ పార్టీ నేతలతో కూడిన సబ్ కమిటీ లను ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రారంభించాలన్నారు.



తెలంగాణ అస్థిత్వ పార్టీ బీఆర్ఎస్ అని కేసీఆర్ అన్నారు. గత గాయాల నుంచి కోలుకున్న రాష్ట్రాన్ని మళ్లీ అదే స్థితికి కాంగ్రెస్ నేతలు తీసుకు వెళుతున్నారని.. మరోసారి దోపిడీ, వలస వాదుల బారిన పడకుండా తెలంగాణను కాపాడాలన్నారు. తెలంగాణ ప్రజలకు శాశ్వత విజయమే బీఆర్ఎస్ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ గ్రాఫ్ పడి పోతుందన్న కేసీఆర్.. సీఎంపై ప్రజల్లో ఇంతలా వ్యతిరేకత ఇంత తొందరగా వస్తుం దనుకోలేదన్నారు. తెలంగాణలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆదాయం పడి పోతుందని.. మనం ఏటా ఆదాయం పెంచుకుంటూ వెళ్లామన్నారు. అదే అధికారులు ఉన్నారు కానీ. ఈ ప్రభుత్వానికి పని చేయించుకోవడం రావడం లేదన్నారు.

# ప్రకృతి సేద్యానికి అమెరికా సంస్థల సహకారం

**మొదటి పేజీ తరువాయి..**

వ్యవసాయం వైపు మళ్లించి..తద్వారా 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం సాగయ్యేలా చూడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వ ఆ దిశగా ప్రయత్నాలు చేస్తోంది.

రైతు సాధికార సంస్థ ద్వారా ప్రకృతి సేద్యం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరిస్తోంది. మరోవైపు ఈ రంగంలో ఉన్న అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేస్తోంది. మరోవైపు రైతుకు అవసరమైన తోడ్పాటును అందించేందుకు వివిధ సంస్థలతో కలిసి పనిచేయనుంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల దావోస్ పర్యటనలో పలు సంస్థలను రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో ఏపితో కలిసి పనిచేసేందుకు రావాలని పలు సంస్థలను ఆహ్వానించారు.







ఈ క్రమంలో నాడు చంద్రబాబుతో భేటీ అయిన పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సంస్థల ప్రతినిధులు ఏకంగా వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిశారు. పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఛైర్మన్ క్రెయిగ్ కోగట్, అపరేటింగ్ అడ్వైజర్ గినా మెగ్‌కార్తీ, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సీఈవో కీత్ అగోఢా ముఖ్యమంత్రితో సచివాలయంలో సమావేశం అయ్యారు. దావోస్ సమావేశానికి కంటిన్యూ మీటింగ్‌గా జరిగిన నేటి సమావేశంలో రానున్న రోజుల్లో కలిసి పనిచేసే అంశాలపై చర్చించారు.

ప్రకృతి వ్యవసాయం, భిన్నమైన వాతావరణాన్ని తట్టుకోగల పంటలను అందించడం, రైతు నుండి వినియోగదారు వరకు ఎండ్-టు-ఎండ్ అనుసంధాన వ్యవ స్థను రూపొందించడం, మార్కెట్ డెవలప్‌మెంట్, ఫైనాన్సింగ్, డేటా మేనేజ్ మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయడంపై ఈ సంస్థలు సహాయపడను న్నాయి.

పబ్లిక్, ప్రైవేట్ సంస్థల నుంచి ఆర్థిక సాయాన్ని అందించేందుకు సహకా రాన్నిస్తాయి. ప్రకృతి వ్యవ సాయ పర్యావరణ వ్యవస్థ కోసం ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్‌గా ప్రమోట్ చేస్తాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన రైతు సాధి కార సంస్థతో పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సంస్థలు ఎంఓయూ చేసుకోనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో అవకాశాలను, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను, ప్రస్తుత పరిస్థితులను ఆ సంస్థ ప్రతినిధులకు వివరించారు. ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయని....ఆరోగ్యంపై శ్రద్దపెరుగు తోందన్నారు. తాము తీసుకునే ఆహారంపై వారు అవగాహన కోరుకుంటున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తుల సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ అనేది కీలకం కానుందని అన్నారు. ఆ దిశగా తాము రైతులను, ఉత్పత్తి దారులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రకృతి సేద్యం తన కల అని చెప్పిన సిఎం....రైతుల్లో చైతన్యం తెచ్చి అనుకున్న లక్ష్యాలను సాధిస్తాం అని అన్నారు. దీనికి సహకరించాల్సిం దిగా ఆ సంస్థల ప్రతినిధులను కోరారు.

# ఆధునిక టెక్నాలజీ తోడుంటే 'ఆధ్యాత్మిక' విస్తరణ సులభం

**మొదటి పేజీ తరువాయి..**

యాత్రికులకు అన్నదానంతో ప్రారంభించారు. ప్రస్తుతం ప్రతివారం సాధారణ రోజుల్లో 1,59,500, వారాంతాల్లో 2,05,000 భోజనాలను టిటిడి అందిస్తోంది. ప్రస్తుతం ఈ పథకంలో కార్పస్ ఫండ్ రెండు వేల కోట్లకు పెరిగింది. 2001 నవంబర్ లో చంద్రబాబు ప్రాణదానం ట్రస్ట్ ఏర్పాటుచేశారు. ఔట్ పేషెంట్/ఇన్ పేషెంట్ చికిత్సలు, శస్త్రచికిత్సలు, మందులు, భోజనం సదుపాయాలను ఈ ట్రస్ట్ అందిస్తోంది. ప్రస్తుతం రూ.440 కోట్లతో ఈ ట్రస్ట్ విస్తృతమైన సేవలు అందిస్తోంది. 588 గ్రామీణ వైద్య శిబిరాల ద్వారా 1,80,466 మందికి, 212 ఎపిలెప్సీ క్లినిక్‌ల ద్వారా 1,38,066 మందికి, ప్రత్యేక క్లినిక్‌ల ద్వారా 57,610 మంది రోగులకు, 8,500 మంది క్యాన్సర్ రోగులకు సర్జరీలు చేయడం ద్వారా ప్రాణదాన ట్రస్ట్ విస్తృత ఆరోగ్యసేవలు అందించింది.

## ఆధ్యాత్మిక పర్యాటకంలో అగ్రగామిగా ఏపీ

గ్లోబల్ టెంపుల్ మేనేజ్‌మెంట్ లీడర్‌లు, విధాన రూపకర్తలు, నిపుణులను ఒకచోట చేర్చడంలో ఈ కార్యక్రమం మైలురాయిగా నిలుస్తుంది. మొన్నటిరోజున ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద జరిగిన పవిత్ర మహా కుంభమేళాకు హాజరైనందుకు ఎంతో ఆనందించాను. ఈరోజు తిరుపతిలోని ఆలయాల మహా కుంభ్ లో పాలుపంచుకోవడం ఆనందంగా భావిస్తున్నాను. దేవాలయాలు ఆధ్యాత్మికంగానే గాక ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా అందిపుచ్చుకోవడంలో ముందున్నాయన డానికి ఐటీసీఎక్స్ నిదర్శనం. ఆధ్యాత్మిక పర్యాటకం, టెంపుల్ టూరిజంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉంది, తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఏటా 36-40 మిలియన్ల మంది యాత్రికులు సందర్శిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 27,105 దేవాలయాలకు నిలయంగా ఉంది. ఆలయ సంరక్షణ, ఆధునీకరణ, భక్తుల విశ్వాసాన్ని పెంపొందించడానికి మేం కట్టుబడి ఉన్నాం. ఐటీసీఎక్స్ అనేది దేవాలయాలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఒక ప్రపంచ సమాజం. భారతదేశ ఆలయ ఆర్థిక వ్యవస్థ ?5-6 లక్షల కోట్ల అంచనా విలువతో అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ 2047 దార్శనికతకు ఐటీసీఎక్స్- 2025 మద్దతు నిస్తుంది, ఆలయాల స్థిరమైన వృద్ధి, ఆలయ పర్యావరణ వ్యవస్థ సాధికారతపై దృష్టి సారిస్తుంది. 'వసుధైవ కుటుంబం' (ప్రపంచం ఒకే కుటుంబం) తత్వాన్ని స్వీకరించి, ఆలయ నిర్వహణలో ప్రపంచ సహకారాన్ని ఐటీసీఎక్స్ ప్రోత్సహిస్తోందని లోకేష్ తెలిపారు.

## ఆలయాల్లో సేవలకు వాట్సాప్, డ్రోన్ల వినియోగం

వాట్సాప్ ఇంటిగ్రేషన్ ద్వారా ఆలయాల సేవలను మెరుగుపరచడం, భక్తులందరికీ ఆలయ ప్రవేశాన్ని సులభతరం చేయడం, మరింత సౌకర్యవంతంగా చేయడం మా ముఖ్యమైన కార్యక్రమాల్లో ఒకటిగా ఎంచుకున్నాం. దర్శనం, టిక్కెట్ బుకింగ్‌లు, ఆలయ సేవల కోసం పొడవైన క్యూలలో వేచి ఉండే ఇక్కట్లు ఇకపై ఉండరాదన్నది మా ఉద్దేశం. అందుకే మేం ఆలయ సేవల కోసం వాట్సాప్‌ను వన్-స్టాప్ ప్లాట్‌ఫారమ్‌గా ఉపయోగిస్తున్నాం. భక్తులు ఇప్పుడు వారి ఆలయ టిక్కెట్‌లను నేరుగా వాట్సాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఆచారాల గురించి సమాచారాన్ని యాక్సెస్ చేయవచ్చు. వారి మొబైల్ ఫోన్‌ల నుండి రియల్ టైమ్ సేవలను అందుకోవచ్చు. ఎటువంటి అవాంతరాలు లేకుండా భక్తులకు ఆలయాలను చేరువ చేయడమే మా లక్ష్యం.

యాత్రికుల భద్రత, క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం డ్రోన్ నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ప్రధాన దేవాలయాలను సందర్శించే యాత్రికుల సంఖ్య పెరుగుతున్నందున వారి భద్రత చాలా ముఖ్యం. బ్రహ్మోత్సవాలు, పెద్ద ఆలయ ఉత్సవాల సమయంలో నిర్వహణ సవాలుగా మారుతోంది. ఈ సమస్య పరిష్కారానికి కీలకమైన పుణ్యక్షేత్రాలలో డ్రోన్ ఆధారిత నిఘాను ప్రవేశపెట్టాం. డ్రోన్లు క్రౌడ్ కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రమాదాలను నివారిస్తాయి. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడంలో అధికారులకు సహాయపడతున్నాయి.

## అందరం కలిసి సంస్కృతిని కాపాడుకోవాలి

హిందూ ధర్మం సనాతన ధర్మం. మానవ సేవే మాధవ సేవ. సాటి మనుషులకు, సమాజానికి సేవ చేస్తే, ఆ దేవుడికి సేవ చేసినట్టేనని హిందూ ధర్మం చెబుతోంది. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి. ఇప్పుడు ప్రపంచం మొత్తం మన వైపు చూస్తుంది. మన సంస్కృతిలో ఆలయాలు, పండుగలు, పూజలు అనేది కీలకమైన భాగం. ఇది మన జీవన విధానం. దీన్ని ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉంది. ఎంత టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వచ్చినా మానవ సమాజాన్ని నడిపించేది ఆ దేవదేవుడే. ఇస్రో శాస్త్రవేత్తలు సైతం...వారి ప్రయోగం సక్సెస్ కావాలని చెంగాలమ్మ ఆలయంలోనో...తిరుమల శ్రీవారి ఆలయంలోనో ముందు రోజు పూజలు చేస్తారు.

నమ్మకం మాత్రమే గాక ఇదొక నిజం. అందుకే ప్రజల్లో భక్తి భావాన్ని పెంచేందుకు ప్రభుత్వాలు, దేవాలయ వ్యవస్థలు, సంస్థలు కృషి చేయాలి....దీని ద్వారా సమాజంలో మంచిని పెంచవచ్చు. పిల్లలకు గంటలకు గంటలు ఫోన్లు, ట్యాబ్ లు ఇచ్చే పద్ధతికి స్వస్తి చెప్పాలి. ఆ సమయంలో మన పురాణాలు, మన దేవుళ్లు, మన పండుగలు, ఆచారాల గురించి చెప్పే పుస్తకాలు ఇవ్వాలి. సూపర్ మ్యాన్, స్పైడర్ మ్యాన్ ల కంటే మన హనుమాన్ శక్తివంతుడు అని చెప్పాలి. హారీ పోర్టర్ కథల కంటే మన పురాణాల్లో ఉన్న కథలు ఇంకా బాగుంటాయని వివరించాలి. ఎవెంజర్స్ ఎండ్ గేం, క్యాప్టెన్ అమెరికా, అవతార్ సినిమాల కంటే మన శ్రీకృష్ణుడి లీలలు, మన శ్రీ రాముడి గొప్పతనం గురించి చెప్పాలి. అందరం కలిసి సంస్కృతిని కాపాడుకోవాలి.

## అర్చకుల సంక్షేమానికి చర్యలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఆలయాల పరిపాలనను మెరుగుపరచడానికి సిబ్బంది, భక్తుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. యువగళం పాదయాత్రలో నేను ఇచ్చిన హామీ మేరకు అర్చకుల పారితోషికం నెలకు ?10వేల నుండి ?15వేలకు పెంచారు. పరిమిత ఆదాయం ఉన్న దేవాలయాలకు ధూప దీప నైవేద్య పథకం కింద నెలకు 5వేల నుంచి ?10వేల వరకు సాయం అందిస్తున్నారు. ప్రధాన ఆలయాల్లో వైదిక సంప్రదాయాలను నిలబెట్టేందుకు వైదిక కమిటీలు ఏర్పాటు చేశారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఆలయాల పునర్నిర్మాణం కోసం పునరు ద్ధరణ, పరిరక్షణ కమిటీలు ఏర్పాటుచేశారు. ప్రధాన దేవాలయాల ద్వారా నిరుద్యోగ వేద పండితులకు నెలకు ?3వేల ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డుల్లో బ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులను చేర్చేందుకు ఎండోమెంట్స్ చట్టం సవరణ చేశారు. ఆలయాల ఆస్తుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ధార్మిక పరిషత్‌లను బలోపేతం చేస్తున్నారు.

## రూ.134 కోట్లతో ఆలయాల అభివృద్ధి

గత ఏడు నెలల్లో 73 దేవాలయాల అభివృద్ధి, పునరుద్ధరణ కోసం కూటమి ప్రభుత్వం ?134 కోట్లు మంజూరు చేసింది. దేవాలయాల్లో పరిశుభ్రత కోసం యాంత్రిక పారిశుద్ధ్య పద్ధతులను అమలు చేస్తున్నారు. ఆలయాల్లో సేవలను మెరుగుపరచడానికి ఐవీఆర్ఎస్ ఉపయోగించి వినూత్న ఫీడ్‌బ్యాక్ మెకానిజమ్ ఏర్పాటుచేశారు. భారతదేశంలోని దేవాలయాలు కేవలం మతపరమైన కేంద్రాలు మాత్రమే కాదు, అవి మన సాంస్కృతిక జీవనాధారాలు. విభిన్న ఆధ్యాత్మిక సమూహాలు.

తమ ఆలోచనలను పంచుకోవడానికి, ఉత్తమ పద్ధతులను అవలంబించడానికి, బలమైన ఆలయ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి ఐటీసీఎక్స్ - 2025 ఒక వేదికగా నిలుస్తుందని నేను విశ్వసిస్తున్నాను. ఆలయాల సంక్షేమం, ఆధ్యాత్మిక పర్యాటకం, పవిత్ర స్థలాల సమగ్ర అభివృద్ధికి ఐటీసీఎక్స్ నిబద్ధతతో పనిచేస్తోంది. ఈ కార్యక్రమానికి అతిథ్య రాష్ట్రంగా, భాగస్వామిగా ఉన్నందుకు ఆంధ్రప్రదేశ్ గర్విస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఆలయాల నిర్వహణ, భవిష్యత్తును రూపొందించే ఇటువంటి నిర్మాణాత్మకమైన చర్చల కోసం నేను ఎదురుచూస్తుంటానని మంత్రి లోకేష్ అన్నారు.

# బాల నటి.. భలే భలే!

**మొదటి పేజీ తరువాయి..**

జమిలిగా నటించిన అద్భుత దృశ్యాలు.

' ఆ బాలనటి బ్రహ్మాండంగా నటించింది. తనకు మంచి భవిష్యత్తు ఉంది. ఇంత చిన్న వయసులో అంత అద్భుతంగా నటిస్తుందను కోలేదు" అని ఆ దృశ్యంపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు చేసిన తొలి వ్యాఖ్యను ఇప్పుడు యావత్ సోషల్‌మీడియా సైనికులు ఫాలో అవుతున్నారు.

నిజమే. ఒక కన్నాంబ.. ఒక కాంచన.. చిటికెడు పసుపు డబ్బా కుంకుమ జయంతి.. పిలవగానే కళ్ల వెంట గంగాభవానీ వచ్చి పలకరించే సుజాత, శారద.. వీరికి మించి మహానటి సావిత్రిని తలదన్నేలా ఏడుపు సీనును పండించిన ఆ చిన్నారి 'రెడ్డమ్మ'కు బంగారు నంది అవార్డు ఇవ్వాల్సిందే. లేకపోతే కళాకారులకు అన్యాయం చేసినట్లేనన్నది సోషల్‌మీడియా సైనికుల ఉవాచ.

ఆ చిన్నారుల్లో ఎంత టాలెంట్ లేకపోతే.. ఎన్ని రోజులు రిహార్సల్ చేయకపోతే.. అలా జీవించగలుతారు? సినిమాల్లో కనిపించే రెగ్యులర్ చైల్డ్ ఆర్టిస్టులు కూడా ఈర్ష్యపడే స్థాయిలో, అలవోకగా నటనలో జీవించారంటే.. ఆ చిన్నారి రెడ్డమ్మలకు కచ్చితంగా ఆస్కార్‌కూ అర్హురాలేనేమోననిపిస్తుంది. ఓసారి ఆస్కార్ అవార్డుల కమిటీ ఆ కోణంలో ఆలోచిస్తే బాగుంటుంది. వారికి అలాంటి ఐడియా తట్టకపోతే.. స్వయంగా జగనన్నే ఆస్కార్ జ్యూరీకి ఓ సిఫార్సు లేఖ రాస్తే ఆ బాలనటుల పుణ్యం పుచ్చినట్లే!




ఇంతకూ జగనన్నను చూసేందుకు తెగ ఏడ్చి, మహానటి సావిత్రిని కూడా ఈర్ష్యపడేలా చేసిన ఆ చిన్నారి దేవికారెడ్డి, అమ్మఒడి రాలేదన్న మహితారెడ్డిది పాపం కడు పేద కుటుంబమట. ఎంత పేదరికమంటే... తినడానికి తిండి లేక, చదవుకునేందుకు ఫీజు కట్టుకోలేనంత దరిద్రమట. అందుకే అప్పటి జగన్ సర్కారు ఆ చిన్నారి రెడ్డమ్మ కుటుంబంపై దయతలచి, 'అమ్మఒడి' కింద ఏడాదికి 15 వేల రూపాయలు ఇచ్చింది. ఆ అమ్మఒడికి ఇచ్చిన ఆ 15 వేల రూపాయలకు మరికొన్ని లక్షల రూపాయలు జత చేసి, 'నిరుపేదలు మాత్రమే' చదువుకునే 'ఢిల్లీ పబ్లిక్ స్కూల్', 'రవీంద్రభారతి'లో చేరారట.

అంతేనా? ఆ చిన్నారుల కుటుంబానికి బెజవాడలోనే ఓ బుల్లి బంగారుషాపు కూడా ఉందట. అది మూడునాలుగు ఫ్లోర్లకు మించి ఉండదండోయ్. అంతేనా? ఏదో పొట్టపోసుకునేందుకు బెజవాడలోనే, ఒక బుల్లి పెట్రల్‌బంక్ కూడా ఉందట. మరి ఇంత కడు పేదరాలయిన చిన్నారి రెడ్డమ్మ కుటుంబానికి తెల్లకార్డుతోపాటు, అమ్మఒడి ఇచ్చిన అధికారికి పౌరసన్మానం చేయడం పాలకుల బాధ్యత. ఇప్పటికయినా సదరు అధికారి గొప్పతనం తెలిసినందున, ఆ పనిని అర్జెంటుగా పాలకులు చేయకపోతే.. కనీసం జగనన్నా నడుం బిగించక తప్పదు.

జగన్‌తో సెల్ఫీ తీయించుకున్న చిన్నారి దేవికారెడ్డి.. తనకు అమ్మఒడి రాలేదన్న మహితారెడ్డి చదివేది బెజవాడ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, రవీంద్రభారతి స్కూల్‌లో. అక్కడ ఎల్‌కేజీ నుంచి యుకేజీ వరకూ ఫీజు 88 వేల రూపాయలు. 1 నుంచి 5 వ తరగతి వరకూ 1,02,000 రూపాయలు. 6 నుంచి 10 వరకూ 1,11,000 రూపాయలు. 11 నుంచి 12 వ తరగతి వరరూ 1,43,500 రూపాయలు. మరి పాపం ఆ పేదింటి రెడ్డమ్మకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అన్నేసి లక్షలు పెట్టి ఎవరు చదివిస్తున్నారన్నదే ప్రశ్న.

లేకపోతే కేవలం అమ్మఒడి ఇచ్చే డబ్బుతోనే ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, రవీంద్రభారతి యాజమాన్యం దేవికారెడ్డి-మహితారెడ్డిని అనుమతిస్తున్నాయా? కొంపతీసి ఢిల్లీ పబ్లిక్‌స్కూల్-రవీంద్రభారతి యాజమాన్యం, ఈ మధ్య కొత్తగా ఏమైనా 'చైల్డ్ ఆర్టిస్టు కోటా' పెట్టిందా? అనేది ఇంకో డౌటనుమానం! మరి అలాంటి ఫెసిలిటీ ఉందని తెలిస్తే.. బెజవాడలోని వేలాదిమంది పిల్లలు, ఏ ఫిలింనగరంలోనో, ఏ యూసఫ్‌గూడలోని ఫిలిం ట్రైనింగ్ సెంటర్‌లోనో చేరి చైల్డ్ ఆర్టిస్టు సర్టిఫికెట్ తెచ్చుకుంటారు కదా?!

జనంలో జగన్ ఇమేజ్ పెంచేందుకు చిన్నారులను వాడుకోవడం అరాజకీయమే. ఇలాంటి వికృత రాజకీయ ఎత్తుగడ వల్ల.. జనంలో జగన్ ఇమేజ్ పోగవుతుందేమోగానీ, చిన్నారులకు సైతం కులగజ్జి అంటించిన పుణ్యం కూడా మూట కట్టుకుంటున్నారన్నది అంతే నిజం. చిన్నారులకూ రాజకీయ కులగజ్జి అంటించడం చూస్తే.. వైసీపీ వ్యూహబృందాలు, జగన్ కోసం సమాజంలోని ఏ వర్గాన్నీ వదిలేలా లేరని అర్ధమవుతూనే ఉంది.

ఇక మిగిలింది హిజ్రాలే. మరి వారి సేవలు ఎప్పుడు వినియోగిస్తారో వైసీపీ రాజకీయ వెండితెరపై చూడాలి. జగనన్నకు అలాంటి వయో-లింగ బేధాలేమీ లేవని, నిన్నటి 'మగప్రేమ'తోనే తేలి పోయింది కాబట్టి.. పెద్దగా సిగ్గుపడాల్సిన అవసరం కూడా ఉండదు.

ఇంతకూ ఆ చిన్నారిని ఎత్తుకున్న వ్యక్తి.. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎస్వీరంగారావు కంటే మహానటుడని అతగాడు వివిధ సందర్భాల్లో, వివిధ భంగిమల్లో దిగిన ఫొటోలే చెబుతున్నాయి. అంటే జగన్ ఇమేజ్‌ను క్రేన్లతో పైకి లేపే ఇలాంటి 'లేకి బృందానికి', అతగాడే నాయకుడని అర్థమవుతూనే ఉంది. జగన్ సాక్షిగా రెగ్యులర్‌గా జరిగే.. ఇలాంటి అన్ని 'లేకి ఆలోచన'లకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకుడు అతగాడేమోనని పించడం సహజం.

ఇప్పటివరకూ చిన్నపిల్లలు దేవుడితో సమానం. బాలవాక్కు బ్రహ్మవాక్కు అనేవారు. ఎందుకంటే వారికి కల్లాకపటం తెలియదు కాబట్టి. కానీ ఇప్పుడు బెజవాడ బాలనటులు దేవికారెడ్డి-మహితారెడ్డి అద్భుతం, అనితర సాధ్యం, అనన్యసామాన్యమైన నటన పుణ్యాన ఆ సామెతను నమ్మేరోజులు పోయినట్లే. ఈ ఓవరాక్షన్‌పై సోషల్‌మీడియా సైన్యం జగన్-ఆయన సలహాదారులపై విరుచుకుపడుతోంది.

'నీకు ఓడినా ఇంకా సిగ్గు రాలేదా?.. చిన్నపిల్లలను రాజకీయాలకు వాడుకోవడానికి సిగ్గులేదూ'.. నీ రాజకీయ ప్రయోజనం కోసం తల్లి, చెల్లిని వాడుకున్నావు. ఇప్పుడు చిన్నపిల్లలనూ బలిచేస్తావా?' అంటూ కామెంట్లు, గ్రాఫిక్కులతో శివమెత్తుతున్నారు.

అన్నట్లు.. బాలనటి దేవికారెడ్డి మాచర్ల వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి దగ్గర బంధువట. ఇంతకూ పిన్నెల్లి ఎవరంటారా?.. అదేనండి. గత ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లోకి చొరబడి ఈవీఎంను నేలకేసి కొట్టిన దేశభక్తుడు.

ఇప్పుడు గుర్తుకొచ్చిందా? హమ్మయ్య! పులిపాడు గ్రామానికి చెందిన ఈ బాల నటీమణుల తండ్రి పేరు లక్ష్మణ్‌రెడ్డి. ఆయన బెజవాడ ఎంజీ రోడ్‌లోని బీఎన్ఆర్ గోల్డ్‌షాప్ అధిపతి.

ఇంతకూ.. జగనన్న ముందు అద్భుతంగా ఏడిచి, మీడియా ముందు అంతే మహాద్భుతంగా నటించిన బాలనటులైన దేవికారెడ్డి, మహితారెడ్డికి.. అమ్మఒడి పథకం మంజూరు చేసిన అధికారికి దండేసి దణ్ణం పెట్టి, సన్మానం చేస్తున్నారా? లేదా? ఇదీ ఇప్పుడు కూటమి సర్కారుపై సోషల్‌మీడియా సైనికులు సంధిస్తున్న ప్రశ్న.

# రైతులను దళారులకు అమ్మేసిన చంద్రబాబు

- మిర్చి రైతుల బాధలు అవస్థలు పట్టని ప్రభుత్వం
- తెగుళ్లతో రాష్ట్రంలో మిర్చి దిగుబడి తగ్గింది
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో మద్దతు ధర పడిపోయింది
- రాష్ట్రంలో ఇప్పుడు ఏ పంటకు మద్దతు ధర లేదు
- అయినా పట్టించుకునే నాధుడే లేడు
- గుంటూరు మిర్చియార్డులో మిర్చి రైతులను కలిసిన మాజీ సీఎం, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్.జగన్
- మిర్చియార్డులో రైతులతో ముఖాముఖి. వారి సమస్యలు ఆరా

**గుంటూరు:** గుంటూరులోని మిర్చియార్డును మాజీ సీఎం, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించారు. యార్డులో మిర్చి రైతులను కలుసుకున్న ఆయన, వారి సమస్యలు, అగచాట్లు ఆరా తీశారు. ఒకవైపు రైతులు, మరోవైపు పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలి రావడంతో గుంటూరు మిర్చియార్డు క్రిక్కిరిసి పోయింది.

కష్టాల్లో ఉన్న తమను పరామర్శించేందుకు వచ్చిన వైయస్ జగన్‌ను చూసిన మిర్చి రైతులు, తమ గోడు వెళ్లబోసుకున్నారు. బాధలు చెప్పుకున్నారు. కష్టాలను మిర్చి రైతులు వివరించారు. వారి కష్టాలు, బాధలు సావధానంగా విన్న ఆయన, వారికి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా వైయస్ జగన్ ఏమన్నారంటే..: రాష్ట్రంలో రైతుల కష్టాలను సీఎం చంద్రబాబు అస్సలు పట్టించుకోవడం లేదు. సచివాలయానికి, సీఎం ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న గుంటూరు మిర్చియార్డులో రైతులు పడుతున్న అవస్థలు చంద్రబాబునాయుడుకి అర్ధం కావడం లేదు. ఆయనకు రైతుల కష్టాలు కనిపించినా కళ్లు మూసుకున్నారు. వారిని మరిన్ని కష్టాల పాల్జేస్తున్నారు. గుంటూరు మిర్చియార్డులో ఇప్పుడు మిర్చి పంటకు కనీసం రూ.10 వేలు, రూ.11 వేల ధర కూడా రావడం లేదు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను కూడా అమ్ముకోలేని పరిస్థితుల్లో రైతులు ఉన్నారు.


ఒకవైపు తెగుళ్ల తాకిడితో మామాలుగా 20 క్వింటాళ్లకు పైగా రావాల్సిన దిగుబడి కాస్తా ఇవాళ 10 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్లకు పడిపోయింది. మరోవైపు గత ఏడాది వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.21 వేల నుంచి రూ.27 వేలు ధర పలికిన మిర్చిని ఇవాళ కనీసం రూ.10 వేల నుంచి రూ.11 వేలకు కూడా కొనే నాధుడు లేకుండా పోయాడు. రైతులకు పెట్టుబడి కింద కనీసం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలు ఖర్చు అవుతుంది.

అటు తెగుళ్లతో తగ్గిన దిగుబడి. ఇటు రేటు లేక అమ్ముకోలేని పరిస్థితులతో రైతులు బ్రతుకు దుర్భరంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా కందులు, పెసర, మినుములు, టమోట, ప్రత్తి ఇలా ఏ పంట తీసుకున్నా రైతులకు గిట్టుబాటు ధర రాని పరిస్థితి నెలకొంది.

రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు రైతులను దళారీలకు అమ్మేశాడు. పంటలకు మద్దతు ధర రావడం లేదు. మరోవైపు వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల జీవితాల్లో వెలుగులు చూడ్డానికి ప్రవేశపెట్టిన సంస్కరణలు ఏవీ ఈరోజు కనిపించడం లేదు. గ్రామాల్లో ఆర్బీకే వ్యవస్థ, ఈ-క్రాప్ విధానం నిర్వీర్యం అయిపోయాయి. దీంతో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.

ఆ రోజుల్లో ధాన్యం సేకరణకు ప్రభుత్వం రూ.65 వేల కోట్లు ఖర్చు చేసి రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించే ప్రయత్నం చేస్తే.. ఇవాళ ధాన్యం కొనుగోళ్లలో ఏ రైతుకూ కనీస గిట్టుబాటు రాలేదు. గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.7 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి ప్రతి రైతునూ ఆదుకున్నాం.

ఇవాళ రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించాలన్న ఆలోచన లేదు, ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలన్న ఆలోచన లేదు. ఒక నెంబరుకు ఫోన్ చేస్తే ప్రభుత్వం స్పందిస్తుందన్న నమ్మకం రైతులకు కనిపించడం లేదు. ఆర్బీకేలు, వాటికి అనుసంధానంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లతో సహా ప్రతి వ్యవస్థ నిర్వీర్యం అయిపోయింది. ఇవాళ రైతులు ఎరువులు కొనాలంటే ప్రైవేటు డీలర్ల దగ్గర కొనాల్సి వస్తుంది. వాళ్లు కనీసం రూ.100 నుంచి రూ.400 అధికంగా బ్లాకులో అమ్ముతున్నారు. క్వాలిటీ కంట్రోల్ చేసే విషయంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. గతంలో ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అమ్మే పరిస్థితి ఉంటే.. ఇవాళ నాణ్యమైనవేవీ రైతులకు రాకుండా పోతున్న పరిస్థితి నెలకొంది. పెట్టుబడి సాయం కింద పీఎం కిసాన్ కాకుండా ప్రభుత్వం తాము ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వకుండా రైతులను మోసం చేసింది. రైతులకు సున్నావడ్డీ కూడా రావడం లేదు.



చంద్రబాబునాయుడు ఇప్పటికైనా కళ్లు తెరిచి గుంటూరు మిర్చియార్డుకు రావాలి. రైతుల కష్టాలను తెలుసుకుని వారికి కనీస గిట్టుబాటు ధర వచ్చే విధంగా చంద్రబాబునాయుడు నిలబడకపోతే రాబోయే రోజుల్లో తీవ్రమైన పరిణామాలుంటాయని రైతుల తరపున హెచ్చరిస్తున్నాను.

ప్రతిపక్ష నాయకుడు ఇక్కడికి వచ్చి రైతులతో మాట్లాడే ప్రయత్నం చేస్తుంటే.. కనీస పోలీసు భద్రత కూడా ఇవ్వని పరిస్థితి కనిపిస్తోంది. నేను చంద్రబాబునాయుడుకి చెబుతున్నా.. ఎల్లకాలం ఈ ప్రభుత్వం ఉండదు. రేపు మీరు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే మాదిరిగా పోలీసు భద్రత తీసేస్తే ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచన చేసుకోవాలి. మీరు చేస్తున్నది కరెక్టా? కాదా? ఆలోచన చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 20, ఫిబ్రవరి 2025


# కేసీఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్

- అధికారంలోకి వస్తామని కేసీఆర్ పగటికలలు కంటున్నారు.
- 14 నెలల నుంచి అజ్ఞాతంలో ఉన్న వ్యక్తికి అభివృద్ధి ఎలా కనబడుతుంది?
- రెవెన్యూ ,హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్: ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిందన్నట్లు ఫాంహౌస్ దాటని దొరవారు అధికారంపై పగటికలలు కంటున్నారని రెవెన్యూ , హౌసింగ్ ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. అధికారం కోల్పోగానే తనకు పదేళ్లు అధికారం కట్టబెట్టిన ప్రజలను మరిచి అజ్ఞాతంలోకి వెళ్లిన కేసీఆర్ కి, 14 నెలలుగా కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధి ఏ విధంగా కనబడుతుంది.

కేసీఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్ , ఎన్నికలప్పుడు మాత్రమే ఆయనకు ప్రజలు గుర్తుకొస్తారు. 14 నెల నుంచి ఫాంహౌస్ దాటని ఆయన స్థానిక ఎన్నికలు వస్తున్నాయని ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. మేడిగడ్డ కుంగినప్పుడు గాని, రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు గాని ఆయనకు ప్రజలు గుర్తుకురాలేదు. శాసనసభలో కీలకమైన తీర్మానాలు, కులగణన, ఎస్సీవర్గీకరణ, భూభారతి బిల్లు, తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానానికి కూడా కేసీఆర్ హాజరుకాలేదు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సైతం గైర్హాజరయ్యారు.

తెలంగాణ ప్రజలు కష్టపడి కేసీఆర్‌ను ప్రతిపక్షంలో కూర్చోబెడితే, ఆయన ఏనాడు ప్రజాతీర్పును గౌరవించలేదు. అసెంబ్లీ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షనేత అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించాలి. కానీ కేసీఆర్ తాను ప్రజలు జవాబుదారీగా లేనట్లుగా ప్రవర్తిస్తున్నారు. ఆయన అసెంబ్లీకి వస్తే ఆయన పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఏవిధంగా తిరోగమనదిశలోకి తీసుకెళ్లారు, పదేళ్లలో ఆయన చేసిన నిర్వాకాలను తప్పులను ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ 14నెలల్లో తాము సాధించిన అభివృద్ధిని సవివరంగా కేసీఆర్ ముందుంచుతాం.

కాంగ్రెస్ భవిష్యత్ గురించి కాకుండా ముందుగా కేసీఆర్ తన భవిష్యత్తు, తన పార్టీ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే బాగుంటుంది. కేసీఆర్ భవిష్యత్తుపై గత పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. పార్లమెంటు తీర్పే భవిష్యత్తులో ఉంటుంది. విపరీతమైన అప్పులు చేసి నెత్తినమీద మిత్తిల భారం పెట్టిపోయారు. పదేళ్లలో కేసీఆర్ చేసిన అప్పులకు తెలంగాణ సమాజం ఆయనను ఎన్నటికీ క్షమించదు.నువ్వు వద్దు, నీ పాలన వద్దూ మహాప్రభో అని తెలంగాణ ప్రజలు వదిలించుకున్నా ఇంకా వదిలేది లేదన్నట్లుగా కేసీఆర్ వ్యవహారం ఉంది.

# జగన్‌కి అసెంబ్లీకి వెళ్లేందుకు మొహం చెల్లదు

- సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్
- అన్ని పథకాలను ఈ ఏడాది నుంచే అమలు చేయండి
- సభకు రాకుండా మారం చేసే వైసీపీ అధ్యక్షుడికి, పార్టీ ఎమ్మెల్యేలకు ప్రజల మధ్య తిరిగే అర్హత లేదు
- అసెంబ్లీకి వెళ్ళే దమ్ము లేకుంటే వైసీపీ ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామాలు చేయాలి
- ఎక్స్ వేదికగా ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి

విజయవాడ: "సూపర్ సిక్స్ పథకాలపై చంద్రబాబు తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలి.కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించే దమ్ము వైసీపీ కి లేదు. నేరస్థులను, దౌర్జన్యం చేసిన వాళ్ళను జైలుకి వెళ్లి పరామర్శ చేసే జగన్ కి అసెంబ్లీ కి వెళ్లేందుకు మొహం చెల్లదు. అసెంబ్లీకి వెళ్ళని జగన్ కి, వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రజా సమస్యల మీద మాట్లాడే నైతికత లేదని " ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు.

ఇంకా షర్మిలారెడ్డి ఏమన్నారంటే.. సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్. పథకాల అమలు ఎప్పుడు అని అడిగితే 9 నెలల్లో 90 కారణాలు చెప్పారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలపై , సూపర్ సిక్స్ పథకాలపై మీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని.. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది.

ఈనెల 28న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో సూపర్ సిక్స్ పథకాలకు అగ్రభాగం నిధులు కేటాయించండి. అన్ని పథకాలను ఈ ఏడాది నుంచే అమలు చేయండి. ఇచ్చిన మాటను వెంటనే నిలబెట్టుకోండి. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించాల్సిన వైసీపీ కి అసెంబ్లీకి వెళ్ళే దమ్ములేదు. జగన్ మోహన్ రెడ్డికి నేరస్థులను, దౌర్జన్యం చేసిన వాళ్ళను.. జైలుకెళ్లి పరామర్శించే సమయం ఉంటుంది కానీ ప్రజల కోసం అసెంబ్లీకి



వెళ్లేందుకు మాత్రం మొహం చెల్లదు. ప్రెస్‌మీట్‌లు పెట్టి పురాణం అంతా చెప్పే తీరిక దొరుకుతుంది కానీ అసెంబ్లీలో పాలకపక్షాన్ని నిలదీసే ధైర్యం జగన్ కి లేదు. ప్రజలు 11 మందిని గెలిపిస్తే శాసనసభకు రాకుండా మారం చేసే వైసీపీ అధ్యక్షుడికి, పార్టీ ఎమ్మెల్యేలకు ప్రజల మధ్య తిరిగే అర్హత లేదు. ప్రజల సమస్యల మీద మాట్లాడే నైతికత అసలే లేదు. వైసీపీ ఎమ్మెల్యేలు ఈ సారైనా అసెంబ్లీకి వెళ్ళాలని డిమాండ్ చేస్తున్నాం. సభా వేదికగా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి. ఈ సారి కూడా అసెంబ్లీకి వెళ్ళే దమ్ము లేకుంటే వైసీపీ ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామాలు చేయాలి.





# కూటమి సర్కారు వచ్చాక...
# ఫీజు రీ యింబర్స్‌మెంట్‌పై బెంగపోయింది..

- మంత్రి లోకేష్‌కు మహిళా వర్సిటీ విద్యార్థినుల కృతజ్ఞతలు
- ఇకపై సెమిస్టర్ వారీగా సొమ్ము విడుదల చేస్తాం
- రీసెర్చ్, ఇన్నొవేషన్స్‌పై దృష్టిపెట్టి మంచి పేరు తీసుకురండి
- సంస్కరణల కోసం జగన్‌పై కంటే చంద్రబాబుతో 3 రెట్ల పోరాటం
- పద్మావతి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థినుల భేటీలో మంత్రి లోకేష్

తిరుపతి, మహానాడు:

గత ప్రభుత్వ హయాంలో ఫీజు రీ యింబర్స్‌మెంట్ బకాయిలు వస్తాయో, రావోనన్న ఆందోళనతో చదువుపై దృష్టి పెట్టలేని పరిస్థితులు ఉండేవి, మీరు అధికారంలోకి వచ్చాక బకాయిలు లేకుండా రీ యింబర్స్ మెంట్ సొమ్ము జమ చేస్తుండటంతో టెన్షన్ లేకుండా చదువుకోగలుగుతున్నామని పద్మావతి మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు మంత్రి లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. పద్మావతి యూనివర్సిటీ అధునాతన ఇండోర్ స్టేడియంను ప్రారంభించిన అనంతరం ట్రిపుల్ ఈ మూడో సంవత్సరం విద్యార్థినుల తరగతి గదిని లోకేష్ సందర్శించారు. వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రగిరికి చెందిన మేఘన మాట్లాడుతూ మీ తాతగారు ఎన్టీఆర్ హయాంలో తిరుపతిలో మహిళా వర్సిటీ ఏర్పాటుచేశారు.. రాష్ట్ర విద్యా మంత్రిగా మా సమస్యలపై మీరు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నందుకు ఆనందంగా ఉంది. గతంలో రీ యింబర్స్ మెంట్ సొమ్ము ఎప్పుడు వస్తుందో, అసలు వస్తుందో, రాదోనన్న ఆందోళనకు గురయ్యేవాళ్లం. మీ ప్రభుత్వం వచ్చిక మొదటి సెమిస్టర్ కు సంబంధించిన సొమ్ము బకాయి పెట్టకుండా విడుదల చేయడం ఆనందంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలోని బకాయిలను కూడా విడుదల చేయాల్సిందిగా కోరారు.

మంత్రి లోకేష్ స్పందిస్తూ... ఇకపై ఫీజు రీ యింబర్స్ మెంట్ సొమ్మును సెమిస్టర్ వారీగా విడుదల చేస్తాం. గత ప్రభుత్వం సుమారు రూ. 4 వేల కోట్ల రూపాయల రీ యింబర్స్ మెంట్ బకాయిలు పెట్టి వెళ్లింది. రాష్ట్రం ఆర్థికంగా కుదుటపడ్డాక విడదల వారీగా గత బకాయిలను కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. తిరుపతికి చెందిన విజయలక్ష్మి అనే విద్యార్థిని మాట్లాడుతూ ఇంజనీరింగ్ పూర్తయ్యాక వివిధ అనుబంధ కోర్సులు నేర్చుకోవడానికి పెద్దఎత్తున ఖర్చుచేయాల్సి వస్తోంది.

యూనివర్సిటీలోనే ఉద్యోగాలకు అవసరమైన కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని కోరారు. మంత్రి లోకేష్ స్పందిస్తూ...టెక్నాలజీలో ర్యాపిడ్ గా మార్పులు వస్తున్నాయి. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకునేలా విద్యార్థినులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఉన్నత విద్యావిభాగాన్ని బలోపేతం చేస్తున్నాం. ఇటీవలే విద్యాధికుడైన చైర్మన్ ను నియమించామని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీ విద్యార్థులు రాణించేలా యూనివర్సిటీ విద్యావిధానంలో సమూల మార్పులు తెస్తామని తెలిపారు. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు ఇంజనీరింగ్ విద్యను కూడా సమాంతరంగా అభివృద్ధి చేసి, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తామని లోకేష్ చెప్పారు. మౌనిక అనే విద్యార్థిని మాట్లాడుతూ విద్యతోపాటు స్పోర్ట్స్ కు కూడా ప్రోత్సాహం కల్పించాలని కోరారు.

విద్యాబోధన ఎలాఉందని మంత్రి లోకేష్ ఆరాతీయగా, వర్సిటీలో టీచింగ్ చాలా బాగుందని చెప్పారు. రాజకుమారి అనే విద్యార్థిని మాట్లాడుతూ వర్సిటీలో అందించే ఆహారం కొంచం ఇబ్బందికరంగా ఉంది. మార్పులు చేయాలని కోరారు. రెండు వారాల్లో సరిచేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. వర్సిటీలో ఏర్పాటుచేసిన కొత్త ఇండోర్ స్టేడియంలో 20 రోజుల్లో అధునాతన పరికరాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. వర్సిటీలో ట్రిపుల్ ఈ విద్యను అభ్యసించిన వారికి ప్లేస్ మెంట్స్ 36 శాతం మందికే వచ్చాయి.

ఈ విషయంలో శ్రద్ధ వహించాలని విద్యార్థినులు కోరారు. ట్రిపుల్ ఈ విద్యార్థులకు ఐటిలో శిక్షణ ఇవ్వాలని విద్యార్థినులు విజ్ఞప్తిచేశారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ లో సైతం మంచి అవకాశాలు ఉన్నాయి, రీసెర్చ్, ఇన్నొవేషన్స్ పై దృష్టి పెట్టండి. యూనివర్సిటీకి అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి లభించేలా అధునాతన ఆవిష్కరణలు చేయాలని కోరారు.

కడపకు చెందిన సరీమ్ మాట్లాడుతూ వర్సిటీ హెల్త్ సెంటర్ లో జనరల్ డాక్టర్ తోపాటు సైకాలజిస్ట్‌ను కూడా ఏర్పాటుచేయాలని అన్నారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ జీవితం అన్న మనం అనుకున్నట్టుగా ఉండవు, ఒడిదుడుకులు, అవాంతరాలు ఉంటాయి. నేను 2019లో మంగళగిరిలో ఓటమి చెందినపుడు బాధపడ్డా. తర్వాత ప్రజల్లో మమేకమై అయిదేళ్లు సేవచేశా. రాష్ట్రంలో మూడో అతిపెద్ద మెజారిటీతో అక్కడి ప్రజలు తనను గెలిపించారని అన్నారు.

శిరీష అనే విద్యార్థిని మాట్లాడుతూ... ట్రిపుల్ ఈ లో 70 మంది వరకు విద్యనభ్యసిస్తున్నాం. ఉద్యోగావకాశాలు తక్కువగా ఉంటున్నాయి. నాలుగో సంవత్సరం కోర్సు పూర్తిచేసే లోగానే వివిధ ఉద్యోగాలకు సంబంధించిన కోచింగ్ ఇప్పించండి. ప్లేస్ మెంట్ కౌన్సిలింగ్‌కు ముందే తమకు శిక్షణ ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. లైబ్రరీలో సరిపడా పుస్తకాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తిచేశారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ట్రిపుల్ ఈ విద్యార్థినుల ప్లేస్ మెంట్స్‌కు ఎటువంటి ఢోకా లేదు.

రేణిగుంట, కడపల్లో ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటుచేశాం. కొత్త పరిశ్రమలు రావడానికి అవసరమైన ఎకో సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నాం. డిజైనింగ్‌కు సంబంధించిన యూనిట్లు కూడా వస్తున్నాయని చెప్పారు. హాస్టల్‌లో సోలార్ వాటర్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని పలువురు విద్యార్థినులు కోరారు. హాస్టల్, తరగతి గదుల్లో మరమ్మతులు వచ్చినపుడు వెనువెంటనే చేపట్టాలని అన్నారు.

విద్యార్థినులు చెప్పిన సమస్యలు అన్నింటినీ నోట్ చేసుకున్న మంత్రి లోకేష్ మాట్లాడుతూ రాబోయే మూడునెలల్లో అన్ని యూనివర్సిటీల్లో నిర్మాణాత్మకమైన మార్పులు తెస్తామని, విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. విద్యావ్యవస్థలో సంస్కరణల కోసం తాను జగన్మోహన్ రెడ్డిపై చేసిన పోరాటం కంటే మూడు రెట్లు అధికంగా చంద్రబాబుతో పోరాడుతున్నానని చెప్పారు. సంస్కరణల అమలుకు విద్యార్థినులు అందించిన ఫీడ్ బ్యాక్ తమకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.



**రాప్తాడు నియోజకవర్గం, రామగిరి మండలం, కుంటిమద్ది పంచాయతీ, శేషంపల్లి గ్రామానికి చెందిన చిదిగొండ్ల హరికృష్ణ గత మూడు రోజుల క్రితం ప్రమాదవశాత్తు మరణించగా గ్రామంలోని వారి నివాసానికి మండల టిడిపి నాయకులతో కలిసివెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించిన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత**







# అంతరాష్ట్ర ఎన్‌డిపిఎల్ సరఫరా చైన్ భగ్నం!

- ఖరీదైన సీసాలలో నాసిరకం మద్యం

అమరావతి, మహానాడు: ఆంధ్రప్రదేశ్‌లో అనేక జిల్లాల్లో జరుగుతున్న నాన్–డ్యూటీ పేడ్ లిక్కర్ సరఫరా చైన్‌ను అధికారులు భగ్నం చేశారు. పలువురిని అరెస్టు చేయడంతో పాటు పెద్ద మొత్తంలో అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర టాస్క్ ఫోర్స్ ఈ దీనికి నేతృత్వం వహించి, ప్రైవేట్ రవాణా సేవలు, డిజిటల్ లావాదేవీల ద్వారా నడిచిన విస్తృత నెట్‌వర్క్‌ను వెలుగులోకి తీసుకొచ్చింది. చెన్నైకి చెందిన సరఫరాదారు ఎస్. ప్రభు ఈ అక్రమ మద్యం సరఫరా వ్యవస్థకు కేంద్ర పాత్రధారిగా గుర్తించారు.

### తొలిగా తూర్పు గోదావరి జిల్లాలో వెలుగులోకి..

గత ఏడాది డిసెంబర్ 27న తూర్పు గోదావరి జిల్లాలో తొలిసారిగా ఈ కేసు వెలుగులోకి వచ్చింది. రాజమండ్రి(ఉత్తరం) పోలీసులు ఎక్సైజ్ సవరణ చట్టం 2020 కింద సెక్షన్ 34(a)(1) మేరకు ఎఫ్ఐఆర్ నంబర్ 378/2024 నమోదు చేశారు. మొత్తం 112 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

అందులో జానీ వాకర్, గ్లెన్‌మోరాంజీ, చివాస్ రిగల్, జాక్ డేనియల్స్ వంటి ప్రీమియం బ్రాండ్లు ఉన్నాయి. రాజమండ్రికి చెందిన బుర్ల బాలకృష్ణ, ముప్పన రవికుమార్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలలోని నాణ్యతా లోపాలు, మూతలలో తేడాలు కనిపించడంతో అవి కేవలం ఎన్ డి పి ఎల్ కాదని, నకిలీ మద్యం కూడా ఉండొచ్చని అనుమానం వ్యక్తమైంది. దర్యాప్తులో ఈ మద్యం చెన్నైలోని ఎస్.ప్రభు నుండి సరఫరా అయిందని పోలీసులు నిర్ధారించారు. ప్రభు ఆంధ్రప్రదేశ్‌లోని అనేక అక్రమ విక్రయదారులకు ప్రధాన సరఫరాదారి ఉన్నాడు.

### 'పశ్చిమ'లో మరో కేసు

కీలక ఆధారాలపై ఎస్ టి ఎఫ్ దర్యాప్తును ముమ్మరం చేసింది. జనవరి ఎనిమిదోతేదీన భీమవరంలో నంబర్ 09/2025 కింద కేసు నమోదు చేశారు. ఒక మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు నుండి 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ప్రధాన నిందితుడు భీమవరానికి చెందిన కొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు సహా ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ కేసులో కూడా మద్యం సరఫరా ప్రణాళికా బద్ధంగా సాగిందని, ఇక్కడా చెన్నైకి చెందిన ప్రభు ఈ వ్యవస్థను నడిపిస్తున్నట్టు తేలింది.

### విజయవాడ కేంద్రంగా మరో అక్రమ రవాణా

జనవరి 12న విజయవాడలో మరో ఎన్‌డిపిఎల్ కేసును పోలీసులు గుర్తించారు. చివాస్ రిగల్, జానీ వాకర్ గోల్డ్ లేబుల్ రిజర్వ్ లాంటి 12 సీసాలను స్వాధీనం చేసుకుని ఎఫ్ఐఆర్ నంబర్ 4/2025 నమోదు చేశారు. ఈ కేసులో వెంకటరమణ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన ఇద్దరు డ్రైవర్లను అరెస్టు చేశారు. నిందితుల విచారణలో, చెన్నై నుండి ప్రైవేట్ రవాణా సేవల ద్వారా మద్యం అక్రమ రవాణా జరుగుతోందని తేలింది. వెంకటరమణ ట్రాన్స్‌పోర్ట్‌లో మద్యం తరలింపునకు సహకరించిన మేనేజర్లు ఇంకా పరారీలో ఉన్నారు.

### నెల్లూరులో మళ్లీ నేరంలో ఇరుక్కున్న ఉల్లంఘనదారు

జనవరి 13న నెల్లూరు జిల్లాలో ఎఫ్ఐఆర్ నంబర్ 12/2025 (AP ప్రొహిబిషన్ చట్టం 1995) కింద మరో కేసు నమోదైంది. 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని మునిశామి నాగరాజు అనే నిందితున్ని అరెస్టు చేశారు. అతను ఎనిమిదేళ్లుగా అక్రమ మద్యం వ్యాపారంలో ఉన్నాడు. 2017లో ఇదే ఆరోపణలపై అరెస్టు అయినా, కోర్టులో అతనికి విముక్తి లభించింది. విచారణలో, చెన్నై నుండి ప్రైవేట్ రవాణా సేవల ద్వారా మద్యం సరఫరా అయిందని స్పష్టమైంది.

### నెట్‌వర్క్ వెనుక ఉన్న ప్రధాన నిందితులు

చెన్నైకి చెందిన ఎస్. ప్రభు, వ్యాసర్‌పాడికి చెందిన మాణిక్యం ఈ ముఠాకు ప్రధాన సూత్రధారులు. వీరు ఫోన్ కాల్స్ లేదా వాయిస్ మెసేజెస్ ద్వారా మద్యం ఆర్డర్‌లు తీసుకుంటారు. మద్యం సీసాలను ప్యాక్ చేసి వెంకటరమణ ట్రాన్స్‌పోర్ట్, ఎస్ ఆర్ కె ఏ ఎల్ టి ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపి, డిజిటల్ చెల్లింపు విధానాల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. మద్యం నిల్వ చేయకుండా, డిమాండ్ ఆధారంగా సరఫరా చేయడం వీరి ప్రత్యేకత.

### చెన్నైలో కీలక అరెస్టు - ప్రధాన నిందితుడి పట్టివేత

జనవరి 28న స్థానికంగా ఎన్‌డిపిఎల్ సరఫరా చేస్తున్న సమ యంలో ఎస్. ప్రభు చెన్నై పోలీసులకు దొరికిపోయాడు. అతనిపై ఎఫ్ఐఆర్ నంబర్ 6/2025 కింద కేసు నమోదు చేసి పుజల్ సెంట్రల్ జైలుకు రిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు వెంటనే నెల్లూరు ప్రధాన న్యాయమూర్తి కోర్టు నుండి పిటి వారెంట్ పొందడంతో, నెల్లూరు -1 టౌన్ స్టేషన్ పోలీసులు చెన్నైకి వెళ్లి అతనిపై విచారణ ప్రారంభించారు. ఈ కీలక ఆపరేషన్‌ను ఎస్. మధు, జగదీశ్వర రెడ్డి ఇతర అధికారుల సమన్వయంతో నిర్వహించారు.

ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా రాష్ట్ర టాస్క్ ఫోర్స్, ఎక్సైజ్ అధికారులను ఈ నేపథ్యంలో ప్రశంసించారు. ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ మార్గదర్శకత వల్లే ఈ పెద్ద నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయగలిగామని తెలిపారు.



# విద్యతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కొండాపురం, మహానాడు: విద్యార్థులు లక్ష్యం దిశగా అడుగులు వేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన జాతీయ అంధత్వ నివారణ దినోత్సవంలో భాగంగా నియోజకవర్గంలోని కొండాపురం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలలు కనండి కలలను సాకారం చేసుకోండి అని తెలిపారు. ఈ క్రమంలో ఎన్నో చాలెంజ్ లు ఎదుర్కోవాల్సి వస్తుందని వాటిని ఎదుర్కొనేందుకు మనం ముందుగా సిద్ధంగా ఉండాలన్నారు. ఒకరిపై ఆధారపడకుండా తమ జీవితాన్ని ఆదర్శవంతంగా రూపుదిద్దుకోవాలని తెలిపారు. విద్యార్థి దశ నుంచి ఆటపాటలతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండాపురం మండలం కూటమి నాయకులు, విద్యార్థినిలు పాఠశాల ఉపాధ్యాయ బృందం, తదితరులు ఉన్నారు.



విజయవాడ జిజిహెచ్‌లో రోగులకు అందించడానికి సిద్ధంగా ఉన్న ఆహారం నాణ్యతను పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

జనం గుండె చప్పుడు

# మహానాడు

4

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 20, ఫిబ్రవరి 2025 ||





# ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆలపాటికి అత్యధిక మెజారిటీ రావాలి

- టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నా... విద్యావంతులు గెలిపించారు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులందరూ గెలవాలి
- ప్రజా మద్ధతుతో భావి తరాల భవిష్యత్తును పునర్నిమిస్తున్న సీఎం చంద్రబాబు
- క్లీన్ ఎనర్జీతో ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ విప్లవం
- జగన్ మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రాన్నిదేవుడు కూడా కాపాడలేడు
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతి/బాపట్ల/రేపల్లె:** ఉమ్మడి గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను విద్యావంతులందరూ అత్యధిక మెజారిటీ గెలిపించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా వేమూరు, బాపట్ల, రేపల్లె ప్రాంతాల్లో సహచర మంత్రి కొలుసు పార్థసారథి, స్థానిక ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లయిన పలువురు పట్టభద్రులతో గొట్టిపాటి సమావేశం నిర్వహించారు. ఏడు నెలల కూటమి పాలనలో ఎన్నో చేశామని.. డీఎస్సీ, తల్లికి వందనం వంటి వాటిని ప్రాధాన్యతా క్రమంలో వచ్చే విద్యా సంవత్సరంలో ఇస్తామని ప్రకటించారు. అదే విధంగా క్లీన్ ఎనర్జీ ప్రాజెక్ట్ ల ద్వారా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ విప్లవానికి వేదిక అవుతుందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

రాయలసీమతో పాటు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వ్యవసాయానికి పనికిరాని భూముల్లో ఏర్పాటు చేసే పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్ట్ వల్ల రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు అన్నదాతలకు ఆదాయం లభిస్తుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనే పట్టభద్రులందరూ కలిసి ముగ్గురు టీడీపీ ఎమ్మెల్సీలను గెలిపించారని గుర్తు చేశారు. అదే విధంగా ఆలపాటికి కూడా ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి అత్యధిక మెజారిటీ రావాలని ఆకాంక్షించారు. విద్యావంతులు కూటమి అభ్యర్థులకు మద్ధతుగా ఓటేసి బలపరచాలన్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలూ ధ్వంసం అయ్యాయని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. 33 వేల ఎకరాలు ఇచ్చిన రైతులను జగన్మోహన్ రెడ్డి అవమానించడమే కాకుండా.. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను నిలబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత దుర్మార్గపు పాలనతో జగన్మోహన్ రెడ్డి భావి తరాలకు ఎంతో నష్టం చేశాడన్నారు. టీడీపీ హయాంలో 80 శాతంపైగా పూర్తైన పోలవరం ప్రాజెక్ట్ ను మిగిలిన 20 శాతం కూడా పూర్తి చేయలేక పోయాడని ఆరోపించారు. ధాన్యం సేకరణ, చెల్లింపుల్లోనూ వైసీపీ ప్రభుత్వం రైతులను ఎంతో ఇబ్బంది పెట్టిందని మంత్రి గొట్టిపాటి తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం... భావి తరాల భవిష్యత్తు కోసం ఆంధ్రప్రదేశ్ ను మరలా పునర్నిమిస్తుందని మంత్రి గొట్టిపాటి వివరించారు. రూ.50 వేల కోట్లతో రాజధాని అమరావతిలో మౌలిక వసతుల ఏర్పాట్లను మరలా ప్రారంభించామన్నారు. వెయ్యి కోట్లతో పోలవరం డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని చేపట్టామని చెప్పారు. అదే విధంగా వైసీపీ ప్రభుత్వం రైతులకు బకాయి పడిన రూ.1,674 కోట్లను అన్నదాతలకు కూటమి సర్కారే చెల్లించిందని మంత్రి వెల్లడించారు. సంక్షేమ పెన్షన్లను వెయ్యి పెంచడానికి జగన్ కు ఐదేళ్లు పట్టిందని గొట్టిపాటి ఎద్దేవా చేశారు.

64 లక్షల మందికి సంక్షేమ పెన్షన్ల ఇస్తున్న రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక్కటే అన్నారు. అదే విధంగా ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కు సీఎం చంద్రబాబు చొరవతోనే రాష్ట్రానికి దక్కిందన్నారు. ఒక్క అవకాశానికే రాష్ట్రాన్నిసర్వ నాశనం చేసిన జగన్... మరోసారి అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ ను దేవుడు కూడా కాపాడలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులందరినీ గెలిపించి., తద్వారా రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు, పలువురు కార్యకర్తలు, అధిక సంఖ్యలో పట్టభద్రుల ఓటర్లు పాల్గొన్నారు.

# వీలైనంత త్వరగా అమలులోకి భూభారతి

- భూమిని నమ్ముకున్న కష్టజీవులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- రెవెన్యూ ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్:** వీలైనంత త్వరగా భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకువస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. క్షుణ్ణంగా, సమగ్రంగా పరిశీలించి చిన్న చిన్న పొరపాట్లకు తావులేకుండా డ్రాఫ్ట్ భూభారతి విధివిధానాలను తయారు చేయాలని అధికారులకు సూచించారు.

భూభారతి చట్టానికి సంబంధించి విధివిధానాల రూపొందించడంపై ఎం.సీ.హెచ్.ఆర్.డి.లో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో రెండవరోజు బుధవారం నాడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూమి మనిషి జీవనాధారం. అది కేవలం ఆస్తి మాత్రమే కాదు, రైతుల ఉపాధి, జీవితానికే పునాది అని రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తెలంగాణలో భూమికి సంబంధించి అనేక సమస్యలు వున్నా, గత ప్రభుత్వ నిర్వాకం వల్ల వాటికి సరైన పరిష్కారం దొరకలేదు.

గతంలో తీసుకువచ్చిన ధరణి పోర్టల్ వల్ల సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. రైతులు తమ భూములను కోల్పోవాల్సి వచ్చింది. తొందరపాటు నిర్ణయాలతో రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించింది. సామాన్యులకు రెవెన్యూ సేవలను దూరం చేసింది.

ఈ పరిస్థితికి పరిష్కారంగా, తెలంగాణ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం రైతుల భూములకు భద్రత కల్పించడంతో పాటు, భూ రికార్డులను కచ్చితంగా పరిరక్షించడానికి



రూపొందించబడింది..

సామాన్యులకు రెవెన్యూ సేవలు అందుబాటులోకి తేవడం, ప్రభుత్వ ఆస్తులు, భూములను పరిరక్షించడం ప్రధాన బాధ్యతగా తమ ప్రభుత్వం పనిచేస్తుంది. వీటిని దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు.

భూమిని నమ్ముకుని బతికే కష్టజీవులను ఈ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు రైతుకు భూమికి సంబంధించి ఏ కష్టం వచ్చినా రెవిన్యూ కార్యాలయాలలో పరిష్కారం లభించేలా విధి విధానాలను తయారు చేస్తామన్నారు

సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, భూ చట్టాల నిపుణుడు సునీల్, సిసిఎల్ఎ పీడీ , సిఎం ఆర్ వో మకరంద్. సిసిఎల్ఎ సహాయ కార్యదర్శి లచ్చిరెడ్డి, పలు జిల్లాల కలెక్టర్లు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ వ్యవస్థను కించపరిచిన జగన్‌పై కేసు పెట్టాలి

- నుడా చైర్మన్ కోటంరెడ్డి డిమాండ్

**నెల్లూరు, మహానాడు:** జగన్మోహన్ రెడ్డి త్వరలో జైలుకు వెళ్లడం ఖాయమని.. ఆ ఫ్రస్టేషన్లోనే పోలీసులపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి అన్నారు. అరాచకాలకు, విధ్వంసాలకు జగన్మోహన్ రెడ్డే బ్రాండ్ అంబాసిడర్ అని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం పోయినా.. జగన్ లో ఇంకా అహంకారం తగ్గలేదన్నారు. ఈ మేరకు కోటంరెడ్డి ఇక్కడి జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. పోలీస్ వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డి. అదే పోలీసులను అడ్డం పెట్టుకుని రఘురామ కృష్ణంరాజును కస్టడీలో చిత్రహింసలు పెట్టలేదా అని కోటంరెడ్డి ప్రశ్నించారు. పోలీసులను ఎలా వాడుకోవాలో, ప్రత్యర్థులపై ఎలా అక్రమ కేసులు పెట్టించాలో జగన్ పాలనలో చూశామన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఎప్పుడూ పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చెయ్యలేదన్నారు. పోలీస్ వ్యవస్థ పట్ల, ప్రజాస్వామ్యం పట్ల జగన్మోహన్ రెడ్డికి గౌవరం లేదన్నారు.

### అసెంబ్లీ ప్రతిష్ఠను నాశనం చేశారు

దేవాలయంలాంటి అసెంబ్లీలో జిప్ విప్పడం, మహిళలను



కించపరచడం చేసిన వారికే జైలే గతి అని కోటంరెడ్డి వ్యాఖ్యానించారు. రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన చంద్రబాబుపై, ఆయన సతీమణిపై వంశీ చేసిన వ్యాఖ్యలను ఇంకా రాష్ట ప్రజలు మరిచిపోలేదన్నారు. కొడాలి నానికి కూడా చిప్పకూడు తప్పదన్నారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు జగన్మోహన్ రెడ్డికి లేదని మండిపడ్డారు. ఈ సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, మాజీ కార్పొరేటర్ పిట్టి సత్య కువ్వరపు బాలాజీ, షైక్ జహీర్, మొయుదిన్, తంబీ సుజన్, షాహిద్, పిరిగల నవీన్, వినుకుల సుధాకర్, టీడీపీ నాయకులు హాజరయ్యారు.

# ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించండి

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

**అచ్చంపేట, మహానాడు:** మండలం కోనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీచర్లను బుధవారం కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి ఓటు వేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించేందుకు అనేక



కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, రాష్ట్రానికి ఆరు లక్షల కోట్ల రూపాయలు విలువైన పెట్టుబడులను తీసుకురావడంతో యువతకు నాలుగు లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపించి కౌన్సిల్‌కు పంపాలని ఎమ్మెల్యే కోరారు.

# జగన్‌కు బిర్యానీ పెట్టి శ్రీశైలం, సాగర్‌ను ఎండబెట్టిందే కేసీఆర్

- కవిత కుటుంబం దురాజ్ పల్లిలో ఎందుకు బోనమెత్తలేదు?
- దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు ఘాట్ రోడ్డు, గెస్ట్ హౌజులు నిర్మిస్తాం
- పెద్దగట్టు జాతరలో రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్:** మేడారం జారత తర్వాత అతిపెద్ద రెండో జాతర.. దాదాపు 40 లక్షల మంది దర్శించుకుంటారు. పదేండ్ల తర్వాత తెలంగాణలో ప్రజాప్రభుత్వం వచ్చింది. పేదవాండ్లకు ఇళ్లు కట్టించే శక్తిని ప్రసాదించాలని వేడుకుంటున్నాను. పదేండ్లు కుటుంబ పాలనతో తెలంగాణ దోపిడికి గురైంది. అందుకే నల్గొండ ప్రజలు ఒక్కో చోట 50-60 వేల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారు.

తెలంగాణలో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో, రైతులు, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లిని కోరుకోవడం జరిగింది. ఎస్.ఎల్.బీ.సీ, బ్రహ్మణవెల్లంల, శ్రీరాంసాగర్ కాలువలు తియ్యలే సూర్యపేటకు నీళ్లు ఇయ్యలే, గంధమల్ల ప్రాజెక్టు పూర్తి చెయ్యక ఆలేరును ఎండబెట్టారు. 50-60 కోట్ల ఖర్చైనా, ఘాట్ రోడ్డు, గెస్ట్ హౌజులను, జాతర సమయంలో భక్తులు ఇబ్బందులు పడకుండా బాత్ రూం లు ఇతర సౌకర్యాలు కల్పిస్తాం.

సాధారణ సమయంలోనూ వేలాదిగా భక్తులు తరలివచ్చే మహిమాన్విత జాతర పెద్దగట్టు జాతర. పదేండ్లు కల్వకుంట్ల కవిత కుటుంబం అధికారంలో ఉన్నప్పుడు ఆస్ట్రేలియా, అమెరికా, లండన్ లో కాకుండా దురాజ్ పల్లిలో ఎందుకు బోనమెత్తలేదు ? అధికారం పోయినంక దురాజ్ పల్లి గుర్తుకు వచ్చిందా? దామోదర్ రెడ్డి త్యాగాన్ని చూసి అనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి తుంగతుర్తికి, సూర్యాపేటకు నీళ్లు వచ్చేలా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీరు లేకుండా, కేవలం మా పాత ప్రాజెక్టులతోనే రికార్డుస్థాయిలో 1 కోటి 52 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండించాం.

70 శాతం వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రజాప్రభుత్వానిది. బీఆర్ఎస్ పార్టీ మంచి చేసుంటే 11 సీట్లల్లో డిపాజిట్లు పోయేంత దారుణంగా ఎందుకు ఓడిపోయారని ప్రశ్నించిన మంత్రి ? రెండు పార్లమెంట్ స్థానాల్లో డిపాజిట్లు పోయినయి, ఒక సీటు అయితే దక్షిణ భారతదేశంలోనే అత్యంత భారీ మెజార్టీతో గెలిచాం. జగదీష్ రెడ్డికి ప్రజల్ని చూసే ఓపిక లేదు, ఆయనకు డబ్బు తప్పా మరో యావలేదు. లక్ష రుణమాఫీని 5సార్లు చేసినోళ్ల రైతుల గురించి మాట్లాడటం సిగ్గచేటు.

జగన్‌కు ప్రగతిభవన్‌లో విందు భోజనం ఇచ్చి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్, ముచ్చుమర్రి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలకు తెలంగాణ నీళ్లను కానుకగా ఇచ్చిండు. పోతిరెడ్డిపాటు నుంచి 88 వేల క్యూసెక్కుల నీళ్లను తీసుకుపోయేందుకు జగన్ తో కలిసి ములాఖత్ అయ్యింది కేసిఆర్. జగన్ కు బిర్యానీ పెట్టి శ్రీశైలం, సాగర్ ను ఎండబెట్టిందే కేసిఆర్జగన్ కు అమ్ముడు పోకపోతే మీరు ఎందుకు ఓడిపోతరని కల్వకుంట్ల కవితను ప్రశ్నించిన మంత్రి..నల్గొండను బంగారు కొండను చేసే టన్నెల్ బోరింగ్ మిషన్ కోసం ముఖ్యమంత్రి నన్ను అమెరికాకు పంపించారు.

అరిచి గీ పెట్టినా కేటీఆర్, హరీష్ రావును పట్టించుకోం. మేం ఉద్యమం చేస్తున్ననాడు అమెరికాలో ఉన్న చిన్నపిలగాడు కేటీఆర్. మాకు లింగమంతులస్వామిది, తెలంగాణ ప్రజలది ఆశీర్వాదం ఉంది. మంత్రితో పాటు స్వామివారిని దర్శించుకున్న నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,రాష్ట్ర నాయకులు సర్వోతంరెడ్డి, వేనారెడ్డి లతో తదితరులు పాల్గొన్నారు.

# ఏడుకొండలవాడా. నా కోరిక మన్నించావా స్వామీ...ధన్యోస్మి

- తథాస్తు పలికిన తిరుమలేశుడు
- హమ్మయ్య... ఎట్టకేలకు మంత్రి సుభాష్ వీరాభిమాని మొక్కు తీరింది
- సుమారు 700 కిలోమీటర్లు దూరం ..17 రోజులు పాదయాత్ర
- మంత్రి సుభాష్ పదికాలాలు పాటు చల్లగా ఉండాలి..ఇదే స్వామిని కోరుకున్న వీరాభిమాని మణికంఠ



**రామచంద్రపురం:** ఇదో ఇంట్రెస్టింగ్ స్టోరీ..మారుమూల సుందరపల్లి గ్రామం నుంచి తిరుమల తిరుపతి మధ్య జరిగిన సంఘటన. సుమారు 700 కిలోమీటర్ల దూరం..కాలి నడకన 17 రోజులు యాత్ర.. ఎట్టకేలకు ఆ వీరాభిమాని తిరుమల శ్రీవారు, ఆపదమొక్కులవారి సన్నిధిలో తన అభిమాన నాయకుడు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో తిరుమలేశుని సన్నిధిలో మొక్కు చెల్లించుకుని తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఏంటా విషయం అనుకుంటున్నారా..పూర్తి వివరాల్లోకి వెళితే.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం నియోజవర్గం కె.గంగవరం మండలం సుందరపల్లి గ్రామంకు చెందిన రంకిరెడ్డి మణికంఠ గత సార్వత్రిక ఎన్నికల్లో రామచంద్రపురం నియోజవర్గం నుంచి తన అభిమాన రాజకీయ నాయకుడు ( ప్రస్తుత మన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ) అత్యధిక మెజార్టీతో గెలవాలని తిరుమలేశుని మొక్కుకున్నాడు. న్యాయమైన కోరిక కోరుకున్న తన భక్తుని మొర ఆలకించిన తిరుమల వెంకటేశ్వర స్వామి తన భక్తుని కోరిక మన్నించి, కరుణించి తథాస్తు అన్నారు.

ఇంకేముంది రామచంద్రపురం నియోజకవర్గ ప్రజల ద్వారా సుమారు 28 వేల ఓట్ల మెజారిటీతో వాసంశెట్టి సుభాష్ గెలుపొంది రికార్డు సృష్టించారు. తన మొక్కు కోర్కెను తీర్చిన స్వామివారి ముక్కు చెల్లించేందుకు ఫిబ్రవరి 3న మంత్రి సుభాష్ సమక్షంలో ఆంజనేయస్వామికి పూజలు చేసి సుందరపల్లి నుంచి తిరుమలకు నడక యాత్ర ప్రారంభించారు.

ఈ యాత్ర 17 రోజులపాటు సాగి ఈరోజు తిరుమల చేరుకుంది. అనుకోని రీతిగా మంత్రి సుభాష్ తిరుపతి వెళ్లడం, తన వీరాభిమాని రంకిరెడ్డి మణికంఠ, వారి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి ఆశీస్సులు పొందుకున్నారు. తన నడక యాత్ర ప్రారంభించిన మంత్రి సుభాష్ సమక్షంలోనే మొక్కు చెల్లించుకోవడంతో మణికంఠ ఆనందానికి అవధులు లేకుండా పోయింది. మణికంఠ పాదయాత్ర పై రాష్ట్రంలో విస్తృతమైన చర్చకు దారి తీసింది. ఇలాంటి వీరాభి మానులు కూడా ఉంటారా.. అంటూ అటు రామచంద్రపురం నియోజవర్గంలోనూ,ఇటు రాష్ట్రంలోనూ చర్చ జరిగిన సంగతి తెలిసిందే.

ఈ సందర్భంగా ముక్కు చెల్లించుకున్న రంకిరెడ్డి మణికంఠ తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ రాజకీయాల్లోకి రాకముందు నుంచే మంత్రి సుభాష్ మానవత్వంతో ఎంతోమంది నిరుపేదలకు, నిరుద్యోగులకు, వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఆర్థికంగా ఆదుకున్నారని, అలాంటి మంచి మనసున్న మనిషి అధికారంలో ఉంటే లక్షలాది మందికి సహాయపడతారని దేవునికి మొక్కుకున్నట్లు తెలిపారు.

నా కోరిక ప్రకారం మంత్రి సుభాష్ ఊహించిన దానికంటే కష్టంలో ఉన్న ప్రతిఒక్కరికి పార్టీలతో సంబంధం లేకుండా ఆపన్నులకు సహాయం చేస్తూ ముందుకు వెళుతున్నారని ఆనంద వ్యక్తం చేశారు. మంత్రి సుభాష్ అభిమానిగా ఉండడం తన అదృష్టమని మణికంఠ పేర్కొన్నారు. తనపై ఇంతటి అభిమానం చూపించిన మణికంఠను మంత్రి సుభాష్ ప్రత్యేకంగా అభినందించారు.

# పర్యావరణ పరిరక్షణ కోరుతూ 8 ప్రపంచ దేశాల సైకిల్ యాత్ర

- పర్యటన చేస్తున్న ముత్తు సెల్వన్‌ను అభినందించిన వాసంశెట్టి సత్యం

**రామచంద్రపురం:** ప్రాణవాయువు (ఆక్సిజన్) అందక ఏ ఒక్కరూ చనిపోకూడదనే లక్ష్యంతో తమిళనాడులోని కోయంబత్తూర్ కు చెందిన ముత్తు సెల్వన్ సైకిల్ పై ఆసియా దేశాల పర్యటన చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా 10 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంగా 2021 డిసెంబర్ 28న చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం సాయంత్రం రామ చంద్రపురం చేరుకుంది.

సైకిల్ యాత్ర చేపట్టిన ముత్తు సెల్వాన్ కూటమి పార్టీ సీనియర్ నాయ కులు, మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యంని మర్యాద పూర్వకంగా కలిశారు. గడచిన కోవిడ్ మహమ్మారి సమయంలో ఎంతోమంది ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయారని, అలాంటి పరిస్థితి పునరావృతం కాకూడదనే నినాదంతో 10 లక్షల మొక్కలు నాటాలన్న లక్ష్యంతో ఈ సైకిల్ యాత్ర చేపట్టినట్టు సెల్వన్ వివరించారు.



ఐదు సంవత్సరాలు పాటు సాగే ఈ సాహస యాత్రలో ఇండియా,నేపాల్, బంగ్లాదేశ్, వియాత్నం మయన్మార్, బ్యాంకాక్, థాయిలాండ్ తదితర దేశాల మీదగా ప్రయాణించి వచ్చే 2027 డిసెంబర్ 27 నాటికి దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రి సమక్షంలో యాత్ర ముగుస్తుందని వెల్లడించారు. ఇప్పటికే 7 లక్షల 14 వేల 300 మొక్కలు నాటామని, మరో 2 లక్షల 87 వేల మొక్కలు నాటాల్సి ఉందన్నారు. యాత్రలో ఇప్పటికే 29 వేల 650 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేశానని, మరో 14 వేల కిలోమీటర్ల దూరం సైకిల్ యాత్ర చేయాల్సి ఉందన్నారు. ఈ యాత్ర ప్రపంచ రికార్డు అని, తన సైకిల్ బరువు 120 కేజీలు ఉంటుందని వివరించారు. మంచి లక్ష్యంతో సైకిల్ యాత్ర చేపట్టిన ముత్తు సెల్వన్‌ను వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులు సెల్వన్ కు స్వాగతం పలికి, అభినందించారు.

# 11 సీట్లకు పడగొట్టి ప్రజలు జగన్ బట్టలు ఎప్పుడో ఊడదీశారు

- జీవీ ఆంజనేయులు విమర్శ

**వినుకొండ, మహానాడు:** పోలీసు అధికారులు, ఉద్యోగులపై జగన్ అవాకులు, చవాకులను తీవ్రంగా ఖండిస్తున్నామని, 151 నుంచి 11 సీట్లతో ప్రజలు ఎప్పుడో అతడి బట్టలూడదీశారని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని, ప్రజలు రోడ్డుపై నిలబెట్టినా బుద్ధిరాలేదని చురకలు వేశారు. హత్యలు, కిడ్నాపులు, దుర్మార్గాలు చేసినోళ్లను జైలుకెళ్లి మరీ ఎవరైనా పరామర్శలు చేస్తారా, జగన్ చట్టాల్ని గౌరవించేవాడైతే ఇలాంటి సంఘవిద్రోహ శక్తులను వెనకేసుకొస్తాడా అని తూర్పారాబట్టారు.



కృష్ణా - గుంటూరు పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలి కోరుతూ వినుకొండలో జీవీ ఆంజనేయులు ప్రచారం చేశారు. ఉదయం టీ స్టాళ్ల వద్ద పట్టభద్రులను కలిసి ఆలపాటికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, కారంపూడి రోడ్డులోని టీ స్టాళ్ల వద్ద పట్టభద్రులు, ఉద్యోగులను ఆత్మీయంగా పలకరించి కూటమి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు, అభివృద్ధితో పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటి గెలుపు ఎప్పుడో ఖాయమైందన్న జీవీ ఆధిక్యాలపైనే ఇప్పుడు దృష్టి పెట్టామన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరు ఆలపాటికి, కూటమి ప్రభుత్వానికి అండగా ముందుకు రావడం మంచి పరిణామంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యుడు మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, బీజేపీ నాయకులు లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
5
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 20, ఫిబ్రవరి 2025

## వెనుకబడిన కులాలు మళ్ళీ దోపిడీకి గురవుతాయి

- కమిషన్ రిపోర్టులో లోపాలు సరి చేయాలని సీఎంకు సూచించాం
- మీడియాతో మందకృష్ణ మాదిగ



**హైదరాబాద్:** అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా చూడాలని ఏకసభ్య కమిషన్ చైర్మన్ ను కలిసాం. వర్గీకరణ పై షమీమ్ అక్తర్ రిపోర్ట్ సరిగా చూడకుండా క్యాబినెట్ ఆమోదించి పూర్తి చర్చ జరగకుండా ప్రభుత్వం అసెంబ్లీ లో తీర్మానం చేసింది. కమిషన్ రిపోర్టులో లోపాలు సరి చేయాలని సీఎం కు సూచించాం. మేం చెప్పిన అభ్యంతరాలను ముఖ్యమంత్రి పరిగణనలోకి తీసుకొని షమీమ్ అక్తర్ కమిషన్ గడువు పెంచారు. అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి , సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ధన్యవాదాలు. ఎస్సీ వర్గీకరణ నివేదికలో ఉన్న లోపాలను కమిషన్ కు చదివి వినిపించాం. హేతుబద్ధత, న్యాయ సమ్మతంగా జరపాలని సుప్రీంకోర్టు సూచించింది .

అవి ప్రస్తుత కమిషన్ నివేదికలో మిస్ అయ్యాయని తెలియజేయడం జరిగింది. అత్యంత వెనుకబడిన కులాలైనా బుడగజంగం, దక్కలి, మాంగ్ వంటి కులాలను అభివృద్ధి చెందిన పంబాల, మన్నె కులాలతో కలిపి వారికి ఒక శాతం రిజర్వేషన్ కేటాయించారు. దీనివల్ల వెనుకబడిన కులాలు మళ్ళీ దోపిడీకి గురవుతాయి. అత్యంత వెనుకబడిన కులాల వారికి 171625 జనాభాను ప్రామాణికంగా తీసుకుని 1% రిజర్వేషన్ కేటాయించారు.

## మిర్చి బస్తాలు కొట్టేసిన వైసీపీ నేతలు

- జగన్ మిర్చియార్డు టూరులో పానుగంటి చైతన్య చేతివాటం
- కనిపెట్టిన గుంటూరు పోలీసులు
- జగన్ టూరులో వైసీపీ నేతల చిల్లర చేష్టలు

**గుంటూరు, మహానాడు:** స్థానిక మిర్చి యార్డులో మిర్చి బస్తాలు మాయమయ్యాయి. రైతులకు చెందిన 14 మిర్చి టిక్కీలు కనిపించడం లేదు. జగన్ వచ్చిన సమయంలో మిర్చి బస్తాలు మెట్టు కట్టిన చోట తోపులాట జరిగింది. ఈ పరిణామం వల్ల ప్రాణ భయంతో అక్కడి నుంచి రైతులు దూరంగా వెళ్ళిపోయారు. కొద్దిసేపటి అనంతరం తమ బస్తాల వద్దకు వచ్చి చూసుకున్న తర్వాత రైతులు లబోదిబోమన్నారు. 14 టిక్కీలు మాయమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందట అమ్ము కోవడానికి పల్నాడు జిల్లా, వెల్దుర్ధికి చెందిన రైతులు నారాయణ, వెంకట సుబ్బయ్య యార్డుకు వచ్చారు. లేళ్ల అప్పిరెడ్డి అనుచరుడు సానుగంటి చైతన్య తీసుకొచ్చిన ఇసుజు ట్రక్కులో మిర్చి టిక్కీలు తీసుకెళ్తున్నట్టు యార్డు అధికారులు గుర్తించారు.

## టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మ గెలుపు ఖాయం


- పల్లా శ్రీనివాసరావు

**విశాఖపట్నం, మహానాడు:** ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏపీటీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య) పాకలపాటి రఘువర్మకు కూటమి నేతలు మద్దతు తెలిపారు. రఘువర్మ గెలుపు ఖాయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు ధీమా వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. “సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు రఘువర్మకు మద్దతు ఇచ్చినట్టు




తెలిపారు. వైసీపీ పాలనలో గాడి తప్పిన విద్యావ్యవస్థను చక్కదిద్దాంలంటే రఘువర్మకు ప్రభుత్వ,ప్రైవేట్ ఉపాధ్యాయులు మద్దుతు ఇవ్వాలని కోరారు.

విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్ళినట్టు తెలిపారు. రఘువర్మకు ఓటేస్తే ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల కోసం కృషి చేస్తారని అన్నారు. గతంలో విద్యారంగంలో జరిగిన అన్యాయాలపై పలుమార్లు ఉత్తరాంధ్రలో గొంతెత్తిన చరిత్ర రఘువర్మది అని ఆయన అన్నారు. ఈ నెల 27న జరుగుతున్న ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మ గెలుపు ఖాయం” అని ధీమా వ్యక్తం చేశారు.



## కుంభమేళాలో పురందేశ్వరి పుణ్యస్నానం

**ప్రయాగరాజ్:** బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి త్రివేణీ సంగమంలో పుణ్య స్నానం ఆచరించారు. కుంభమేళాకు కోట్లాది మంది భక్తులు స్నానమాచరించి చేందుకు ప్రయాగ రాజ్‌కు విచ్చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భక్తులు కోసం అనేక ఏర్పాట్లు చేసింది. ప్రయాగ రాజ్‌కు చేరుకోగానే భక్తి పార వశ్యంతో ఈ ప్రాంతమంతా ముంచెత్తుతోంది. త్రివేణి సంగమంలో స్నానమాచరించే భాగ్యం కలిగిందని దగ్గుబాటి పురందేశ్వరి ఈ సందర్భంగా భగవంతునికి కృతజ్ఞతలు తెలిపారు.




74లక్షల రూపాయలతో సి.సి రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు టీడీపీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి

## జగన్ గుంటూరు పర్యటనలో అడుగడుగునా భద్రతా వైఫల్యం

- మిర్చియార్డు లోపల కనిపించని పోలీస్ యంత్రాంగం
- కనీసం రోప్ పార్టీ కూడా ఏర్పాటు చేయని పోలీసులు
- ఎన్నికల కోడ్ ఉందంటూ కుంటిసాకులు చెబుతున్నారు
- విజయవాడలో ఒక నిబంధన, గుంటూరులో మరో నిబంధన ఉంటుందా?
- కోడ్ ఉంటే ముందుగా ఎందుకు నోటీసులు ఇవ్వలేదు?
- గుంటూరులోని పార్టీ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడిన వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, విడదల రజిని, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎంపీలు నందిగం సురేష్, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పార్టీ గుంటూరు నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా

**గుంటూరు:** మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు పర్యటనలో అడుగడుగునా భద్రతా వైఫల్యం కనిపించిందని, మాజీ సీఎం సీఎం పర్యటనలో భద్రత కల్పనపై ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని వైయస్ఆర్‌సీపీ నేతలు మండిపడ్డారు.

గుంటూరులోని వైయస్ఆర్ సీపీ కార్యాలయంలో పలువురు నాయకులు మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌గారి పర్యటనపై ముందుగానే సమాచారం ఇచ్చినా, ఆయనకు భద్రత కల్పనను అస్సలు పట్టించుకోలేదని, ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం ఆ విధంగా వ్యవహరించిందని వారు ఆక్షేపించారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాలతోనే గుంటూరు పోలీసులు బందోబస్త్‌ను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ఉందంటూ కుంటిసాకులు చెబుతున్నారని వారు ధ్వజమెత్తారు.

అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడు వైయస్ జగన్ రోడ్డు మీదకు వస్తే ప్రజల నుంచి ఎటువంటి స్పందన ఉంటుందో తెలిసి కూడా.. ఆయన మిర్చి రైతులను పరామర్శించే కార్యక్రమాన్ని విఫలం చేసేందుకే కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని వైయస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు.

### వ్యవసాయ మంత్రి పచ్చి అబద్ధాలు: అంబటి రాంబాబు

మిర్చి రైతుల కష్టాలు స్వయంగా తెలుసుకునేందుకు, వారికి భరోసా కల్పిచేందుకు మాజీ సీఎం వైయస్ జగన్ గుంటూరు మిర్చి యార్డ్‌కు వచ్చి రైతులతో మాట్లాడారు. ధర లేక కునారిల్లుతున్న మార్కెట్ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.



వైయస్ జగన్ రైతులతో మాట్లాడి వెళ్లగానే, వ్యవసాయ మంత్రితో పాటు పలువురు టీడీపీ నేతలు స్పందించారు. ఒకటి, రెండుసార్లు తప్ప ఎప్పుడూ క్వింటా మిర్చి రూ.13 వేలకే విక్రయిస్తున్నారంటూ వ్యవసాయ మంత్రి పచ్చి అబద్ధాలు మాట్లాడారు.

మరోవైపు హడావిడిగా సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్‌కు లేఖ రాశారు. మిర్చిపంటకు రేటు పడిపోయింది, కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. ఇంత సీనియారిటీ ఉన్న సీఎం ఇలాగేనా సమస్యపై స్పందించేది? వైయస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు అయిదేళ్లలో పంటలకు ఎప్పుడు మద్దతు ధర రాకపోయినా, రైతు నష్టపోతున్నారని గ్రహించినా వారిని ఆదుకునేందుకు రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశారు. పత్తి, ధాన్యం, పొగాకు ఇలా అనేక పంటలను వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నారు.

నాడు మాది రైతు పక్షపాత ప్రభుత్వం. ఆనాడు రూ.65 వేల కోట్లు వెచ్చించి ధాన్యం కొనుగోలు చేశాం. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి పత్తి, కంది, ధాన్యం, మిర్చికి మద్దతు ధర లేదు. ధాన్యాన్ని అతి తక్కవ రేటుకు దళారీలకు, మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. రైతు నట్టేట మునుగుతున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

జగన్ మిర్చి మార్కెట్‌కు రాకుండా చూసేందుకు కుట్ర చేశారు. ఒక మాజీ ముఖ్యమంత్రి కష్టాల్లో ఉన్న రైతులను పరామర్శించాలని అనుకోవడం తప్పా? కనీస పోలీస్ బందోబస్త్ కల్పించకుండా ఎన్నికల కోడ్ ఉందంటూ కుంటిసాకులు చెప్పించారు. అది కూడా పోలీసులు వాట్సాప్‌లో మెసేజ్ పెట్టి చేతులు దులుపుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఉంది. వైయస్ఆర్‌సీపీ ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. ఎన్నికల కోడ్ ఉన్నప్పుడు ఓట్ల కోసం ప్రచారం చేసుకునే వారు. ఊరేగింపులు, బహిరంగ సభలు పెట్టే వారు అనుమతులు తీసుకోవాలి.

వైయస్ జగన్ మిర్చి యార్డ్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల కోసం ప్రచారం కోసం వెళ్ళారా? రైతులను పరామర్శించడం ఎన్నికల ప్రచారం కిందకు వస్తుందా? కోడ్ ఉంటే దానిపైన పోలీసులు ఎందుకు నోటీస్ ఇవ్వలేదు? అయినా కోడ్ ఉల్లంఘించే ఉద్దేశం మాకు లేదు. ఎన్నికలు జరుగుతున్నా పరామర్శించేందుకు అవకాశం ఉంటుంది. నిన్ననే జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పరామర్శించేందుకు వెళ్ళినప్పుడు ఈ ఎన్నికల కోడ్ ఉన్నట్లు పోలీసులకు గుర్తు రాలేదా? అక్కడ పెద్ద ఎత్తున పోలీసులను మోహరింప చేశారు. అంటే విజయవాడలో ఒక నిబంధన, గుంటూరులో మరో నిబంధన ఉంటుందా? గుంటూరు మిర్చి మార్కెట్‌లో రైతులతో జగన్ మాట్లాడితే, వారి కష్టాలు ప్రజలకు తెలుస్తాయని, అందుకే ఆ పర్యటన అడ్డుకోవాలనే కుట్రతో కూటమి ప్రభుత్వం వ్యవహరించింది.

మిర్చియార్డ్ వద్ద పోలీసులు లేక తోపులాటలు జరిగాయి. దీంతో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులే జనాన్ని నియంత్రించారు. చివరికి జగన్ మీడియాతో మాట్లాడేందుకు కూడా వీలు లేకుండా చేయాలని కుట్రపన్నారు. జగన్‌ని చూసేందుకు, కలిసేందుకు తరలివస్తున్న జనాన్ని నియంత్రించేందుకు ఒక్క పోలీస్‌ను కూడా నియమించకుండా చేయడం నారా లోకేష్‌కు సమంజసమా? అధికారం శాశ్వతమని వారు భావిస్తున్నారు.

## మిర్చి రైతులకు లబ్ధిచేకూర్చేందుకే ఎం.ఎస్.పి.ని ఖరారు చేయలేదు

- మిర్చి రైతులకు లబ్ధిచేకూర్చేందుకే ముఖ్యమంత్రి డిల్లీ వెళుతున్నారు
- రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




**అమరావతి:** బహిరంగ మార్కెట్‌లో మిర్చికి డిమాండు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించినట్లైతే రైతులు నష్టపోతారు అనే ఉద్దేశ్యంతో మిర్చికి ఇప్పటి వరకూ కనీస మద్దతు ధర ప్రకటించలేదని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ శ్రీలంక, చైనా, మలేషియా తదితర దేశాలకు మన మిర్చి ఎగుమతి అయ్యేదని, అయితే ఆయా దేశాలు సొంతంగా మిర్చి పంట సాగు చేసుకోవడం వల్ల మిర్చి ఎగుమతులు చాలా తగ్గిపోవడం వల్ల మిర్చి రేటు తగ్గిందన్నారు. కానీ ప్రస్తుతం చైనాలో మిర్చి పంట సరిగాలేకపోవడం వల్ల మళ్లీ ఆదేశం మన మిర్చి పంటపై ఆధారపడే పరిస్థితులు ఏర్పడ్డాయని, ఫలితంగా మిర్చి ధరలు భారీగా పెరిగే పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి తెలిపారు.

ఇటు వంటి పరిస్థితుల్లో ప్రభుత్వం మిర్చికి కనీస మద్దతు ధర ప్రకటించినట్లైతే రైతులు పెద్ద ఎత్తున నష్టపోయే అవకాశం ఉన్నందున, ప్రభుత్వం ఇప్పటి వరకూ మిర్చి పంటకు కనీస మద్దతు ధర ప్రకటించలేదని మంత్రి తెలిపారు. లాభదాయకత ను దృష్టిలో పెట్టుకుని రైతులు కొంతమంది పత్తి, మొక్కజొన్న, కందులు తదితర ప్రత్యామ్నాయ పంటలు వైపు మారటం వల్ల ఈ ఏడాది దాదాపు 2 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు తగ్గిందన్నారు.

రాష్ట్రంలోని మిర్చి రైతులకు సాధ్యమైనంత మేర సహకరించాలని, ప్రస్తుతం ఉన్న కేంద్రం మద్దతు ధరను కూడా పెద్ద ఎత్తున పెంచాలని కోరేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు డిల్లీ వెళుతున్నారన్నారు.

ఈ విషయంలో కేంద్రానికి ఇప్పటి వరకూ నాలుగు లేఖలు రాష్ట్ర ముఖ్యమంత్రి వ్రాయడం జరిగిందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రమంత్రుల బృందంతో చర్చించనున్నారని, చర్చల ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయనే ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు.

అయితే ఈ విషయాలను అన్నింటినీ వక్రీకరిస్తూ ప్రధాన ప్రతిపక్ష పార్టీ నాయకుడు రాజకీయం చేస్తూ తమ ప్రభుత్వంపై బురద జల్లే విధంగా ప్రయత్నించడం ఎంతో విడ్డూరంగా ఉందన్నారు. మిర్చి రేటు రూ.13 వేలకు పడిపోయిందని ఆరోపిస్తున్నారని, అయితే గత పదేళ్లలో మిర్చి ధరలు పరిశీలిస్తే అత్యధికంగా రూ.13,600/- లు మాత్రమే ఉందని ఆయన తెలిపారు. కేవలం గత రెండేళ్లు మాత్రమే అంతర్జాతీయంగా కొన్ని కారణాలు వల్ల మిర్చి రైతుకు రూ.20వేల ధర పలికిందన్నారు.

రాష్ట్ర జనాభాలో దాదాపు 70 శాతం జనాభాకి ప్రధాన జీవనోపాధిగా ఉన్న వ్యవసాయ అనుబంధ రంగాలను గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యం చేసిన వ్యక్తి ఇప్పుడు ఈ విధంగా మాట్లాడటం ఎంతో ఆశ్చర్యంగా ఉందన్నారు. భూసార పరీక్షలను పూర్తిగా నిలిపివేయడమే కాకుండా, వ్యవసాయ యాంత్రీకరణ క్రింద ఒక్క పైసాకూడా కేటాయించలేదన్నారు. బిందు సేద్యాన్ని ప్రోత్సహించే విధంగా డ్రిప్ / స్ప్రింక్లర్లను ఏఒక్కరికీ పంపిణీచేయలేదన్నారు. దాదాపు రూ.1600 కోట్లు మేర ధాన్యం కొనుగోలు బకాయిలను పెట్టిపోతే, తాము అధికారంలోకి వచ్చిన వెంటే రైతులకు ఆ సొమ్మును చెల్లించడం జరిగిందన్నారు.

2020 జనవరి మాసంలో బహిరంగ మార్కెట్ లో మిర్చి ధర దాదాపు రూ.12,000/- ల వరకూ ఉంటే అదే సమయంలో గత ప్రభుత్వం మిర్చికి రూ.7,000/- కనీస మద్దతు ధరను ప్రకటించి రైతులకు పూర్తి స్థాయిలో నష్టాన్ని కలిగించిన ఘనత గత ప్రభుత్వానిదన్నారు. ఆ సమయంలో కూడా మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ క్రింద ఒక్క పైసాకూడా అప్పటి ముఖ్యమంత్రి ప్రకటించ లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 2017లో దాదాపు రూ.138 కోట్ల మేర మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ కేటాయించి రైతులను పెద్ద ఎత్తున ఆదుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా వచ్చే బడ్జెట్ లో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ ను పెద్ద ఎత్తున ప్రతిపాదించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు ఢిల్లీరావు, మార్కెటింగ్ శాఖ సంచాలకులు మరియు రైతు బజార్ల సి.ఇ.ఓ. విజయ సునీత ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఏపీ పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఇదే మా ఆహ్వానం

- ఏపీ పర్యాటకాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ఢిల్లీలో జరుగుతున్న సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్ -2025 వేదికగా జాతీయ, అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు ఆహ్వానం పలికిన పర్యాటక మంత్రి కందుల దుర్గేష్




**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, సమగ్ర పర్యాటకాభివృద్ధే లక్ష్యంగా రానున్న ఐదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా నిర్దేశించుకున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం ద్వారకా ఢిల్లీలోని యశోభూమిలో



జరిగిన సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్ - 2025 (ఎస్ఏటీటీఈ) వేదికగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తనదైన శైలిలో ప్రసంగించి ఇన్వెస్టర్లను అమితంగా ఆకట్టుకున్నారు.

పర్యాటక రంగంలో ఉత్తేజం నింపేలా రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించిందని తద్వారా పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ పర్యాటకరంగానికి కూడా వర్తింపజేస్తున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. ఏపీలో పర్యాటకాభివృద్ధి కోసం నూతన టూరిజం పాలసీ 2024-29 తీసుకువచ్చామని వివరించారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్ నర్ షిప్ (పీపీపీ) విధానం ద్వారా పర్యాటకాభివృద్ధి చేయాలని భావిస్తున్నామని, పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే పెట్టుబడిదారులకు పెద్ద ఎత్తున మెరుగైన రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పించి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు.

అని వివరించి ఇన్వెస్టర్లు, టూర్ ఆపరేటర్లు, ట్రావెలర్స్, ఔత్సాహికులను ఆహ్వానించారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు, వనరులున్న నేపథ్యంలో వాటన్నింటిని సమర్థవంతంగా వినియోగించుకొని పర్యాటక రంగంలో ఏపీని దేశంలో అగ్రపథాన నిలుపుతామన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పర్యాటకాన్ని, పర్యావరణాన్ని సమ్మిళితం చేసి యువతకు ఉపాధి కల్పన, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు తొలి గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ ను నిలబెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుస్థిర, సమగ్ర పర్యాటకాభివృద్ధిలో భాగంగా పర్యాటకులకు విభిన్న పర్యాటక అనుభవాలను కల్పించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు.

ఈ క్రమంలో ఒకే తరహా పర్యాటకాభివృద్ధి కాకుండా జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్రంలో టెంపుల్, అడ్వెంచర్, ఎకో, వెల్ నెస్, హెరిటేజ్, రిలీజియస్, అగ్రి, మెడికల్, క్రూయిజ్, బీచ్, కోస్టల్, సీప్లేన్, రూరల్, ఫిల్మ్ టూరిజంలను వృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. రాష్ట్ర సహజ, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతూ బాధ్యతాయుతమైన పర్యాటక పద్ధతులను అవలంభించాలని నిర్ణయించామన్నారు. హబ్ అండ్ స్పోక్ విధానంలో యాంకర్ హబ్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేస్తూ పర్యాటక రంగం ద్వారా రాష్ట్ర ఆర్థిక అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. పర్యాటక రంగం ద్వారా 15 శాతం ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు వెళు తున్నామన్నారు. పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు ఆహ్లాదంగా ఉంటూ ఎక్కువ రోజులు గడిపేలా మెరుగైన సేవలు, మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామన్నారు.

06

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 20, ఫిబ్రవరి 2025

## మీ మెడలోని అమరావతి కండువాను తీసెయ్యండి

- మాజీ సీఎం జగన్‌కు బాలకోటయ్య విజ్ఞప్తి



**అమరావతి, మహానాడు:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గుంటూరు మిర్చి యార్డుకు వెళ్ళటంలో తప్పు లేదని, మిర్చి గిట్టుబాటు ధరలపై ప్రశ్నిచటంలోనూ తప్పు లేదని, కానీ ఆయన మెడలో అమరావతి ఆకుపచ్చ కండువా వేసుకోవటం ముమ్మాటికీ తప్పు అని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు ధరించే ఆకు పచ్చని కండువా రాజధాని అమరావతి ఉద్యమానికి చిహ్నం అని, అలాంటి కండువాను ఎలా మెడలో వేసుకుంటారని ప్రశ్నించారు.

రాజధానిపై నిందలు వేసి, ఐదేళ్ళు రైతులను రోడ్లపాలు చేసి, ఆకు పచ్చ కండువాలు వేసుకున్న రైతులను ఈడ్చి ఈడ్చి తన్నారని గుర్తు చేశారు. నా మెడలో ఆకుపచ్చ కండువా ఉండి, మీ మెడలోనూ ఆకుపచ్చ కండువా ఉంటే అర్థం ఏముందని నిలదీశారు. ఆకుపచ్చ కండువాకు బదులు వైఎస్ఆర్ పార్టీ కండువా వేసుకోవటం మంచిదని, ఇప్పటికైనా అమరావతి కండువాను వాడొద్దని బాల కోటయ్య హితవు పలికారు.

## జగన్ రైతులను కలిస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమిటి?

- రైతులను ఆదుకోవాలన్న ఆలోచన చంద్రబాబుకు ఎందుకు రాలేదు?
- వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన సీనియర్ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్



**తాడేపల్లి:** కనీస గిట్టుబాటు ధర లేక నానా అగచాట్లు పడుతున్న మిర్చి రైతులను పరామర్శించేందుకు వైయస్ జగన్ గుంటూరు మిర్చి యార్డుకు వెళ్తే, ప్రభుత్వానికి వచ్చిన నష్టం ఏమిటని వైయస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ప్రశ్నించారు. అసలు జగన్ కదిలే వరకు, రైతులను ఆదుకోవాలన్న కనీస ఆలోచన సీఎం చంద్రబాబు ఎందుకు చేయలేదని ఆయన నిలదీశారు.

జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం వైయస్ జగన్ గుంటూరు పర్యటనలో అడుగడుగునా భద్రతా వైఫల్యం కనిపించిందని మాజీ మంత్రి వెల్లడించారు. జగన్ పర్యటనలో భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పోలీసులను మోహరించలేదని, అదే అనుమానాన్ని చివరకు రైతులు కూడా వ్యక్తం చేస్తున్నారని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన సాకే శైలజానాథ్ తెలిపారు.

చంద్రబాబు అధికారంలో ఉండగా ఏరోజూ రైతుల బాగోగులు పట్టించుకున్న పాపాన పోలేదు. వైయస్ జగన్ గుంటూరు మిర్చి యార్డుకి వెళ్తే తప్ప, చంద్రబాబుకి మిర్చి రైతుల సమస్యలు గుర్తుకు రాలేదు. మిర్చి రైతులకు మద్ధతు ధర కల్పించాలంటూ ఆయన హడావుడిగా కేంద్ర మంత్రికి లేఖ రాశారు. రైతులను పరామర్శించడానికి వైయస్ జగన్ వెళితే, యార్డు వద్ద కావాలనే రక్షణ వలయం ఏర్పాటు చేయలేదని మిర్చి రైతులే చెబుతున్నారు. జెడ్ ప్లస్ కేటగిరి భద్రత కలిగి ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ రైతులతో మాట్లాడటానికి వస్తుంటే భద్రత కల్పించాల్సిన పోలీసులు ఎక్కడా కనిపించకపోవడం దేనికి నిదర్శనం?. అసలు జగన్ రైతులతో మాట్లాడితే, చంద్రబాబుకి వచ్చిన ఇబ్బంది ఏంటో అర్థం కావడం లేదు. చంద్రబాబు వ్యవహారశైలిపై ప్రజలు కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసులను కూడా పార్టీ కార్యకర్తలను చూసినట్లే చూస్తున్నారు. పోలీస్ వ్యవస్థను పార్టీల పరంగా విడకొట్టే విష సంస్కృతికి చంద్రబాబు తెర తీశారు. పోలీస్ వ్యవస్థ వేధింపుల గురించి హైకోర్టు పదే పదే హెచ్చరికలు జారీ చేస్తున్నా చంద్రబాబుకి చీమ కుట్టినట్లు అయినా లేదు. ప్రతి మంగళవారం అప్పులు చేయడం తప్ప, 9 నెలల కాలంలో చంద్రబాబు నెరవేర్చిన హామీ ఒక్కటైనా ఉంటే చూపించాలి.

## బతుకమ్మకుంటలో ఉప్పొంగిన గంగ

- హైడ్రా చెరువు పునరుద్ధరణ పనులు
- పైప్ లైన్ పగిలి నీరు ఉబికి వచ్చిందని భావించిన స్థానికులు
- భూగర్భం నుండి నీరు వచ్చిందని ధృవీకరించిన జలమండలి

**హైదరాబాద్:** అంబర్‌పేటలో గల బతుకమ్మకుంటలో హైడ్రా వర్గాలు చెరువు పునరుద్ధరణ పనులను ప్రారంభించాయి. ఇక్కడ జేసీబీలతో మోకాలిలోతు వరకు తవ్వగానే నీరు ఉబికి వచ్చింది. దీంతో హైడ్రా అధికారులతో పాటు స్థానికులు ఆశ్చర్యపోయారు. పునరుద్ధరణ పనులు జరుగుతున్నప్పుడు ఎక్కడో పైపు లైన్ పగిలి నీరు ఉబికి వచ్చిందని కొంతమంది అనుమానం వ్యక్తం చేశారు. దీంతో, ఎక్కడైనా పైపు లైన్ పగిలిందా? అనే కోణంలో జలమండలి అధికారులు పరిశీలన జరిపారు. కానీ పునరుద్ధరణ పనులు జరుగుతున్న ప్రాంతంలో ఎక్కడా, ఎలాంటి పైపు లైన్ లేదని, భూగర్భం నుండి మాత్రమే నీరు ఉబికి వచ్చిందని నిర్ధారించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. "మోకాలి లోతుకే ఉప్పొంగిన గంగ, హైడ్రా తవ్వకాల్లో బయటపడిన బతుకమ్మకుంట" అంటూ హైడ్రా ట్వీట్ చేసింది.

****

## 1947లో ధరలిలా ఉండేవి!

(వాసు)

డాలర్ విలువ ఒక రూపాయితో సమానంగా ఉండేది. 10 గ్రాముల బంగారం ధర రూ.88 మాత్రమే. ప్రభుత్వ ఉద్యోగుల్లో అధిక జీతం



రూ.2వేలు. చీపెస్ట్ కార్ రూ.2500. సౌత్ ఢిల్లీలో ఒక ఎకరం భూమి ధర రూ.17వేలు, ముంబైలో 2 BHK రెంట్ రూ.20-50 మాత్రమే. బేసిక్ మెడికల్ టెస్టులు రూ.100-రూ.500. రూ.25కే సైకిల్ వచ్చేది. రూ.4కే కేజీ స్వచ్ఛమైన నెయ్యి. పెట్రోల్ ధరలు లీటర్కు 27 పైసలు.

****

## ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలి

- కలెక్టర్‌కు కార్మిక నేత పిల్లి బాబురావు ఫిర్యాదు

**గుంటూరు, మహానాడు:** ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నఆలపాటి రాజేంద్రప్రసాద్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని కార్మిక నాయకుడు పిల్లి బాబురావు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనాం భూములను కబ్జా చేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కోరినట్టు చెప్పారు. పెదపలకలూరు పరిధిలోని అడవి తక్కెళ్ళపాడు వద్ద ఉన్న 46.82 ఎకరాల ఈనాం భూములను కబ్జా చేశారని తెలిపారు. 1905లో శ్రీ రాజా మానూరి వెంకట హనుమంతరావు వృత్తిదారులకు ఆ భూమిని ఇచ్చారని చెప్పారు. 2002లో ఈ భూమిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు 1,600 కుటుంబాలు గుడిసెలు వేసుకుంటే బెదిరించి కేసులు పెట్టి ఆ భూమిని ఆలపాటి రాజా లాక్కున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు పేదల భూములను ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటానని ప్రకటించిన నేపథ్యంలో ఆయనపై ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. రాజాపై ల్యాండ్ గ్యాబరింగ్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనే ఈ అంశంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని నల్లపాడు పోలీసులు తనను విచారణ చేసి గుంటూరు వెస్ట్ తహశీల్దార్‌కు రిపోర్టు పంపినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఆయన అభ్యర్థిత్వాన్ని రద్దు చేయని పక్షంలో అన్నీ ఆధారాలతో కోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు.



విజయవాడ జిజిహెచ్‌లో వైద్య సేవలపై రోగుల అభిప్రాయాల్ని తెలుసుకుంటున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

# ఏ క్షణంలోనైనా జైలుకు వెళ్ళే మనిషి జగన్!

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

**విజయవాడ, మహానాడు:**

జగన్, చంద్రబాబులపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మండిపడ్డారు. వైసీపీ, కూటమి పార్టీలకు చురకలు అంటించారు. పోలీసు అధికారులను బట్టలూడ దీస్తా... సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టనని హెచ్చరికలు చేయడం తప్పు. మాట్లాడేటప్పుడు భాష జాగ్రత్తగా వాడాలని ఆయన హితవు పలికారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని భ్రమ పడుతున్నారు. తండ్రి మరణంతో వచ్చిన సానుభూతి, పాదయాత్రలో ప్రజల్ని నాకు ఒక్క ఛాన్స్ ఇవ్వండని అడిగితే అధికారం ఇచ్చారు. వైసీపీ తిరిగి అధికారంలోకి రాదు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్న నమ్మకం లేదు.

సీబీఐ 11 కేసులు జగన్ పై పెట్టింది. ప్రజా తీర్పు కూడా 11 సీట్లే ఇచ్చారు. ఇదొక అద్భుతం. విచిత్రం. 3000 సార్లు జగన్ బెయిల్ తీసుకున్నాడు. ఏ క్షణంలోనైనా, జైలుకు పోతారు. జగన్ జైలు యాత్రలకు బదులు, గుడులు చుట్టూ తిరిగితే, చేసిన పాపాలు పోతాయి. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ జగన్ చదువుతున్నారు.

#### కూటమి - కోటీశ్వరుల ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం కోటీశ్వరుల ప్రభుత్వమైంది. పేదవాళ్లను గురించి పట్టించుకోవడం లేదు. సీఆర్‌డీఏ లో పెద్ద పెద్ద వాళ్లకే, కాంట్రాక్టర్లు ఇస్తున్నారు. ఎస్సీ, ఓబీసీలకు కాంట్రాక్టు పనులు ఇవ్వడం లేదు. పనులు ఇవ్వకుంటే, ఆర్థికంగా ఎదిగేదెట్లా?? కనీసం చిన్న వర్కులైనా ఎస్సీ, ఓబీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను. చంద్రబాబు మురిసిపోతున్నారు. ప్రేమతో ప్రజలు ఆయనకి ఓట్లేయలేదు. గెలిపించలేదు. జగన్ పై భయంతో కూటమి పార్టీలకు అధికారం ఇచ్చారు. గ్రామాల్లో టీడీపీ పరిస్థితి రోజురోజుకూ దిగజారి పోతావుంది. అన్ని వర్గాల ప్రజలు నిరాశతో, అసంతృప్తిగా ఉన్నారు.

#### దేశ సంపద - వర్గీకరణ

జాతీయ బ్యాంకుల, దేశ సంపదలో వర్గీకరణ కావాలి. 25%



జనాభా కలిగిన ఎస్సీ, ఎస్టీలకు బ్యాంకు అప్పుల్లో 1% లోపు రుణాలు ఇస్తున్నారు. 50% పైగా జనాభా ఉన్న ఓబీసీలకు 2% లోపు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. 75%రుణాలు గుజరాతీలకు, మార్వాడీలే తీసుకుంటున్నారు. ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేసింది కొందరి కోసం కాదు. అందరి కోసం.

#### ఎన్నికల కమిషన్ ఎంపిక.

మొన్న అర్ధరాత్రి ఇద్దరు పెద్ద మనుషులు దొంగతనంగా ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేత, ఇందిరా గాంధీ మనవడు రాహుల్ గాంధీతో మాట్లాడకుండా, కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారిని ఎంపిక చేశారు. అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిని కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారిగా ఎంపిక చేయొచ్చు కదా?? బీజేపీకి నీతి లేదు, నిజాయితీ అంతకన్నా లేదు. చేసేదంతా దొంగ పనులే. దేవుణ్ని అడ్డం పెట్టుకుని బీజేపీ రాజకీయం చేస్తోంది. ఊహించలేనంత దారుణంగా దేశ పరిస్థితులు ఉన్నాయి. ఈవీయంలే బీజేపీని గెలిపిస్తావుంది.

సుప్రీంకోర్టులో ఈవీయంలపై పిటీషన్ పడ్డది. జడ్జీలను మేనేజ్ చేసి, జడ్జిమెంట్ను తారుమారు చేశారని, సుప్రీంకోర్టులో అందరూ చెప్పుకుంటున్నారు.

#### వెనుకబడిన ప్రాంతాలు

తిరుపతికి రావలసిన రాజధానిని మా ఊరు"బాబు" తుళ్లూరుకు తెచ్చాడు. 60 వేల కోట్లు అప్పులు తెచ్చి, ఒక ప్రాంతంలోనే ఖర్చు చేస్తున్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి గురించి చంద్రబాబు పట్టించుకోవడం లేదు. రాయలసీమ జిల్లాల్లో రోడ్లు లేకుండా, ఆస్పత్రుల్లో సూది, దూది లేకుండా ఉన్నాయి. బడుల్లో, కాలేజీల్లో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. కర్నూలు నుంచి ప్రకాశం జిల్లా వరకు, శ్రీకాకుళం, విజయనగరం, రాజమండ్రి వరకు 14 జిల్లాల్లో అభివృద్ధి ఆగిపోయింది. పోలవరం ఖర్చుపై కాళేశ్వరం ప్రాజెక్టు లాగా జ్యుడీషియల్ కమిషన్ వేసి, విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాను.

#### దళితులు - అంటరానితనం

తుళ్లూరు గుర్తొచ్చినప్పుడల్లా, దళితులు గుర్తొస్తారు. 300 ఏళ్ళ కిందట రాజా వెంకటాద్రి నాయుడు, తుళ్లూరు నుంచి, నాయుడుపేట వరకు పరిపాలించాడు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వెంకటాద్రి నాయుడు కు ఒక అందమైన చెల్లెలు ఉండేది. తుళ్లూరులో ఆనాటి హరిజనులు ఏదో అన్నారని, 175 మంది దళిత మగవాళ్ళ తలలను నరికి, పుర్రెలను తోరణాలుగా వేలాడదీసిన చరిత్ర తుళ్లూరుకుంది. జలియన్వాలాబాగ్ కంటే, తుళ్లూరులో దళితుల రక్తం ఏరులై పారింది.

చరిత్రలో అత్యంత ఘోరమైన సంఘటన ఇది. అంటరానితనం అనుభవించాం. ఆ తరువాత తుళ్లూరు రక్త చరిత్ర చూశాం. చుండూరు మారణ హోమం జరిగితే ఎవరు చంపారో తేలలేదు. శిక్షలు పడలేదు. కారం చేడులో ఆరుగురు దళిత మహిళల రొమ్ములు కోసినవారికి శిక్షలు విధించకుండా కోర్టులు తీర్పులిచ్చింది. దేశంలో దళితులకు తినేదానికి తిండి లేదు. 50% పైగా ఉన్న ఓబీసీల పరిస్థితి కూడా దారుణంగా ఉంది.

# మనం తప్పు చేసి తలదించుకునే పరిస్థితి లేదు

- ఇప్పుడు ఓటర్లు కూడా జగనే ఉండి ఉంటే అని ఆలోచిస్తున్నారు
- జగనన్న పాలనే మళ్ళీ కావాలనే గొంతులు పెరుగుతున్నాయి
- కూటమి పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి
- వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యూత్, స్టూడెంట్, ఇంటెలెక్చువల్ విభాగాలతో వైఎస్సార్సీపీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి సమావేశం

**తాడేపల్లి:** "రాష్ట్ర ప్రజలు మళ్లీ జగన్ పాలన కావాలని కోరుకుంటున్నారు. కూటమి పాలనలో ఎంత నష్టం జరుగుతుందో, జగన్ పాలనలో ఎంత మేలు జరిగిందో చెప్పాల్సిన బాధ్యత మీదే. ప్రధానంగా ఈ ఎనిమిది కాలంలో ఏ వర్గాలు ఏమి కోల్పోయాయో వారికి వివరించాల్సిన బాధ్య మీపై ఉంది. పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడంలో మీదే ప్రధాన పాత్ర" అని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, అనుబంధసంస్థల నేతలకు పిలుపునిచ్చారు.

సజ్జల రామకృష్ణారెడ్డి ఏమన్నారంటే

అన్ని రంగాలలో కీలక పాత్ర యువతదే, సొసైటీలో తమ బాధ్యతను గుర్తించి ముందుకెళ్ళాల్సిన దశ, అన్నింటికీ పునాది ఈ దశ నుంచే ఉంటుంది, రాజకీయాల్లో యువత పాత్ర ఎంత ఎక్కువగా ఉంటే నిర్ణయాలు అంత బావుంటాయి, దివంగత మహానాయకుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మంచి ఆశయాలు, ఆలోచనలే పునాదిగా, కోట్లాదిమంది అభిమానం పెట్టుబడిగా మన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రస్థానం ప్రారంభమైంది.

దేశంలో ఎక్కడా లేని విధంగా వైయస్ జగన్ పాలనలో సంస్కరణలు తీసుకొచ్చి ముందుకువెళ్ళాం, జగన్ పాలనలో మనం ఏ తప్పు చేయకుండా ప్రజల సంక్షేమం కోసం పాటుపడ్డాం, ఎలాంటి ఆశ్రిత పక్షపాతానికి తావులేకుండా పాలన అందించాం. మనం గర్వంగా కాలర్ ఎగరేసి చెప్పుకునేలా మనల్ని జగన్ నిలబెట్టారు. మనం తప్పు చేసి తలదించుకునే పరిస్థితి లేదు. ఇప్పుడు ఓటర్లు కూడా జగనే ఉండి ఉంటే అని ఈ రోజు ఆలోచిస్తున్నారు. ఈ ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఎక్కడా చూడలేదు. కూటమి ప్రభుత్వం వికృతమైన ఆట కొనసాగిస్తుంది.

మన ప్రభుత్వంలో చేసిన మంచిని నీరుగార్చే ప్రయత్నం జరుగుతోంది. అన్ని వ్యవస్థలను కూల్చేస్తున్నారు.జగన్ పునాదులతో నిర్మించిన వ్యవస్థలను కూల్చేసే కుట్ర కూటమి ప్రభుత్వం చేస్తుంది. ఇది రాష్ట్రానికి, భవిష్యత్ తరాలకు తీరని నష్టం. దీనిని గమనించి



ముందుకెళ్ళాలి. జగన్ సమగ్రమైన ప్రణాళికలు, ఆలోచనలతో యజ్ఞంలా సంస్కరణలు తీసుకొచ్చారు. ప్రపంచస్థాయిలో ఆలోచించ గలిగిన యువత మన రాష్ట్రం నుంచే ఉండాలని తపన పడ్డారు.

అన్ని రంగాలలో మన యువత ప్రపంచంతో పోటీపడేలా ఉండే ప్రయత్నం జగన్ చేశారు. కానీ దురదృష్టవశాత్తూ అవన్నీ నిర్వీర్యం చేస్తుంది కూటమి ప్రభుత్వం. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ నుంచి టెరిషియరీ కేర్ వరకూ, ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, నాణ్యమైన వైద్యం పేదలందరికీ అందుబాటులోకి తీసుకురావాలని జగన్ కృషిచేశారు, ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడం, కాంప్రహెన్సివ్ హెల్త్ కేర్ సిస్టమ్ తీసుకొచ్చారు, ఇప్పుడు కూటమి ప్రభుత్వం దానిని ప్రైవేటీకరణ చేసింది

చంద్రబాబు పాలసీ దారుణంగా ఉంది, జగన్ కట్టింది భవనాలు కాదు వ్యవస్థ. చంద్రబాబు వీటిని నిర్వీర్యం చేసి క్షమించరాని నేరం. మహా పాపం చేశారు. రాష్ట్రానికి తీరని ద్రోహం, నష్టం చేస్తున్నారు చంద్రబాబు. ఇక పోర్ట్‌ల విషయానికి వస్తే ప్రభుత్వ ఆదాయాన్ని రాకుండా చేసి ప్రైవేటీకరణ చేస్తున్నారు. దీంతో రాష్ట్రం పది, ఇరవై ఏళ్ళు వెనక్కిపోతుంది. ఉచిత విద్యుత్ విషయంలో కూడా ఇంతే. పీపీఏల పేరుతో ఆర్థిక భారం వేశారు. జగన్ రైతుకు హక్కుగా ఉచిత విద్యుత్ అందాలని ప్రయత్నం చేస్తే, చంద్రబాబు మాత్రం భారమయ్యేలా చేస్తున్నారు. ప్రజల సొమ్ముకు ధర్మకర్తలా ఉండాల్సిన వ్యక్తి ఇలా వ్యవహరిస్తున్నారు. ప్రతి రూపాయి పేదలకు అందాలని జగన్ ప్రయత్నిస్తే, చంద్రబాబు మాత్రం దోపిడీకి పాల్పడుతున్నారు

ప్రతిరోజూ జగన్‌పై, మన పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తూ ముందుకెళుతున్నారు. అనుబంధ సంఘాలన్నీ కూడా సమాయత్తం కావాలి. ఈ తప్పుడు ప్రచారం ఏ విధంగా తిప్పికొట్టాలి. మనం మళ్ళీ ఏ విధంగా సుపరిపాలన అందించగలమో చెప్పగలగాలి. బరితెగించి వ్యవహరిస్తున్న కూటమి పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి. అందులో ఈ విభాగాల రోల్ ఎక్కువగా ఉంది. పురోగమనం నుంచి తిరోగమనం వైపు వెళ్తున్న రాష్ట్రాన్ని మనం కాపాడుకోవాలి. చంద్రబాబు చేస్తున్న పాలన వల్ల రాష్ట్రం ఎలా నష్టపోతుందనే విషయాన్ని అన్ని ప్లాట్‌ఫామ్స్ పై మన గొంతు వినిపించాలి. రాష్ట్రానికి మంచి చేయడంలో మనం చక్కగా ముందు కెళ్ళాం.జగనన్న పాలనే మళ్ళీ కావాలనే గొంతులు పెరుగుతున్నాయి. అన్ని వర్గాల ప్రజలకు జగన్ పాలన ఎందుకు అవసరమనే చెప్పాలి

ఇందులో అనుబంధ విభాగాల పాత్ర అత్యంత కీలకమైనది, మీరు సమర్ధవంతంగా పనిచేసినప్పుడే పార్టీ బలోపేతం అవుతుంది. జగన్ వేసే ప్రతి అడుగులోనూ మనమంతా తోడుగా నిలిచి, బలమైన శక్తిగా ఎదుగుదాం. ఆల్ ద వెరీ బెస్ట్ అని అనుబంధ విభాగాల నేతలకు దిశానిర్దేశం చేశారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ అనుబంధాల విభాగాల ఇంఛార్జ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ జక్కంపూడి రాజా, స్టూడెంట్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ పానుగంటి చైతన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర, ఇంటెలెక్చువల్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ వై.ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, అన్ని జిల్లాల విభాగాల అధ్యక్షులు హాజరయ్యారు.

# బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేస్తున్న తెలుగు వైబ్‌పై చర్యలు తీసుకోండి


- బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారం చేస్తున్న తెలుగు వైబ్ ట్విట్టర్ హ్యాండిల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ ,సైబర్ క్రైమ్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బీ ఆర్ ఎస్ నేతలు దాసోజు శ్రవణ్ ,డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ,ఎర్రోళ్ల శ్రీనివాస్ ,అభిలాష్ రంగినేని ,కురువ విజయ్ కుమార్

**హైదరాబాద్:** తెలుగు వైబ్ అనే ట్విట్టర్ హ్యాండిల్ సృష్టించి బీ ఆర్ ఎస్ పార్టీపైన, బీఆర్ఎస్ అగ్ర నాయకత్వం పై కాంగ్రెస్ పార్టీ చిల్లర ప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ ఏమన్నారంటే.. చెల్లని రూపాయికి గీతలెక్కువ. చేతకాని రేవంత్ రెడ్డికి చిల్లర ప్రచారాలు ,చిల్లర వేషాలు ఎక్కువయ్యాయి. తెలుగు వైబ్ అనే ట్విట్టర్ హ్యాండిల్ సృష్టించి బీ ఆర్ ఎస్ పార్టీ పైన ,బీ ఆర్ ఎస్ అగ్ర నాయకత్వం పై కాంగ్రెస్ పార్టీ చిల్లర ప్రచారం చేస్తోంది. మా నేతలూ కేసీఆర్, హరీష్ రావుల మధ్య విబేధాలు న్నట్టుగా తెలుగు వైబ్ అదే పనిగా విషప్రచారం చేస్తోంది.

హరీష్‌రావుతో కేసీఆర్‌పై తప్పుడు పోస్టులు పెట్టడం ద్వారా బీ ఆర్ ఎస్ పార్టీని బద్నామ్ చేయాలనీ రేవంత్ రెడ్డి తెలుగు వైబ్ ద్వారా కుట్రకు తెరలేపారు. బీ ఆర్ ఎస్ కేడర్ మనోస్థయిర్యాన్ని అబద్ధపు కథనాలతో దెబ్బతీస్తున్న తెలుగు వైబ్ పై ఐటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి. తెలుగు వైబ్ వెనక ఉన్న వ్యక్తులను గుర్తించి తక్షణమే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులను కోరాము. భాద్యులను గుర్తించి చర్యలు చేపడతామని సంబంధిత పోలీసు అధికారులు హామీ యిచ్చారు.

డాక్టర్ ఆర్ .ఎస్ .ప్రవీణ్ కుమార్ ఏమన్నారంటే.. తెలంగాణ ఉద్యమం లో కీలక పాత్ర పోషించి బీ ఆర్ ఎస్ కీలక నేతగా ఉన్న మాజీ మంత్రి హరీష్ రావు ప్రతిష్టను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ కాంగ్రెస్ పార్టీ మా నేతల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోంది. సోషల్ మీడియా లో బీ ఆర్ ఎస్ పై అసభ్య పోస్టులు పెడుతున్న వారిపై ఎన్ని సార్లు పిర్యాదు చేసినా పోలీసులు స్పందించడం లేదు.

కనీసం ఈ రోజు మేమిస్తున్న ఫిర్యాదు ఆధారంగానైనా ఎఫ్ ఐ



ఆర్ నమోదు చేయాలని పోలీసులను కోరాం. బీ ఆర్ ఎస్ సోషల్ మీడియా కార్యకర్తల పై అక్రమకేసులు పెడుతున్న పోలీసులు కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తలు ఎన్ని దారుణాలు చేసినా పట్టించుకోవడం లేదు. బీ ఆర్ ఎస్ కు మద్దతుగా పోస్టులు పెడుతున్న వారిపై వరసగా కేసులు పెడుతున్నారు. కొందరిపై మళ్ళీ మళ్ళీ కేసులు పెడుతున్నారు. పోలీసులు వెంటనే నిష్పాక్షిక చర్యలు చేపట్టాలి.

ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పై సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. గతంలో కేటీఆర్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేసినందుకు ఐఏఎస్ ఐపిఎస్ అధికారుల సంఘాలు స్పందించాయి. సీఎం రేవంత్ వ్యాఖ్యలపై సంఘాలు ఎందుకు మౌనంగా ఉన్నాయో చెప్పాలి.



విజయవాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న జిబిఎస్ పేషెంట్‌తో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి.. శివాజీ మహారాజ్ చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు వాకాటి శ్రీహరి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, తదితరులు

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 20, ఫిబ్రవరి 2025 ‖



# శివాజీ మహారాజ్ జీవితాన్ని తప్పక తెలుసుకోవాలి

- శివాజీ జయంత్యుత్సవంలో వక్తలు





విశాఖపట్నం, మహానాడు: నగరంలోని శివాజీపాలెంలోని శివాజీ పార్కులో బుధవారం సాయంత్రం ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంత్యుత్సవం జరిగింది. ప్రతి పౌరుడు శివాజీ మహారాజ్ జీవితాన్ని తెలుసుకోవాలని, ఆ ధైర్యసాహసాలు పుణికిపుచ్చుకోవాలని వక్తలు సూచించారు. గౌరవ అతిథిగా హిందూ ధార్మిక పరిషత్ చైర్మన్ బుద్ధరాజు శివాజీ, ముఖ్య వక్తగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఇప్పిలి భానుమూర్తి, ఛత్రపతి శివాజీ మహారాజ్ ఉత్సవ కమిటీ కన్వీనర్ గున్న యోగచంద్ర వివేక్, కమిటీ సభ్యులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.



## బొల్లాపై వినుకొండ వైసీపీ నేతల తిరుగుబాటు!

- ఇన్‌ఛార్జిగా బొల్లా వద్దు... చుండూరిని నియమించండి
- సజ్జలని కలిసి విన్నవించామని ఆ పార్టీ నేతల వెల్లడి

వినుకొండ, మహానాడు: నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి బొల్లా బ్రహ్మనాయుడును మార్చాలని... బుధవారం తాడేపల్లిలో పార్టీ సీనియర్ నాయకుడు సజ్జల రామ కృష్ణారెడ్డిని కలిసి విన్నవించినట్టు ఆ పార్టీ నేతలు వెల్లడించారు. నియోజకవర్గ వర్గ ఇన్‌ఛార్జి గా బొల్లా బ్రహ్మనాయుడును తొలగించి శావల్యాపురం మండలం వైసీపీ నేత, ఈపూరు మార్కెట్ కమిటీ చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు ను నియమించాలని సజ్జలకు విన్నవించామని వారు చెప్పారు.

## ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించిన లోకేష్

- సమస్యలు పరిష్కరించి అండగా నిలుస్తానని మంత్రి హామీ

తిరుపతి, మహానాడు: తెలుగుదేశం పార్టీ తిరుపతి కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 59వ రోజు ప్రజాదర్బార్ బుధవారం నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న సామాన్యుల నుంచి అర్జీలు స్వీకరించారు. 2007 నుంచి 2011 వరకు కాంట్రాక్ట్ పద్ధతిలో నియమితులై, సొంత మండలాల్లోని పీహెచ్ సీ సబ్ సెంటర్లలో సెకెండ్ ఏఎన్ఎమ్ లుగా విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్ధీకరించాలని సెకెంట్ ఏఎన్ ఎమ్ లు మంత్రి ను కలిసి విజ్ఞప్తి చేశారు.

16 ఏళ్లుగా రెగ్యులర్ వారితో సమానంగా విధులు నిర్వహిస్తున్నామని, వేతనాలు సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెగ్యులర్ ఏఎన్ఎమ్ పోస్టులను 2007 నుంచి పనిచేస్తున్న సెకెండ్ ఏఎన్ఎమ్ లతో భర్తీ చేయాలని కోరారు. ఎస్ఎల్ఎమ్ పీసీ కార్పొరేషన్ తరపున తిరుమల లడ్డూ కౌంటర్ లో విధులు నిర్వహించే తాను రోడ్డు ప్రమాదం కారణంగా కొన్ని నెలలుగా విధులకు హాజరుకాలేకపోయానని, రీజాయినింగ్ కు అనుమతించాలని తిరుపతికి చెందిన ఎ.నాగసాయి కార్తీక్ విజ్ఞప్తి చేశారు.

హంద్రీనీవా ప్రాజెక్టు కింద భూమి కోల్పోయానని, ఇంటర్ చదివిన తన కుమారుడికి టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని చిత్తూరు జిల్లా, ఐరాల మండలం చెంగనపల్లెకు చెందిన పి.మునేశ్వర శెట్టి కోరారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

## అరగంట వృథాపై ప్రేక్షకుడు కేసు!

- బాధితుడికి రూ.65,000 చెల్లించాలి
- రూ.1,00,000 జరిమానా కట్టాలి
- పీవీఆర్ ఐనాక్స్ సినీ థియేటర్‌కు కోర్టు ఆదేశం



బెంగళూరు: సినిమా ముందు అరగంట యాడ్స్ వేసి తన సమయాన్ని వృథా చేశారని పీవీఆర్ ఐనాక్స్ సినీ థియేటర్, బుక్ మై షోపై బెంగళూరుకు చెందిన వ్యక్తి కోర్టులో కేసు వేశాడు. 2023లో బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి సాయంత్రం నాలుగు గంటల షోకు ఓ పీవీఆర్ ఐనాక్స్‌లో సినిమాకు వెళ్ళారు. అరగంట యాడ్స్ వేసి సినిమాను సాయంత్రం 4:30 గంటలకు మొదలెట్టారు. దీంతో 6 గంటలకు అయిపోవాల్సిన సినిమా 6:30 కి అయిందని, ఈ ఆలస్యం వల్ల తన షెడ్యూళ్లు క్యాన్సిల్ చేసుకున్నానని కేసు వేశాడు. సమయాన్ని వృథా చేసినందుకు వ్యక్తికి రూ. 65,000 చెల్లించాలని, అలాగే రూ. 1,00,000 జరిమానా కట్టాలని పీవీఆర్ ఐనాక్స్‌ను కోర్టు ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో బుక్ మై షోకి సంబంధం లేదని మినహాయించింది.

## మార్కెట్ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యకు చెక్

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

బుచ్చిరెడ్డి పాళెం, మహానాడు: పట్టణం చెన్నూరు రోడ్డు లోని ఆటో స్టాండ్ ను గిరిజ హాలు వద్దకు తరలించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహ కూడలిలోను అటు చెన్నూరు రోడ్డు వైపున రోడ్డు మార్జిన్ వ్యాపారస్థులతో ఆమె మాట్లాడారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. అనంతరం టిడిపి కార్యాలయం లోటస్ గ్రాండ్ లో చెన్నూరు రోడ్డులో తోపుడు



బండ్లపై పళ్ళు, కూరగాయలు అమ్ముకునే వ్యాపారాస్థులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా రోడ్డు మార్జిన్ వెండర్స్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ విస్తరణలో భాగంగా షాపులు కోల్పోయిన వారికి ఈ నెల 25 లోపు తాత్కాలిక రేకుల షెడ్లు ఏర్పాటు చేయాలని ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ ఛైర్మన్లు యరటపల్లి శివకుమార్ రెడ్డి, నస్రీన్ ఖాన్, కౌన్సిలర్లతో పాటు టిడిపి అర్బన్, రూరల్ మండల అధ్యక్షుడు ఎంవి శేషయ్య, బత్తుల హరికృష్ణ, కోడూరు కమలాకర్ రెడ్డి, మోర్ల మురళి, వింజం రామానాయుడు, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంలో ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

హైదరాబాద్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు & బిజెపి శాసనసభ పక్ష ఉప నాయకులు పాయల్ శంకర్, బీజేపీ మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి , బిజెపి కరీంనగర్ నిజామాబాద్ అదిలాబాద్ మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి అభ్యర్థి అంజిరెడ్డి, బిజెపి కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థి మల్కా కొమరయ్య, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థగత) చంద్రశేఖర్ తివారి జీ, బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థగత) మధుకర్ జీ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు ఏమన్నారంటే.. భారతదేశంలో శివాజీ మహారాజ్ లాంటి పరిపాలకుడు అరుదు. ఆయన పాలన మత, కులాలకు అతీతంగా సమగ్ర అభివృద్ధికి మార్గదర్శకం. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ గారికి ఘన నివాళులు



అర్పిస్తున్నాం.

శివాజీ మహారాజ్ భారతదేశంలో ఆదర్శ పరిపాలన అందించిన యోధుడు. ఆయన ఒక కులానికి, మతానికి చెందిన రాజుగా కాకుండా, యావత్ భారత దేశానికే మంచి పరిపాలనా యంత్రాంగాన్ని అభివృద్ధి చేశారు. నేటి రెవెన్యూ వ్యవస్థ, సివిల్ సర్వీసెస్ విధానాలు శివాజీ మహారాజ్ పరిపాలనా మోడల్ ఆధారంగా రూపుదిద్దుకున్నాయి.

ఆయన మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా మాత్రమే కాకుండా, అన్ని మతాలను గౌరవించేలా సమగ్ర పాలన అందించారు. శివాజీ మహారాజ్ పాలన మనందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. శివాజీ మహారాజ్ స్ఫూర్తిగా మన పాలకులు అవినీతిరహిత పాలన అందించాలని కోరుతున్నాను. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి ఏమన్నారంటే.. శివాజీ మహారాజ్ పాలన మానవతా విలువలకు అద్దంపడుతుంది. దేశాభివృద్ధికి ఆయన చూపిన మార్గమే స్ఫూర్తి. శివాజీ మహారాజ్ ఆదర్శవంతమైన పాలన అందించి, రక్షణ, వైద్య, విద్య, సివిల్ సర్వీసుల వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచారు.


ప్రజాసేవలో నిస్వార్థమైన అంకితభావంతో పాలనను అందించి, రాజధర్మానికి సరికొత్త నిర్వచనం ఇచ్చారు. శివాజీ మహారాజ్ స్ఫూర్తితో సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశ ఐక్యత కోసం కృషి చేశారు. అదే మార్గాన్ని అనుసరించి ప్రధాని నరేంద్ర మోదీ సమర్థమైన పాలన అందిస్తున్నారు.

# గిరిజన ప్రాంతాల్లో మీ డాక్టర్ -మీ ఇంటికి
# సంచార వైద్యశాల ప్రాజెక్ట్ ఏప్రిల్‌లో ప్రారంభం

- ఏపీ రెడ్ క్రాస్ జనరల్ సెక్రటరీ మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ.కె.పరిదా

విజయవాడ: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ), AP స్టేట్ బ్రాంచ్ మరియు REC ఫౌండేషన్ సంయుక్తంగా పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు పాడేరు, పల్నాడు, తిరుపతి మరియు నంద్యాల తదితర 7 జిల్లాలలో నివసించే నిరు పేద గిరిజనుల కోసం "మీ డాక్టర్ మీ ఇంటికి" అనే ఒక వినూత్న మొబైల్ మెడికల్ యూనిట్‌ను పేద గిరిజనుల కోసం ఏప్రిల్‌లో ప్రారంభించనున్నామని ఏపీ రెడ్ క్రాస్ జనరల్ సెక్రటరీ మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ.కె.పరిదా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మీ డాక్టర్ -మీ ఇంటికి మొబైల్ మెడికల్ ప్రాజెక్ట్ రాష్ట్ర విభజన తర్వాత ఎపి రెడ్ క్రాస్ యొక్క అతిపెద్ద CSR ప్రాజెక్ట్ అని, ఈ ప్రాజెక్ట్ యొక్క మొత్తం వ్యయం రూ. 8.40 కోట్లతో రూపొందిందని, ఈ ప్రాజెక్ట్ ఏప్రిల్, 2025 నుండి మూడు సంవత్సరాల వ్యవధిలో అమలు చేయబడుతుంది. మొత్తం ఖర్చు REC ఫౌండేషన్ ద్వారా అందించబడుతుంది అని ఎ.కె.పరిదా తెలిపారు. ఈ ప్రాజెక్టో భాగంగా ఒక వైద్యుని



నేతృత్వంలో స్టాఫ్ నర్సు మరియు ఫార్మసిస్ట్‌తో కూడిన బృందం REC ఫౌండేషన్ అందించిన వాహనాల్లో పేద లబ్దిదారుల కుటుంబాల ఇంటి వద్దకు వెళ్లి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీతో సహా ఆరోగ్య సంరక్షణను అందిస్తుంది అని ఆయన తెలిపారు.

శిశు మరణాల రేటు , ప్రసూతి మరణాల రేటు తగ్గించడానికి, మొత్తం మరణాల రేటును తగ్గించడానికి, అంటువ్యాధుల వ్యాప్తి తగ్గించడానికి మరియు 100% వ్యాది నిరోధక టీకాలు మరియు వైద్య సౌకర్యం అందుబాటులో లేని మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడం లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ ను రూపొందించామన్నారు. 30% మొబైల్ మెడికల్ యూనిట్లు కేవలం మహిళలు మరియు వృద్ధులకు వైద్య సాయం అందించడానికి కేటాయించబడ్డాయన్నారు. డ్రైవర్ మినహా మిగిలిన సిబ్బంది అంతా మహిళా సిబ్బందితో ఈ ప్రాజెక్ట్ నిర్వహించ బడుతుంది అని ఫరీదా తెలిపారు.

ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ఎ.కె.పరిదా విజయవాడ లోని ఆర్ఇసి చీఫ్ ప్రోగ్రామ్ మేనేజర్ సంజయ్ కుమార్ రాయ్ బుధవారం ఒప్పంద పత్రం పై సంతకం చేశారు.

# త్వరలో అందుబాటులోకి 'స్విమ్స్ ఆసుపత్రి రెఫెరల్స్

- 15ఏళ్లుకు పైగా భర్తీ కి నోచుకోని నర్సింగ్ , పారా మెడికల్ పోస్టుల భర్తీ కి చర్యలు
- ఈ. ఎస్. ఐ. వైద్య సేవలను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు
- కార్మిక, బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి.సుభాష్
- తిరుపతి ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి సుభాష్
- మెరుగైన సేవలు అందిస్తున్న తిరుపతి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. శ్యాంబాబు కు అభినందన
- తిరుపతి ఆసుపత్రి తనిఖీ సందర్బంగా మంత్రి సుభాష్



తిరుపతి: రాష్టంలో కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్నీ చర్యలు తీసుకొంటున్నట్టు రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు,బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి. సుభాష్ ప్రకటించారు. ఆయన బుధవారం మధ్యాహ్నం తిరుపతి కార్మిక రాజ్య బీమా (ఈ. ఎస్. ఐ )ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్బంగా ఆసుపత్రి లోని అవుట్ పేషెంట్ బ్లాక్, అత్యవసర విభాగం, ఓ. పి. రిజిస్ట్రేషన్ విభాగం, ఇతర విభాగాలను తనిఖీ చేశారు.

గత సంవత్సరం నవంబర్ లో ఆసుపత్రి సందర్శన కు వచ్చినప్పుడు వున్న అవుట్ పేషెంట్స్ నమోదు సంఖ్య 150 నుండి ప్రస్తుతం 350 వరకు పెరగడం పై,అలాగే, ఇన్ పేషెంట్స్ అడ్మిషన్స్ సంఖ్య 30 నుండి 53 వరకు పెరగడం పై కూడా సంతృప్తి వ్యక్త పరిచారు.

అలాగే పేషెంట్స్‌కు గత 5 ఏళ్లుగా సక్రమంగా లేని ల్యాబ్ కిట్స్, రీ ఏజెంట్స్, ఇతర పరికరాలను సుమారు 5 లక్షల తన సొంత ఖర్చుతో సమ కూర్చడం పై, ఇతర సేవలు సమకూరడంపై ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. ఎం.శ్యాంబాబును అభినందిస్తూ దుస్సాలువతో సన్మానం చేశారు. రాష్ట్రము లోని ఇతర ఆసుపత్రి లు, డిస్పెన్సరీ లు తిరుపతి ఆసుపత్రి ని ఆదర్శంగా తీసుకొని రాష్ట్రము లో సిబ్బంది పనిచేస్తూ కార్మికులకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి వాసంశెట్టి. సుభాష్ ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు.

గత ఆరు సంవత్సరాలకు పైగా రాయలసీమ, నెల్లూరు లాంటి జిల్లాల ఈ. ఎస్. ఐ. కార్మికులకు అందని ద్రాక్ష గా వున్న తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి సెకండరీ, టెరిషరీ రేఫరల్ వైద్య సేవలు.. మరి







కొన్ని రోజుల్లో అందుబాటులోకి రానున్నాయని మంత్రి పేర్కొంటూ, ఇందుకు ప్రత్యేక కృషి చేసిన రాష్ట్ర బీమా వైద్య శాఖ డైరెక్టర్ వి. ఆంజినేయులు, ఈ.ఎస్.ఐ. కార్పొరేషన్ సంస్థ విజయవాడ రీజినల్ డైరెక్టర్, తిరుపతి ప్రాంతీయ అధికారులకు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా వున్న అన్నీ ఈ.ఎస్.ఐ. ఆసుపత్రిలలో కార్మికులకు మెరుగైన ల్యాబ్ సర్వీస్‌లు, ఇన్ పేషెంట్స్ సేవలు అందించేందుకు అన్నీ చర్యలు తీసుకొంటున్నట్టు మంత్రి సుభాష్ పేర్కొన్నారు. అలాగే, రాష్ట్ర బీమా వైద్య శాఖ లో గత 15 ఏళ్లుగా భర్తీ కి నోచుకోని నర్సింగ్, పారా మెడికల్ పోస్టుల భర్తీ కి చర్యలు తీసుకొంటున్నట్టు ఆయన చెప్పారు.

ఈ.ఎస్.ఐ.లో ఎటువంటి అలసత్వం ను సహించమని, అలాగే కష్టపడి సంస్థ అభివృద్ధి చేసేవారిని మరిచేది లేదని ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించడానికి నా వైపునుండి అన్ని తొందరలో సమకూర్చి మళ్ళీ కలుస్తానని చెప్పారు. ఈ తనిఖీ సందర్బంగా మంత్రి వెంట ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. ఎం. శ్యాంబాబు, సి.ఎస్.ఆర్.ఎం.ఓ. డాక్టర్. AVS ప్రసాద్ తదితరులు వున్నారు.

# "గ్రామీణ భారత మహోత్సవం - ఆంధ్రప్రదేశ్ 2025" కు పోటెత్తిన మహిళలు

- ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాల్స్ మహిళలతో రద్దీ
- ఆదివారంతో ముగియనున్న గ్రామీణ భారత్ మహోత్సవం - ఆంధ్రప్రదేశ్ 2025
- ఇప్పటి వరకు రూ.35 లక్షల ఆదాయం 10 వేల మంది సందర్శన
- నాబార్డు డీజీఎం మురారీ మోహన్ బెహ్రా

విజయవాడ: ఎంతో ప్రతిష్టాత్మక్మంగా ప్రారంభమైన "గ్రామీణ భారత మహోత్సవం – ఆంధ్రప్రదేశ్ 2025" ను ఈ నెల 14 న మేరిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ప్రారంభించడం జరిగిందని నాబార్డు డీజీఎం మురారీ మోహన్ బెహ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ భారతదేశ ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటైన ఈ ప్రదర్శన ను ఇప్పటి వరకు 10 వేల మంది సందర్శించగా వివిధ వస్తువుల కొనుగోళ్ల ద్వారా రూ. 35 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. నగర ప్రజలతోపాటు రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వివిధ రాష్ట్రాల నుంచి ఏర్పాటైన కళాఖండాలు, వస్త్రాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నా యన్నారు. దేశంలోనే వివిధ రాష్ట్రాల నుంచి నైపుణ్యం కలిగిన చేనేత మరియు హస్త కళాకారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు



తయారు చేసిన వస్తువులు ఇందులో ప్రదర్శిస్తున్నారన్నారు. గ్రామీణ భారతదేశ అభివృద్ధి కోసం నాబార్డు చేస్తున్న సమగ్ర కృషిని నగర ప్రజలు మరింత ఆదరించాలన్నారు. ఈ రాష్ట్ర స్థాయి ప్రదర్శన ఈనెల 24 (ఆదివారం)తో ముగియనున్నదని నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ ప్రదర్శనలో రాష్ట్ర సాంప్రదాయ హస్తకళల్లో మంగళగిరి పట్టు, ఉప్పాడ, పొందూరు ఖద్దరు, తెలంగాణ ప్రత్యేకతలైన నారా



యణపేట సిల్క్ & కాటన్ చీరలు ఉన్నాయన్నారు. అలాగే శ్రీకాకుళం లోని సిక్కోలు కాటన్ చీరలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నా యన్నారు. తిరుపతికి చెందిన బాలాజీ హస్త కళలు, ధర్మవరం పట్టు చీరలు, శ్రీ బాలాజీ కాటన్ సిల్క్, కొండపల్లి, ఏటికొప్పాక వంటి సంప్రదాయ కళాఖండాలతో పాటు, తమిళనాడు నుండి ప్రత్యేకంగా వచ్చిన నవసారిగై OFPO పట్టు చీరలు కూడా ఈ ప్రదర్శనలో ప్రాముఖ్యత సంతరించుకున్నాయన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 20, ఫిబ్రవరి 2025 ||



## నాలుగేళ్ల నుండి రిజిస్ట్రేషన్ కాని ప్లాట్‌లు కొన్న పేదలకు శుభవార్త

మొదటి పేజీ తరువాయి..

ఒక లేఅవుట్లో 10 శాతం ప్లాట్లు రిజిస్టర్ అయి ఉండి మిగిలిపోయిన 90 శాతం ప్లాట్ లకు ఎల్ఆర్ఎస్ పథకంలో రెగ్యులరైజేషన్కు అవకాశం కల్పించారు.

వీరు కూడా మార్చి 31 వరకు 25 శాతం రాయితీ పొందే అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ప్లాట్లు కొనుగోలు చేసి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ కలిగిన వారికి కూడా 31 లోగా ఎల్ఆర్ఎస్ చేసుకుంటే 25 శాతం రాయితీ కల్పిస్తూ మంత్రులు నిర్ణయం తీసుకున్నారు. పేద ప్రజలు, గత నాలుగు సంవత్సరాల నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం గురించి ఎదురు చూస్తున్నారు. పేదల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా మంత్రులు విజ్ఞప్తి చేశారు. ఈ పథకాన్ని రోజువారీగా సమీక్షించి నిర్ణయించారు. ఎల్ఆర్ఎస్ అమలులో భాగంగా పలు వెసలుబాట్లు కల్పిస్తున్న నేపథ్యంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండాలని, వీటి విషయంలో కఠినంగా వ్యవహరించాలని మంత్రులు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా ఎల్ఆర్ఎస్ పథకాన్ని సులభతరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఎల్ఆర్ఎస్ కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎల్ఆర్ఎస్ రెగ్యులరైజేషన్ కోసం సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్దనే చెల్లింపులు చేసి ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పురపాలక పట్టణ అభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



## జగన్ రైతులను ఉద్ధరిస్తాననడం ఉత్తిమాటే!

- మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు

**కొత్తరెడ్డిపాలెం, మహానాడు:** కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటికి మద్దతుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు బుధవారం ప్రచారం నిర్వహించారు. బుధవారం గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గం చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెం లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. విద్యావంతులు బాగా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఏడు నెలల్లో కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ధాన్యం కొన్న 24 గంటల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓటమి ప్రభుత్వం రైతులకు డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. ధాన్యం సేకరణ, చెల్లింపుల్లో గత వైసీపీ రైతులను ఇబ్బంది పెట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వం రైతులకు పెండింగ్ పెట్టిన రూ.1,674 కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. ఐదేళ్ల పాలనలో జగన్ రాష్ట్రాన్ని విధ్వంసం చేసినందుకే రాష్ట్ర ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారన్నారు.

జగన్ హయాంలో మిర్చి రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. రేపు చంద్రబాబు ఢిల్లీలో కేంద్రమంత్రిని కలుస్తారని, మిర్చి రైతుల సమస్యలు గురించి చంద్రబాబు వివరిస్తారని వివరించారు. 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రాజేంద్రప్రసాద్‌కు పొన్నూరు నియోజకవర్గం నుంచి శాసన సభ్యుడు ధూళిపాల నరేంద్ర నేతృత్వంలో అత్యధిక మెజారిటీతో గెలుపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## మహిళా వర్సిటీ ఐటి, లైఫ్ సైన్సెస్ ల్యాబ్‌లు లోకేష్ పరిశీలన

**తిరుపతి, మహానాడు:** తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఐటి, లైఫ్ సైన్సెస్ ల్యాబ్‌లను రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి అధ్యాపకులు మంత్రి లోకేష్‌కు వివరాలు తెలియజేస్తూ... తాం అతి తక్కువ ఖర్చుతో డ్రోన్ పీసీబీలు తయారు చేస్తున్నామని చెప్పారు. 2.5 కి.మీ.ల రేంజిలో పనిచేసే అధునాతన డ్రోన్ ను తాం కేవలం



రూ.5 లక్షలతో తయారు చేశామని తెలిపారు. గతప్రభుత్వంలో చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నపుడు జ్ఞానభేరి కార్యక్రమంలో ఈ ల్యాబ్ ఏర్పాటుచేశారని అన్నారు. డ్రోన్ సాఫ్ట్‌వేర్‌పై దృష్టిసారించాల్సిందిగా మంత్రి లోకేష్ సూచించారు.

సోలార్ ఫోన్ చార్జర్, వాటర్ బాటిల్స్ వ్యర్థాలతో బ్యాగుల తయారీ, బనానా వేస్ట్ తో తయారు చేసిన శాలువా, హెర్బల్ శానిటరీ న్యాప్కిన్స్ తదితర ఆవిష్కరణలను మంత్రి లోకేష్ పరిశీలించారు. అనంతరం లైఫ్ సైన్సెస్ ల్యాబ్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌ను మంత్రి లోకేష్ పరిశీలించారు. 2017లో చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నపుడు ఈ ల్యాబ్‌ను ప్రారంభించారని సిబ్బంది తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన టెక్నాలజీ అండ్ సాఫ్ట్ వేర్ విభాగం, జునెసిస్, పద్మావతి వర్సిటీ సంయుక్తంగా ఈ ల్యాబ్ ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఐఐటి, ఐషర్ వంటి ఉన్నత విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థుల నవీన ఆవిష్కరణలు, స్టార్టప్ లకు తాం సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నామని, 40లక్షల వరకు ఈక్విటీ సాయం కూడా చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు 26మందికి 3కోట్లు అందించామని, మరో 14 మందికి త్వరలో ఆర్థిక సాయం చేయనున్నట్టు తెలిపారు. ఇన్నోవేషన్స్, స్టార్టప్స్‌ను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని వారు చెప్పారు.



తిరుపతి కార్పొరేటర్లతో సమావేశమైన మంత్రి నారా లోకేష్




పుట్టపర్తి శ్రీ సత్య సాయి జిల్లా స్థానిక కలెక్టర్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలో 20 సూత్రాల అమలు కార్యక్రమ ఛైర్మన్ లంకా దినకర్, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం, ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.







## డీజీపీ ఆఫీసులో దొంగ మహిళ!

- ఉద్యోగం ఇప్పిస్తానని రూ.లక్షలు గుంజిన కిలాడి
- గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన టీడీపీ నేతలు

**మంగళగిరి, మహానాడు:** డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బేతపూడి దివ్య అనే మహిళ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తమ వద్ద ఐదు లక్షలు తీసుకొని తమను మోసం చేసిందని.. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. కేసు తీసుకోకుండా ఫోన్ కాల్ చేసి ఆమె పోలీసు అధికారులను మ్యానేజ్ చేస్తోందని బాధితులు బోరుమన్నారు. దయ చేసి ఆమెపై చర్యలు తీసుకొని తమ డబ్బుల తమకు ఇప్పించాలని బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షరీఫ్, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ లకు అర్జీలు స్వీకరించారు.

- అనంతపురం జిల్లా గుత్తికి చెందిన సున్నపు నాగరాజు గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. రిజిస్ట్రేషన్ భూమిని అధికారులు నిషేధిత భూమిగా పెట్టడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని.. దయ చేసి తమ భూమిని నిషేధిత భూమి నుండి తొలగించి తమకు ఇబ్బంది లేకుండా చూడాలని నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- తాము టీడీపీకి సపోర్ట్ గా ఉండటంతో గత ప్రభుత్వంలో తప్పుడు కేసులు పెట్టి తమ క్వారీని నిలిపేశారని.. దాంతో తీవ్ర ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నానని దయ చేసి తనకు మట్టి క్వారీకి అనుమతి ఇప్పించి ఆదుకోవాలని విజయవాడకు చెందిన పిన్నిబోయిన శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.
- అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన పఠాన్ అఫ్రాన్ విజ్ఞప్తి చేస్తూ.. తన ఇంటి వెనుకాల ఉన్న తమ స్థలాన్ని మరొకరు ఆక్రమించుకున్నారని.. దయ చేసి తమ స్థలాన్ని సర్వే చేసి కబ్జా నుండి విడిపించాలని నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు.
- నెల్లూరు జిల్లా జలదంకి మండలం కేసవరం గ్రామానికి చెందిన కొమ్మినేని నరసింహారావు విజ్ఞప్తి చేస్తూ.. గత ప్రభుత్వం చేపట్టిన భూ రిసర్వేలో తమ భూమిలో విస్తీర్ణం తక్కువగా నమోదు చేశారని అంతే కాకుండా 1బీలో మరొకరి పేరు నమోదు చేశారని.. వీటిని సరిచేసి తమ భూమి తమ పేరుపై ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు.
- నంద్యాల జిల్లా నంద్యాలకు చెందిన నారబోయిన కృష్ణమూర్తి విజ్ఞప్తి చేస్తూ.. తాను గుండె సమస్యతో ఇబ్బంది పడుతున్నానని.. వెంటనే ఆపరేషన్ చేయాలని దానికోసం తాను ఇచ్చిన డబ్బులు అడుగుతుంటే షేక్ బాబా హుషేన్ అనే వ్యక్తి తన దగ్గర రూ 10 లక్షలు తీసుకొని తిరిగి ఇవ్వడంలేదని.. దయ చేసి తనకు డబ్బులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశాడు.
- అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లి మండలం మిట్టమీదపల్లి గ్రామానికి చెందిన పెద్దివీటి అనిల్ కుమార్ విజ్ఞప్తి చేస్తూ.. తమ ఇంటి పక్కన ఉండే వైసీపీ నాయకుడు భద్రి రమేష్ అతని అనుచరులు వైసీపీ ప్రభుత్వ అండతో తమ స్థలాన్ని ఆక్రమించుకోవడమే కాకుండా తమపై అక్రమ కేసులు పెట్టాడని.. అంతే కాకుండా తమను కార్లతో గుద్ది చంపేందుకు యత్నించారని.. వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు.



- కాకినాడ జిల్లా పిఠాపురం టీడీపీ మాజీ కౌన్సిలర్ మసకపల్లి వెంకటేశ్వరరావు నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ స్థలాన్ని సర్వే చేసి భూమికి హద్దులు చూపాలని అధికారులకు ఎన్ని సార్లు అర్జీ పెట్టుకున్నా పట్టించుకోవడంలేదని.. దయ చేసి తమ స్థలాన్ని సర్వేచేసి తమకు హద్దులు చూపాలని విజ్ఞప్తి చేశారు.
- అప్పులు కట్టేందుకు తమను ఆస్తి అమ్మకుండా తమ కుమారుడు తమను ఇబ్బంది పెడుతున్నాడని.. తాగి వచ్చి రోజూ కొడుతున్నాడని దయ చేసి తమ కుమారుడిపై చర్యలు తీసుకొని తాము ప్రశాంతంగా జీవించేలా చూడాలని అనకాపల్లి జిల్లా ఎస్. రాయవరం మండలానికి చెందిన సరోజ అనే వృద్ధురాలు ఆమె భర్త గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన హెచ్. హుసెన్ బాషా విజ్ఞప్తి చేస్తూ తాము గతంలో ప్రభుత్వ స్కూల్ పిల్లల కోసం కుట్టిన యూనిఫాంల డబ్బులు నేటికి రాలేదని దయ చేసి తమకు రావాల్సిన బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

## క్రీడల్లో ఉత్తమ రాష్ట్రంగా ఏపీ!

- అనువైన వాతావరణాన్ని అభివృద్ధి చేస్తాం
- అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తాం
- పద్మావతి యూనివర్సిటీలో 7.5 కోట్లతో అధునాతన ఇండోర్ స్టేడియం
- రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభం

**తిరుపతి, మహానాడు:** రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసి, క్రీడలకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కేంద్ర ప్రభుత్వం, మహిళా యూనివర్సిటీ, శాప్ సంయుక్తంగా రూ.7.5 కోట్లతో నిర్మించిన ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని మంత్రి లోకేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.... అమరావతిలో అధునాతన అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్



కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.

పద్మావతి యూనివర్సిటీ వేదికగా ఉత్తమ క్రీడాకారిణులను తయారుచేసేందుకు కొత్తగా నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులతో మంత్రి లోకేష్ కొద్దిసేపు షటిల్ ఆడి ఉత్సాహ పర్చారు. అధునాతన సౌకర్యాలతో ఏర్పాటుచేసిన ఏరోబిక్స్, టైక్వాండో, యోగా మెడిటేషన్ సెంటర్లను కూడా లోకేష్ ప్రారంభించారు. యూనివర్సిటీ విద్యార్థినులు, క్రీడాకారిణులు ఇక్కడ ఏర్పాటుచేసిన క్రీడా వసతులను వినియోగించుకుని రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమా మాట్లాడుతూ క్రీడాకారిణులకు



యూనివర్సిటీలో మంచి శిక్షణ వేదిక లభించడం తమ విద్యార్థినులకు గొప్ప అవకాశమన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ... రాష్ట్రంలో చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్టు చెప్పారు. క్రీడాభివృద్ధికి మంత్రి లోకేష్ చూపుతున్న చొరవ, కృషి అభినందనీయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, శాప్ ఎండి గిరీషా, శాసన సభ్యుడు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, యూనివర్సిటీ రిజిస్ట్రార్ రజని తదితరులు పాల్గొన్నారు.



రేణిగుంట ఎయిర్ పోర్టుకు చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
09
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 20, ఫిబ్రవరి 2025


# టీడీపీలో కార్యకర్తే అధినేత!

మొదటి పేజీ తరువాయి..

ముందుగా టీడీపీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జ్‌లతో పాటు బాబు ష్యూరిటీ–భవిష్యత్‌కు గ్యారెంటీ, మన టీడీపీ యాప్, సభ్యత్వ నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని అభినందించారు. ఈ



సందర్భంగా కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్య లను పరిష్కరించి అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు.

## పనిచేసే వారిని ప్రోత్సహిస్తా...

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లా డుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మా అందరికీ పదేపదే చెప్పేది.. ఏ నియోజకవర్గంలో పర్యటించినా అక్కడి క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులను కలిసి మాట్లాడా లని అనంతరం బాబు ష్యూరిటీ– భవిష్యత్ గ్యారంటీ, మన టీడీపీ యాప్, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం కావాలని ఆదేశించారు. అందులో భాగం గానే పార్టీని బలోపేతం చేసేందుకు నేను సగం రోజు మీతో గడుపుతున్నాను. పార్టీ, ప్రభుత్వం రెండూ అను సంధానమై ముందుకు పోవాల్సిన అవసరం ఉంది. పార్టీలో నూతనంగా క్లస్టర్, యూనిట్, బూత్ విధానాన్ని తీసుకువచ్చాం. గతంలో నేను పాదయాత్ర చేసినప్పుడు అన్నా నేను కష్టపడ్డాను.. నన్ను గుర్తిం చడం లేదని చాలా మంది నాతో చెప్పారు. సీనియర్లు, జూనియర్లను సమానంగా గౌరవిస్తా, పనిచేసే వారిని ప్రోత్సహిస్తా. పార్టీ లేకపోతే మనం ఎవరూ లేం అని గుర్తుంచుకోవాలి. ఇవాళ మనకు సమాజంలో గౌరవం లభిస్తోందంటే అందుకు కారణ తెలుగు దేశం పార్టీనే.

## కార్యకర్తల సమస్యలు తెలుసుకుని, అండగా నిలబడాలి

ఎన్నికల్లో గెలిచాం, తిరుగులేదనే ధోరణి సరికాదు. నిత్యం ప్రజల్లో ఉండాలి. మంగళగిరిలో నేను 91వేల మెజార్టీతో గెలిచా. నాకు ఎంత పని ఒత్తిడి ఉన్నా మంగళగిరి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నా. బాధ్యత పెరిగింది. కార్యకర్తల సమస్యలు తెలుసుకుని, వారికి అండగా నిలబడాలి. అలకలు మానుకుని నాయకులు సమిష్టిగా పనిచేయాలి. గత ఐదేళ్లలో మనం అనేక కష్టాలు ఎదుర్కొన్నాం. అక్రమ కేసులు పెట్టారు, లాఠీఛార్జి చేశారు. అవన్నీ మర్చిపోకూడదు. ఇది మన కుటుంబం. పార్టీలో సంస్కరణల కోసం అహర్నిశలు కష్టపడుతున్నా. పార్టీలో పొలిట్ బ్యూరో ఉంటుంది. అందులో చర్చ జరగాలి. తర్వాత నిర్ణయం తీసుకోవాలి.

మంగళగిరిలో లక్ష సభ్యత్వాలు అయ్యాయి. శాశ్వత సభ్యత్వాలు దాదాపు 180 వరకు చేశాం. ఇక్కడ ఆ స్థాయిలో జరగలేదు. పార్టీని బలోపేతం చేసేందుకు అందరం కష్టపడాలి. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఎవరు పనిచేశారో తెలుసుకుని వారికే పదవులు ఇస్తాం. అందరూ కలిసికట్టుగా పనిచేయాలి. త్వరలో నూతన విధానం తీసుకువస్తున్నాం. జాతీయ అధ్యక్షుల వారి నుంచి బూత్ ఇంఛార్జ్, బూత్ కమిటీ సభ్యుల వరకు అందరం కుటుంబ సాధికార సారధిలో(కేఎస్ఎస్) నమోదు కావాల్సి ఉంటుంది.

పార్టీ సభ్యత్వం తీసుకున్న తర్వాత పార్టీ పదవి కావాలన్నా, నామినేటెడ్ పోస్టు కావాలన్నా కేఎస్ఎస్ లో ఉండాలి. పార్టీ ఏ పిలుపు ఇచ్చినా 120 మంది ఓటర్లతో కూడిన కేఎస్ఎస్ ను కలవాలి, వారికి చెప్పాలి. కేఎస్ఎస్ కార్యక్రమం తర్వాత క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జ్ లను నియమిస్తాం. అనంతరం గ్రామ కమిటీలు, వార్డు కమిటీలు, పట్టణ కమిటీలు నియమిస్తాం. మహానాడు తర్వాత రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేస్తాం.

## వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

పార్టీ ఏ కార్యక్రమం పిలుపునిచ్చినా కలిసికట్టుగా పనిచేయాలి. ప్రజల్లోకి తీసుకెళ్లాలి. గ్రూప్ రాజకీయాలకు దూరంగా ఉండాలి. మన లక్ష్యం ఒక్కటే పార్టీ బలోపేతం కావాలి. అందుకు అహర్నిశలు కష్టపడాలి. ఈ రోజు వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. కానీ పెద్దపెద్ద మాటలు చెబుతున్నారు. టీడీపీ హయాంలోనే పెన్షన్ వెయ్యి రూపాయలకు పెంచాం. జగన్ రెడ్డికి వెయ్యి పెంచడానికి నాలుగున్నరేళ్లు పట్టింది. నేడు మనం వృద్ధాప్య పెన్షన్ రూ. 4 వేలు, వికలాంగ పెన్షన్ రూ. 6 వేలు, పూర్తి వికలాంగులకు రూ.15 వేలు పెన్షన్ అందిస్తున్నాం. దేశంలో ఈ స్థాయిలో ఎక్కడా పెన్షన్ అందించడం లేదు. అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేసింది టీడీపీనే. గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఏప్రిల్, మే నెల నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలుచేస్తామని చంద్రబాబు చాలా స్పష్టంగా చెప్పారు. జగన్ రెడ్డి సంపూర్ణ మద్యపాన నిషేధం హామీ ఏమైంది? సీపీఎస్ రద్దు చేస్తామన్నారు, ఏమైంది? ఇవన్నీ మనం మాట్లాడాలి. వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి. ఆర్థిక ఇబ్బందులు ఉన్నమాట వాస్తవం. జగన్ రెడ్డి అన్నీ అప్పులు చేసి పోయారు.

అయినప్పటికీ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం, పెన్షన్ అందిస్తున్నాం, టీఏ, డీఏ బకాయిలు చెల్లిస్తున్నాం. వైసీపీ నేతలు రెడ్ బుక్ గురించి మాట్లాడుతున్నారు. వైసీపీ నాయకులు ప్రజలను, మనల్ని ఇబ్బంది పెట్టారు. తప్పుచేసిన వారిని పద్ధతి ప్రకారం చట్టపరిధిలో శిక్షిస్తాం.

## నాకు కోటి మంది పార్టీ కుటుంబ సభ్యులు

పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి పనిచేయాల్సిన అవసరం ఉంది. పార్టీ ఏ పిలుపునిచ్చినా జయప్రదం చేయాలి. కూటమి నేతలను కలుపుకుని పోవాలి. ఏదైనా సమిష్టిగా చర్చించుకుని సమస్యలను పరిష్క రించుకోవాలి. నాకు పార్టీ సుప్రీం. పార్టీ లేకపోతే యువగళం లేదు,




లోకేష్ లేడు. నాకు పదవులు ముఖ్యం కాదు. పార్టీని బలోపేతం చేసేం దుకే నేను ఇక్కడ ఉన్నాను. అందుకే కార్యకర్తలను కలుస్తున్నాం. నేను ఏ నియోజకవర్గానికి వెళ్లినా కార్యకర్తలతో సమావేశమవుతా. క్లస్టర్, యూనిట్, బూత్ లను బలోపేతం చేయాలి. నేను 80శాతం సమయం కార్యకర్తలు, నాయకులను కలిసేందుకు కేటాయిస్తున్నా.

నాయకులు కార్యకర్తలను కలుసుకుని వారి సమస్యలు పరిష్కరిం చాలి. పార్టీకి సమయం కేటాయించాలి. కార్యకర్తలకు ఏ పార్టీ చేయని విధంగా ప్రమాద బీమా రూ.5 లక్షలు చేశాం. త్వరలో కార్యకర్తల ఆరో గ్యానికి సంబంధించి కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టబోతున్నాం. కార్యకర్తల పిల్లలకు ఉద్యోగాలు కల్పించేందు పార్టీ కేంద్ర కార్యాలయంలో కేరీర్ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటుచేస్తాం. నాకు అక్కా చెల్లెళ్లు, అన్నాతమ్ముళ్లు లేరు. నాకు ఉన్నది కోటి మంది పార్టీ కుటుంబ సభ్యులు. మీకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తా.

## కార్పొరేటర్లతో సమావేశమైన నారా లోకేష్

కార్యకర్తలతో సమావేశం అనంతరం మంత్రి నారా లోకేష్ తిరుపతి నగరానికి కార్పొరేటర్లతో సమావేశం అయ్యారు. వార్డుల అభివృద్ధి కి ప్రభుత్వం నుండి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు


www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 20, ఫిబ్రవరి 2025 ||



## ‘ఓదెల 2’ టీజర్ కాశీ మహా కుంభమేళాలో లాంచ్

తమన్నా భాటియా హైలీ యాంటిసిపేటెడ్ మూవీ ‘ఓదెల 2’, ఇది 2021లో హిట్ అయిన ఓదెల రైల్వే స్టేషన్‌కి సీక్వెల్. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్స్ పై నిర్మాత డి మధు నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. నాగ సాధు పాత్రలో తమన్నా పెరోషియస్, స్టన్నింగ్ పోస్టర్స్ క్యూరియాసిటీని పెంచాయి. ఓదెల2 మేకర్స్ ఎక్సయిటింగ్ అప్డేట్ తో వచ్చారు. ఈ సినిమా టీజర్ ఫిబ్రవరి 22న కాశీ మహా కుంభమేళాలో లాంచ్ చేయనున్నారు. కాశీ మహా కుంభమేళాలో లాంచ్ కానున్న మొట్టమొదటి టీజర్ ‘ఓదెల 2’ కావడం విశేషం. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ అనౌన్స్ మెంట్ పోస్టర్ లో కుంభమేళా బ్యాక్ డ్రాప్ లో నాగసాధుగా కనిపించిన తమన్నా లుక్ డివైన్ వైబ్ తో పవర్ ఫుల్ గా వుంది. ఈ చిత్రం కోసం ప్రేక్షకులను అలరించే బ్రెత్ టేకింగ్ స్టంట్స్ ని పెర్ఫామ్ చేయడానికి తమన్నా భాటియా ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్నారు. ఓదెల2 భారీ బడ్జెట్, హై క్యాలిటీ ప్రొడక్షన్ వాల్యూస్ తో రూపొందిస్తున్నారు. ఈ సినిమా ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ని ఇవ్వబోతోంది.





## “దిల్ రూబా” ఆకట్టుకుంటుంది

### - ‘హే జింగిలి..’ పాట

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా “దిల్ రూబా”. ఈ సినిమాలో రుక్సర్ థిల్లాన్ హీరోయిన్ గా నటిస్తోంది. “దిల్ రూబా” చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. “దిల్ రూబా” సినిమా మార్చి 14న హోలీ పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో జరిగిన ఈవెంట్ లో “దిల్ రూబా” సెకండ్ సింగిల్ ‘హే జింగిలి..’ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా

హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ – “దిల్ రూబా” మూవీ చేసినందుకు చాలా గర్వంగా హ్యాపీగా ఫీలవుతున్నాను. ఇంటెన్స్ మ్యూజికల్ లవ్ స్టోరీగా “దిల్ రూబా” మీ అందరినీ ఆకట్టుకుంటుంది. సారెగమా వాళ్లు ఫస్ట్ టైమ్ ఈ మూవీతో టాలీవుడ్ లోకి వస్తున్నారు. ప్రొడ్యూసర్ రవి, డైరెక్టర్ విశ్వకరుణ్ మూడేళ్లుగా ఈ ప్రాజెక్ట్ కోసం కష్టపడ్డారు. వాళ్ల కోసమైనా ఈ మూవీ తప్పకుండా సక్సెస్ కావాలి. వాలెంటైన్స్ డే సందర్భంగా “దిల్ రూబా” రిలీజ్ చేయాలని అనుకున్నాం. అయితే కంగారుగా మూవీని రిలీజ్ చేయడం ఎందుకని ఆగాం. సంక్రాంతి సినిమాలు కంప్లీట్ అయ్యాక, కంటెంట్ ను ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుని, ప్రమోషన్ ప్లాన్ చేసుకుని మార్చి 14న హోలీ పండుగ రోజు రిలీజ్ చేయాలని ఫిక్స్ అయ్యాం. హోలీ మంచి డేట్. ప్రొడ్యూసర్స్ సపోర్ట్ వల్ల ఎలాంటి తొందరపాటు లేకుండా మూవీని రిలీజ్ చేయగలుగుతున్నాం. రుక్సర్ ఈవెంట్ కు వచ్చింది. తనతో వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. హే జింగిలి పాటలో మా పెయిర్ బాగుంటుంది. భాస్కరభట్ల నన్ను బ్రదర్ లా చూసుకుంటారు. ఎస్ఆర్ కల్యాణమండపం సినిమా నుంచి మేము కలిసి ట్రావెల్ చేస్తున్నాం. నా మూవీకి పాట రాసేప్పుడు ఎంతో శ్రద్ధ తీసుకుంటారు. ఆయనకు పాట వెళ్తుందంటే నేను నిశ్చింతగా ఉంటాను. సామ్ సీఎస్ గారు “దిల్ రూబా”కు బ్యూటిఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. అగ్గిపుల్లె ఛాట్ బస్టర్ అయ్యింది. హే జింగిలి పాటకు కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది. త్వరలోనే థర్డ్ సింగిల్ రిలీజ్ చేయబోతున్నాం అన్నారు.

## చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో మణిశర్మ రక్తదానం

తెలుగు చిత్రపరిశ్రమలో ఎవరెస్ట్ శిఖరం మెగాస్టార్ చిరంజీవి. వెండితెరపై నటనతో పాటు డాన్సులతోనూ అలరించే ఆయన చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌ను స్థాపించి తన అభిమానుల సహకారంతో ఎనలేని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. చిరంజీవి మానస పుత్రిక అయిన చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో అభిమానులు, సినీ సెలబ్రిటీలు ఎందరో రక్తదానం చేస్తుంటారు. తాజాగా ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ రక్తదానం చేసి చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇలా మణిశర్మ రక్తదానం చేయటం ఇది రెండోసారి కావటం విశేషం. ‘రక్తదానం ’తో లక్షలాది ఆపన్నుల ప్రాణాలు నిలపాలన్న చిరంజీవి ఆశయాన్ని తమ సంకల్పాన్ని భావించి రక్తదానం చేసిన అభిమానులెందరో.. వారిలో తన స్వరాలతో ప్రేక్షకుల్ని మైమరపించే స్వరబ్రహ్మ ‘మణిశర్మ’ ఒకరు. చిరంజీవి పిలుపును కర్తవ్యంగా భావించి నేడు ఈ మహత్కార్యంలో భాగమై రక్తదానం చేసిన మణిశర్మ మరెందరికో స్ఫూర్తిగా నిలిచారు. పాటలకు స్వరాలు కూర్చడమే కాదు.. మానవత్వానికి చిరునామాగా నిలవడమూ తెలుసునని నిరూపించారు మణిశర్మ.



## ‘బాపు’ట్రైలర్ చూడాలనే క్యూరియాసిటీ క్రియేట్ చేసింది -నాగ్ అశ్విన్

వెర్సటైల్ యాక్టర్ బ్రహ్మాజీ లీడ్ రోల్ లో ఒకరిగా ఆమని, బలగం సుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్న డార్క్ కామెడీ–డ్రామా ‘బాపు’. ఈ చిత్రానికి దయా దర్శకత్వం వహిస్తున్నారు. కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అథీరా ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై రాజు, సిహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా ఫెబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. స్టార్ డైరెక్టర్స్ నాగ్ అశ్విన్, చందూ మొండేటి, బుచ్చిబాబు సాన, హీరో సత్యదేవ్, మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది. నాగ్ అశ్విన్ మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. బాపు మూవీ టీంకి థాంక్ యూ. బాపు ట్రైలర్ చూశాను. ట్రైలర్ చివర్లో ఓ డోర్ దగ్గర ఫ్యామిలీ అంతా చూస్తూ వుంటుంది. అసలు ఏం చూస్తున్నారనే క్యూరియాసిటీ కలిగింది. ట్రైలర్ చాలా బాగా కట్ చేశారు. ఇది చాలా మంచి సినిమా అవుతుందనే నమ్మకం వుంది. సినిమా టాక్ బావుంటే మన తెలుగు ఆడియన్స్




సెకండ్ డే నుంచి హౌస్ ఫుల్ చేస్తారు. ఈ సినిమాకి అన్నీ గుడ్ వైబ్స్ వున్నాయి. మ్యూజిక్, స్టార్ కాస్ట్ అంతా ఇంప్రెసివ్ గా వుంది. మణి స్క్రీన్ మీద ఇంటెన్స్ గా ఉంటాడు. బ్రహ్మాజీ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ఆయనకి ఎంత నాలెడ్జ్ వుంది అసలు(నవ్వుతూ). టీం అందరికీ ఆల్ ది బెస్ట్. ఫిబ్రవరి 21న థియేటర్స్ లో కలుద్దాం’అన్నారు. సత్యదేవ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా హిట్ అవుతుందని చెప్పడానికి రెండు మూడు రీజన్స్ వున్నాయి. ముప్ఫై ఏళ్ళుగా ఎవరికీ కనిపించకుండా దాచుకున్న బ్రహ్మాజీ అన్న తెల్ల జుట్టు ఈ సినిమాలో కనిపించింది(నవ్వుతూ). ఖచ్చితంగా ఈ సినిమా ఆడుతుంది. అంత నేచురల్ గా చేశారు. బ్రహ్మాజీ అన్న తన భుజంపై వేసుకొని ప్రమోట్ చేశారు. ట్రైలర్ లో రా ఎమోషన్ కనిపిస్తోంది. టీం అందరికీ ఈ సినిమా మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను.

## “జాట్” డబ్బింగ్ ప్రారంభం

బాలీవుడ్ లెజెండ్ సన్నీ డియోల్, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని మోస్ట్ ఎవైటెడ్ మూవీ “జాట్” విడుదలకు సిద్ధమవుతోంది. ప్రతిష్టాత్మక మైత్రి మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లపై డైనమిక్ ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 10, 2025న థియేటర్లలో విడుదల కానుంది.



తాజాగా ఈ సినిమా డబ్బింగ్ ని ప్రారంభించారు మేకర్స్. ఇప్పటికే జాట్ టీజర్ అందరినీ ఆకట్టుకొని సినిమా మోస్ట్ బ్లాస్ట్ యాక్షన్ డ్రామాగా వుండబోతోందని హామీ ఇచ్చింది. ఈ చిత్రంలో రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కాసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. “జాట్” చిత్రానికి సంగీతం థమన్ ఎస్, రిషి పంజాబీ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్‌ను నిర్వహిస్తున్నారు. అనల్ అరసు, రామ్ లక్ష్మణ్, వెంకట్ కొరియోగ్రఫీ చేసిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయని హామీ ఇస్తున్నాయి. ఆడియన్స్ అడ్రినలిన్ రష్ తో కూడిన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించే ‘జాట్’ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## ‘మజాకా’లో ఇప్పటివరకూ చేయని క్యారెక్టర్ చేశాను - రీతూ వర్మ

**పీపుల్స్ స్టార్ సందీప్ కిషన్ ల్యాండ్‌మార్క్ 30వ సినిమా ‘మజాకా’కి ధమాకా మేకర్ త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎకె ఎంటర్‌టైన్మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్ పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మాస్ ఎంటర్‌టైనర్‌లో రీతు వర్మ హీరోయిన్. మన్మధుడు ఫేమ్ అన్షు, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, సాంగ్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ హైలీ ఎంటర్ టైనింగ్ మూవీ శివరాత్రి కానుకగా ఫిబ్రవరి 26న థియేటర్లలో గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ రీతూ వర్మ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.**

**ఈ సినిమా చేయడానికి మిమ్మల్ని ఎట్రాక్ట్ చేసిన ఎలిమెంట్స్ ఏమిటి ?**

ప్రసన్న ఈ కథ చెప్పినపుడు చాలా ఎంటర్ టైనింగ్ గా అనిపించింది. అదే సమయంలో కథ హై ఎమోషనల్ కోషేంట్ గా వుంది. రెండు ఫీమేల్ క్యారెక్టర్స్ కి కథ లో చాలా ఇంపార్టెన్స్ వుంది. నరేషన్ చాలా నచ్చింది. త్రూ అవుట్ నవ్వుతూనే వున్నాను.

**సినిమాలో మీకు మెమరబుల్ మూమెంట్ అంటే?**


సెకండ్ హాఫ్ లో నాకు రావు రమేష్ కి ఓ సింగిల్ టేక్ సీన్ వుంది. ఆ రోజు షూట్ చేసినప్పుడు అవుట్ పుట్ విషయంలో అందరూ చాలా హ్యాపీ అయ్యారు. సీన్ చాలా అద్భుతంగా వచ్చింది. రావు రమేష్ డబ్బింగ్ పూర్తి చేసి ఫోన్ చేశారు. ఆ సీన్ గురించి మాట్లాడుతూ.. ‘చాలా అద్భుతంగా చేశావ్ అమ్మా..16 నా ఏళ్ల కెరీర్ లో అలాంటి సీన్ చూడాలేదు’అని ఆయన చెప్పడం నాకు చాలా మెమరబుల్. ఈ సినిమా షూటింగ్ చాలా ఎంజాయ్ చేస్తూ చేశాం. సెట్స్ లో అందరూ ఎనర్జిటిక్ గా వుండేవారు. అదే ఎనర్జీ ప్రమోషన్స్ లో కూడా కనిపిస్తుంది. బాటిల్ రీల్ కి మంచి రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా వుంది.

**త్రినాథ్ రావు సినిమాలు ఎంటర్టైనింగ్‌గా వుంటాయి. ఈ సినిమా ఎలా వుండబోతోంది?**

ఫుల్ ఎంటర్ టైనింగ్ గా వుండబోతోంది. లాట్స్ అఫ్ కామెడీ. హై ఆన్ ఎమోషన్. సాంగ్స్ చాలా గ్రాండియర్ గా వుంటాయి. టీజర్ అందరికీ నచ్చింది. చాలా పాజిటివ్ వైబ్స్ వున్నాయి. తప్పకుండా అందరూ ఎంజాయ్ చేశారు.

**ఇందులో మీ క్యారెక్టర్ ఎలా ఉంటుంది ?**

ఇందులో యంగ్ కాలేజ్ గర్ల్ గా కనిపిస్తా. బాల్యంలో ఎమోషనల్ కాన్ ఫ్లిక్ట్ వలన తనపై ఎలాంటి ఎఫెక్ట్ పడింది?



సందీప్ క్యారెక్టర్ తో తన రిలేషన్ షిప్ ?.. ఇలా చాలా ఇంట్రస్టింగ్ గా వుంటుంది. నా క్యారెక్టర్‌ని కొత్తగా ప్రజెంట్ చేశారు. ఇప్పటి వరకూ చేయని క్యారెక్టర్‌లో కనిపిస్తా. ఆడియన్స్‌కి నచ్చుతుందనే నమ్మకం వుంది.

**సందీప్ కిషన్‌తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

సందీప్ చాలా పాజిటివ్ పర్సన్. లవ్లీ కోస్టార్. చాలా ఎనర్జిటిక్ గా వుంటారు. చాలా సపోర్టివ్. ఆయనతో వర్క్ చేయడం వండర్ ఫుల్ ఎక్స్ పీరియన్స్.

**అన్షుతో యాక్ట్ చేయడం ఎలా అనిపించింది ?**

తను చాలా పాజిటివ్ పర్సన్. చాలా హార్డ్ వర్కింగ్. తెలుగు క్లాసులు కూడా తీసుకుంది. తన కం బ్యాక్ గురించి నేనూ ఎక్సయిటెడ్‌గా ఎదురుచూస్తున్నాను.

## రొమాంటిక్ ప్రొడ్యూసర్‌తో సాయిపల్లవి

లేడీ పవర్‌స్టార్ అంటే చాలు టాలీవుడ్‌లో ఓ క్రేజ్ ఉంది. ఇంతకీ ఎవరో తెలుసుకదా..హైబ్రిడ్ పిల్ల ఒక్కటే పీస్ సాయిపల్లవి. ఇక ఈమెను ఒక కథ చెప్పి దాంట్లో నటించడానికి ఒప్పించాలంటే దర్శకులకు తల ప్రాణం తోకకి వస్తది అంటారు కదా అలా ఉంటది. ఆమెకు చాలా రిస్ట్రిక్షన్స్ ఉంటాయి. అంత తేలికగా ఒప్పుకోదు. అలాగే పాత్రల విషయంలో కూడా ఆచి తూచి అడుగుతు వేస్తది. రెమ్యూనరేషన్ ఎంత ఆఫర్ చేసినా సరే తాను అనుకున్న గీత మాత్రం దాటదు. ఆమె నుంచి ఓ కథ విన్నాక యస్ అనే పదం రావాలంటే చాలా కష్టపడాలి. మరి అలాంటిది ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో నితీష్ తివారితో కలిసి ఓ చిత్రం చేయబోతుంది. అందులో ఆమె సీత పాత్రని పోషిస్తుంది. ఇక దీంతో ప్రస్తుతం బాలీవుడ్‌లోని బడా నిర్మాతల కళ్ళన్నీ సాయిపల్లవిపైనే పడ్డాయి. ఆమెకోసం నిర్మాతలు క్యూ కడుతున్నారనుకోండి. ఉదాహరణకు కరణ్‌జొహర్ ప్రస్తుతం ఆమెతో సినిమా తీయాలనుకుంటున్నారు. ధర్మ ప్రొడక్షన్స్‌లో ఆమెకు ఆఫర్ ఇద్దామని చూస్తున్నారు. మరి ఇది ఆయ్యే పనేనా అంటే కాస్త కష్టమే అని చెప్పాలి. ఎందుకంటారా... కరణ్ టేస్టేమో కాస్త రొమాంటిక్‌గా ఉంటుంది. ఆయన తీసే చిత్రాలన్నీ రొమాంటిక్ చిత్రాలు తీస్తారు. మన సాయిపల్లవి ఏమో రొమాన్స్‌కి గ్లామర్ పాత్రలకి కాస్త దూరంగ ఉంటది. మరి ఇది జరిగే పనేనో కాదో తెర మీద వేచి చూడాలి మరి.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144